ప్రజాపక్షం 7th ANNIVERSARY 22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


ఆశ్చర్యానికి గురిచేశాయ్
బీహార్ ఎన్నికలు మొదటినుంచి న్యాయంగా జరగలేదు : రాహుల్



04


సంపుటి 08, సంచిక: 344 | శనివారం | 15-11-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జయకేతనం

**24,729 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందిన నవీన్ యాదవ్**

నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజారిటీ రికార్డు

డిపాజిట్ కోల్పోయిన బిజెపి అభ్యర్థి దీపక్‌రెడ్డి

ఏ రౌండ్‌లోనూ ఆధిక్యం చూపని బిఆర్‌ఎస్

16 ఏళ్ల తర్వాత జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా రెపరెపలు

గెలిపించిన ప్రజలందరికీ పాదాభివందనం : నవీన్‌యాదవ్



ప్రజాపక్షం/హైదరాబాద్

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. 16 సంవత్సరాల తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలి రౌండ్ నుంచి చివరి వరకు నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. మొదటి నుంచి చివరి వరకు ఏకపక్ష విజయాన్ని నమోదు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వ్యక్తిగా నవీన్ యాదవ్ నిలిచారు. ఈ ఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేసిన లంకల దీపక్ రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోలయ్యాయి. బిజెపి అభ్యర్థి దీపక్ రెడ్డి 17,061 ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. జూబ్లీహిల్స్ పోరులో మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ, నోటా 924 ఓట్లతో నాలుగో స్థానంలో నిలవడం విశేషం. లెక్కింపు ప్రక్రియలో ఏ దశలోనూ బిఆర్ఎస్ అభ్యర్థి సునీత కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు పోటీ ఇవ్వలేకపోయారు. రౌండ్ రౌండ్‌కు మెజార్టీని పెంచుకుంటూ నవీన్ యాదవ్ తన గెలుపును ఖాయం చేసుకున్నారు. హైదరాబాద్ యూసుఫ్ గూడ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల సంఘం

తరువాయి 12లో

# బీహార్‌లో ఎన్‌డిఎకు ఏకపక్ష ఫలితాలు

## ఎన్‌డిఎ – 203 ఘట్‌బంధన్ – 34 ఎంఐఎం – 5

**పాట్నా:** ‘ఓటు చోరీ’ ఆరోపణలు... విమర్శలు, ప్రతి విమర్శలతో అట్టుడికిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ విజయం సాధించింది. 243 స్థానాలకుగాను 203 స్థానాల్లో ఆధిక్యాన్ని ప్రదర్శించింది. కాంగ్రెస్, ఆర్‌జెడి తదితర పార్టీలతో కూడిన మహా ఘట్ బంధన్ (ఎంజిబి) 34 స్థానాల్లో మెరుగైన ప్రదర్శననివ్వగా, ఎంఐఎం ఐదు స్థానాలను సొంతం చేసుకున్నది. ఎన్నికల వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిశోర్ పెట్టిన సొంత పార్టీ జన్ సూరజ్ పార్టీ (జెఎస్‌పి) దారుణంగా విఫలమైంది. ఒక్క స్థానంలోనూ ఆ పార్టీ రాణించలేకపోయింది.ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి అభ్యర్థి కావడంతో, విజయంపై ఎంజిబి ఎన్నో ఆశలు పెట్టుకుంది. బిజెపి మొత్తం 101 స్థానాల్లో పోటీ చేయగా, 89 స్థానాల్లో గెలుపొందింది. గత ఏడాది

తరువాయి 2లో



### సుపరిపాలనకు విజయం : మోదీ



న్యూఢిల్లీ : బీహార్ ఎన్నికల ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. సుపరిపాలన, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం స్ఫూర్తికి నిదర్శనంగా అభివర్ణించారు. శుక్రవారం ఆయన ఎక్స్‌లో వరుస పోస్టులు చేశారు. బిజెపి కూటమి భాగస్వాములైన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఎల్‌జెపి ఆర్‌వి అధినేత చిరాగ్ పాస్వాన్, హెచ్‌ఎఎం నాయకుడు జితన్ రామ్ మాంఝీ, ఆర్‌ఎల్‌ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాలను కూడా మోదీ అభినందించారు. ‘2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎకు చరిత్రాత్మకమైన, అపూర్వమైన విజయాన్ని అందించిన బీహార్ కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు’ అని మోదీ అన్నారు. ప్రజల

తరువాయి 2లో

### ఎన్‌డిఎ గెలుపు అనుమానాస్పదం

సమన్వయ లోపానికి తప్పని మూల్యం: బీహార్ ఫలితాలపై డి.రాజా



**న్యూఢిల్లీ:** బీహార్‌లో ఎన్డీయే ఎన్డీయే విజయం సందేహాలభరితమని, ఎన్నికల ఫలితాలు ఆత్మ పరిశీలనను డిమాండ్ చేస్తున్నాయని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఎస్ఐఆర్‌లో భాగంగా 65 లక్షల ఓటర్ల పేర్లు తొలగించడం, ఓటర్ల అసలు సంఖ్య కంటే మూడు లక్షలకుపైగా ఓటర్లు ఉండటం అనేక ప్రశ్నలకు తావిస్తున్నదన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలపై డి.రాజా శుక్రవారం ఎక్స్ మాధ్యమంగా స్పందించారు. ఎన్నికల సంఘం లెక్కలపై అనుమానాలు

తరువాయి 2లో

### సమస్యల పరిష్కారమే గెలుపు ఫలితం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీలపై మరింత దృష్టిసారించాలి : సిపిఐ
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం పట్ల హర్షం
- బీహార్‌లో విజయం ఇసిదేనని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. విజ్ఞతతో ఓటు వేసిన ఓటర్లకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఎన్నికల ఫలితాన్ని గమనిస్తే ప్రజా సమస్యల పరిష్కారం అంశంపైనే ఓటర్లు ఓటు వేసినట్లు స్పష్టమవుతున్నదని అన్నారు. స్వయంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన సొంత పార్టీ బిజెపి అభ్యర్థికి డిపాజిట్ గల్లంతయ్యిందన్నారు. పదేండ్లు అదే నియోజకవర్గం ఎంపిగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంలో వైఫల్యం, హైదరాబాద్, తెలంగాణ పట్ల అన్ని రకాలుగా వివక్షత చూపుతున్న కేంద్ర ప్రభుత్వం వైఖరి పట్ల ప్రజలు చూపించిన తీవ్ర వ్యతిరేకతకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం నిదర్శనమన్నారు. పదేండ్లు

తరువాయి 2లో

# ఓడితే కుంగిపోం నెగ్గితే ఉప్పొంగం

**ప్రతిపక్షంలో ఉంటే ప్రజాసమస్యలపై పోరాడడం.. అధికారంలో ఉంటే పరిష్కరించడమే తెలుసు**

స్థానిక సంస్థల ఎన్నికలపై ఈనెల 17న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
– సిఎం రేవంత్ రెడి



- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం మరింత బాధ్యతను పెంచింది
- జిహెచ్‌ఎంసి ఎన్నికల్లోనూ ఇదే ఫలితాలొస్తాయ్
- కాంగ్రెస్ పదేళ్లు పాలిస్తుంది.. మార్పు చేసి చూపిస్తాం
- ఇప్పటికైనా కిషన్‌రెడ్డి వ్యవహారశైలి మార్చుకోవాలి
- ప్రభుత్వంపై బిఆర్‌ఎస్‌ది దుష్ప్రచారం
- హరీశ్‌రావు ఈర్ష, కెటిఆర్ అహంకారం తగ్గించుకోవాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారని సిఎం పేర్కొన్నారు. ఎన్నికల్లో నెగ్గితే ఉప్పొంగడం, ఓడితే కుంగిపోవడం కాంగ్రెస్ కు తెలియదని, ప్రతిపక్షంలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాడడం, అధికారంలో ఉంటే సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీకి తెలుసునని, అందుకే ప్రజల్లో కాంగ్రెస్‌పై ఇప్పటికీ ఆదరణ తగ్గలేదని సిఎం స్పష్టం చేశారు. ఈ ఫలితాల ద్వారా కాంగ్రెస్ గత రెండేళ్ల పాలనను ప్రజలు పరిశీలిస్తున్నట్లు స్పష్టమైందన్నారు. జిహెచ్‌ఎంసి ఎన్నికల్లోనూ ఇదే ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని వచ్చే పదేళ్లపాటు కాంగ్రెస్ పరిపాలిస్తుందని, మార్పు చేసి చూపిస్తామని సిఎం అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని కాంగ్రెస్ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులతో

తరువాయి 2లో

# ఫలితాలు కొత్త ఊపునిచ్చాయ్

- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బిఆర్‌ఎస్ ఒక్కటే
- ఇక ప్రజాసమస్యలపై పోరాటం చేస్తాం
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు కొత్త ఉత్సాహం, బలాన్నిచ్చిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నయం బిఆర్ఎస్ ఒక్కటే అని ప్రజలు స్పష్టంగా తీర్పునిచ్చారని తెలిపారు. తెలంగాణ భవన్‌లో కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ ఇకపై ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. వ్యక్తిగత సమస్యలు ఉన్నప్పటికీ పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు ఎంతో ఉత్సాహంగా పనిచేశారన్నారు. గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ సమర్థవంతమైన పాత్ర

తరువాయి 12లో

# ప్రజాతీర్పును శిరసావహిస్తాం

- జూబ్లీహిల్స్ ఒక్క కార్పొరేటరూ గెలవలేదు
- ఎంఐఎం సహకరించడంతోనే కాంగ్రెస్ గెలుపు : కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్‌లో తాము ఎప్పుడూ ఒక కార్పొరేటర్ కూడా గెలవలేదని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నుంచి ఎప్పుడు గెలవలేదన్నారు. ప్రజా తీర్పును తాము శిరసా వహిస్తామన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. తాము ఉన్నంతలో ప్రయత్నం చేశామని చెప్పారు. ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని తెలిపారు. ప్రత్యేక పరిస్థితులలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జరిగాయని, తమ పార్టీ అక్కడ బలహీనంగా ఉందని

తరువాయి 12లో



# ఎన్‌డిఎ గెలుపు.. కార్మికులకు కష్టాలు

**పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపు**

ప్రజాపక్షం/హైదరాబాద్

బీహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి గెలవడంతో కార్మికవర్గానికి భవిష్యత్‌లో కష్టాలు వస్తాయని, కార్మికవర్గం పటిష్టంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపిచ్చారు.హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఎఐటియుసి అనుబంధ సంఘాల సమావేశం ఎం.డి. యూసఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎంఎల్‌ఎ సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని అందుకు కార్మిక లోకం పోరాటాలు చేయాలని అన్నారు. కార్మికులు బలోపేతం అయ్యి పోరాటాలు నిర్వహిస్తేనే భవిష్యత్ ఉంటుందని,

తరువాయి 2లో

### నేటి నుంచి సిపిఐ ప్రచార జాతాలు

జోడేఘాట్ , బాసర, గద్వాల్ నుంచి ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మూడు జాతాలు ప్రారంభం కానున్నాయి. జోడేఘాట్ నుంచి ప్రారంభమయ్యే జాతాకు సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, బాసర నుంచి ప్రారంభమయ్యే జాతాకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, గద్వాల్ నుంచి ప్రారంభమయ్యే జాతాకు సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల నరసింహ నాయకత్వం వహిస్తారు. ఈ జాతాలు వివిధ జిల్లాలలో వారం రోజుల పాటు పర్యటించిన అనంతరం ‘ఇంటింటికి సిపిఐ’ కార్యక్రమంలో భాగంగా జిల్లాల వారీగా జాతాలను నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో వివరించారు.

# నెహ్రూ సేవలను అవమానిస్తున్నారు!

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ ఫైర్

భారత తొలి ప్రధానిని స్మరించుకున్న దేశం

**న్యూఢిల్లీ :** భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా యావత్ దేశ ప్రజలు ఆయనను స్మరించుకున్నారు. నెహ్రూ 1889లో ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో నవంబరు 14 జన్మించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ప్రముఖ వ్యక్తులలో ఒకరు. నెహ్రూ మే 27, 1964న తుది శ్వాస విడిచారు. కాగా, నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ అధినేత్రి సోనియా గాంధీ ఢిల్లీలోని శాంతి వాన్‌లోని నెహ్రూ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. ఆధునిక భారతదేశ నిర్మాణంలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన అపారమైన సహకారాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ‘తిరస్కరించాలని, అవమానించాలని, వక్రీకరించాలని, రాక్షసంగా చూపించాలని’ చూస్తున్నారని ఆరోపించింది. ఈ ఆరోపణల నుంచి భారతదేశపు మొదటి ప్రధానమంత్రి తన వారసత్వం ఈ ‘దాడి’



నుండి బయటపడాలని పేర్కొంది. నెహ్రూ నివాళి అర్పించిన అనంతరం ఖర్గే మాట్లాడుతూ నెహ్రూ సేవలను ప్రశంసించారు. ఆయన వారసత్వం ‘కాలాతీతమైన దీపస్తంభంగా నిలుస్తుంది. భారతదేశ ఆలోచనను , ఆయన గౌరవించిన విలువలు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రకాశవంతం చేస్తుంది’ అని అన్నారు. అతని

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పది ఏళ్ల విరామం తర్వాత లండన్‌లో సిరియా ఎంబసీ

**బీరుట్ :** సుమారు పది సంవత్సరాల అనంతరం, సిరియా విదేశాంగ మంత్రి అసాద్ అల్‌జిన్‌పింగ్‌బానీ, తమ దేశ ఎంబసీని లండన్‌లో అధికారికంగా పునఃప్రారంభించారు. బాషర్ అల్‌అసద్ మాజీ అధ్యక్షుడి పదవీ కాలం తర్వాత అంతర్జాతీయ సమాజంలో సిరియా మళ్లీ సంబంధాలు పునరుద్ధరించుకుంటున్నది. ఆ క్రమంలోనే అల్‌జిన్‌పింగ్‌బానీ యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటనకు వచ్చారు. తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా ఇటీవల అమెరికా పర్యటించారు. 1946లో సిరియా స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఒక అధ్యక్షుడు యుఎస్‌లో పర్యటించడం అదే మొదటిసారి. కాగా, లండన్‌లోని చాథం హౌస్ అంతర్జాతీయ వ్యవహారాల తాత్కాలిక సంక్షేమ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో, జిన్‌పింగ్‌బానీ పాల్గొన్నారు. బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఇవెట్ కూపర్‌తో జరిగిన భేటీ విజయవంతమైందని ఆయన పేర్కొన్నారు.

## నాలుగు ఐరోపా సంస్థలపై అమెరికా 'ఉగ్ర' ముద్ర

**వాషింగ్టన్ :** వామపక్ష భావాలున్న నాలుగు ఐరోపా విప్లవ సంస్థలపై అమెరికా 'ఉగ్ర' ముద్ర వేసింది. వాటిని ఉగ్రవాద సంస్థలుగా గుర్తించింది. కన్జర్వేటివ్ చార్లీ కిర్క్ హత్య తర్వాత వామపక్ష కార్యకలాపాలాపై కఠినంగా వ్యవహరిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే అమెరికా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ పరిపాలన ప్రతిపాదించిన నా నాలుగు సంస్థల కేంద్రాలు ఐరోపాలోన ఉన్నాయని సమాచారం. వీటికి అమెరికాలో ఎలాంటి కార్యకలాపాలు లేవు. 2003లో అప్పుడు ఉన్న యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు రోమానో ప్రోడీకి పేలుడు ప్యాకేజీలు పంపిన ఇటాలియన్ అనార్కిస్ట్ ఫ్రంట్, ఏథెన్స్‌లో పోలీసు బృందాలు, కార్మిక శాఖ భవనాల వెలుపల బాంబులు వేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెండు గ్రీకు నెట్‌వర్కులతోపాటు జర్మన్ అధికారులపై దాడికి దిగినట్టు పేర్కొంటున్న ఒక యాంటీ ఫాజిన్‌పింగ్‌స్ట్ గ్రూపును అమెరికా ఉగ్ర సంస్థలుగా గుర్తించింది.



ఈ సంస్థలకు అమెరికా నుంచి జరిగే ప్రత్యక్ష లేదా పరోక్ష మద్దతును ట్రంప్ సర్కారు అడ్డుకుంటుంది. ట్రంప్ సర్కారు లక్ష్యంగా ఎంచుకున్న నాలుగు యూరోపియన్ గ్రూపల్లో ప్రధానమైనది ఇంటర్నేషనల్ రివల్యూషనరీ ఫ్రంట్. దీనిని అనార్కిస్ట్ ఫెడరేషన్ అని కూడా పిలుస్తారు. ఇది 2003–04 నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. ఆర్మ్డ్ ప్రోలెటేరియన్ జస్టిస్ సంస్థపై 2023 డిసెంబరులో ఏథెన్స్ రైటు పోలీసు భవనానికి దగ్గరగా పేలుడు పరికరాన్ని ఉంచినట్టు ఆరోపణలు ఉన్నాయి. రెండు నెలల తర్వాత, గ్రీకు కార్మిక శాఖలో బాంబు పేలింది. అయితే, రివల్యూషనరీ క్లాస్ సెల్ఫ్‌డిఫెన్స్ అనే కొత్త నెట్‌వర్క్ దీని బాధ్యతను స్వీకరించింది. ఆండిఫా ఓస్ట్ (ఈస్ట్) సంస్థ జర్మనీ కేంద్రంగా పని చేస్తున్నది. హంగేరియన్ ప్రధాని విక్టర్ ఒర్బాన్, ట్రంప్ మిత్రుడు, శాసనకర్త, కిర్క్ హత్య తరువాత ఈ గ్రూపును ఉగ్రవాద సంస్థగా గుర్తించారు.

## రిఫరెండం రాజ్యాంగ విరుద్ధం

### బంగ్లాదేశ్ న్యాయ నిపుణుల అభిప్రాయం

ధాకా: బంగ్లాదేశ్ సలహాదారు ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం తలపెట్టిన రిఫరెండం రాజ్యాంగ విరుద్ధమని పలువురు న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పిటిఐ కథనాన్ని అనుసరించి 'జులై చార్టర్'పై ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతిస్తూ యూనస్ ప్రతిపాదించిన ఒక ఆర్డినెన్స్‌పై రాష్ట్రపతి మహమ్మద్ షహబుద్దీన్ సంతకం చేశారు. పదవీచ్యుతురాలైన నాటి ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌ను మినహాయించి, మిగతా అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరిపినట్టు యూనస్ అంతకు ముందు మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు. అవామీ లీగ్‌ను నిషేధించిన కారణంగా, ఆ పార్టీ నాయకులను సంప్రదించలేదని స్పష్టం చేశారు. జులై చార్టర్ అమలుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని, తద్వారా ప్రజలకు వాస్తవ పరిస్థితులు, వచ్చే ఫిబ్రవరిలో జరిగే సార్వత్రిక ఎన్నికలపై వివరాలు వివరించగలుగుతామని అన్నారు. అయితే, రిఫరెండం జరపడానికి ఆర్డినెన్స్ జారీ చేయడాన్ని ప్రముఖ న్యాయ నిపుణుడు, న్యాయశాస్త్ర మాజీ ప్రొఫెసర్ షహ్దీన్ మాలిక్ ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తప్పుపట్టారు. బంగ్లాదేశ్ రాజ్యాంగంలో ఎక్కడా ప్రజాభిప్రాయ సేకరణ ప్రస్తావన లేదని అన్నారు. జులై చార్టర్‌లో తీసుకున్న పలు నిర్ణయాలు, గెజెట్‌లోని



అంశాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. గెజెట్‌ను రాష్ట్రపతి చట్టపరంగా ఆమోదించలేరని అన్నారు. అయితే, యూనస్ మాత్రం రిఫరెండం జరపడాన్ని సమర్థిస్తున్నారు. ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ దేశం సైనిక పాలన కింద ఉండివుంటే, రాజ్యాంగం అమల్లో ఉండేది కాదని వ్యాఖ్యానించారు. ప్రజలు జులై చార్టర్‌లోని అంశాలను తెలుసుకోవాలని సూచించారు.

## హెచ్1బి వీసా రద్దుకు చట్టసభలో బిల్లు

### అమెరికా పార్లమెంటు సభ్యురాలు మర్జోరీ గ్రీన్

**న్యూయార్క్/వాజిన్‌పింగ్‌ంగ్టన్ :** దేశ పౌరసత్వానికి వీలు కల్పించే హెచ్1బి వీసా విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఒక ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) సభ్యురాలు మర్జోరీ గ్రీన్ తన సోషల్ మీడియా 'ఎక్స్' ఖాతాలో పెట్టిన వీడియో పోస్టులో తెలిపారు. వీసా గడువు ముగిసిన వెంటనే వారు తిరిగి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. 'నా ప్రియమైన అమెరికన్లారా, నేను హెచ్1బి వీసా కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేసే బిల్లును ప్రవేశపెడుతున్నాను. ఈ కార్యక్రమం దశాబ్దాలుగా మోసపూరితంగా కొనసాగుతున్నది. దుర్వినియోగం అవుతున్నది. ఈ కారణంగానే అమెరికన్ కార్మికులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యలు పెరుగుతున్నాయి' అని జార్జియాకు చెందిన మార్జోరీ ఆ వీడియోలో పేర్కొంది. ఈ బిల్లులో, ప్రతి సంవత్సరం 10,000 వీసాల పరిమితిని అనుమతిస్తూ ఒకే ఒక్క మినహాయింపు ఉంటుందని, అవి అమెరికన్లకు ప్రాణరక్షక సేవలను అందించే వైద్య నిపుణులు, డాక్టర్లు, నర్సులకు మాత్రమే జారీ అవుతాయని ఆమె వెల్లడించింది. ఈ 10,000 వార్షిక పరిమితిని కూడా 10 సంవత్సరాల్లో దశలవారీగా రద్దు చేస్తామని, తద్వారా అమెరికాలోనే డాక్టర్లు, వైద్య నిపుణులను తయారు చేసుకునే వ్యవస్థను నిర్మించడానికి సమయం లభిస్తుంది ఆమె వివరించింది. ఈ బిల్లు పౌరసత్వ మార్గాన్ని తొలగిస్తుందని, వీసా గడువు ముగిసిన వెంటనే వీసా కలిగినవారు స్వదేశానికి తిరిగి వెళ్లాలని వివరించింది. హెచ్1బి వీసాలు తాత్కాలికంగా అమెరికాలో పని చేసేందుకు నిర్దేశించినవని ఆమె గుర్తుచేసింది. ఒక నిర్దిష్ట సమయంలో ప్రత్యేక నైపుణ్యత అవసరాన్ని తీర్చడానికి మాత్రమే కావాల్సివచ్చిందని, ప్రజలు ఇక్కడ శాశ్వతంగా నివసించడానికి అనుమతించడం తగదని ఆమె వ్యాఖ్యానించింది. ప్రస్తుతం అమెరికాలో ప్రతి సంవత్సరం 65,000 సాధారణ హెచ్1బి వీసాల పరిమితి ఉంది, అలాగే అమెరికా అధునాతన డిగ్రీ కలిగినవారికి మరో 20,000 వీసాలు జారీ చేస్తారు. అమెరికన్ కంపెనీలు, ముఖ్యంగా టెక్నాలజీ కంపెనీలు, ప్రత్యేక నైపుణ్యాల వలసదారులను నియమించడానికి హెచ్1బి వీసాలను వినియోగిస్తాయి.

## విమానంలోనే 12గంటలు

### దక్షిణాఫ్రికాలో చిక్కుకుపోయిన 150 మందికి పైగా పాలస్తీనియన్లు



**జోహానెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికాలో 150 మందికి పైగా పాలస్తీనియన్లు సుమారు 12 గంటల పాటు ఒక విమానంలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరిలో ఒక గర్భిణి కూడా ఉంది. ప్రయాణ పత్రాల్లో ఏర్పడిన సమస్యల కారణంగా గంటల తరబడి ప్రయాణికులను విమానంలోనే నిలువరించడంపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. విమానంలో చిక్కుకుపోయిన ప్రయాణికులను కలిసేందుకు అనుమతి పొందిన ఒక పాస్టర్, అక్కడ పరిస్థితి చాలా భయంకరంగా ఉందని, పిల్లలు అరుస్తూ, ఏడుస్తూ ఉన్నారని తెలిపారు. పాలస్తీనియుల బృందం గురువారం ఉదయం కెన్యాలోని నైరోబీ నుండి ప్రయాణం కొనసాగించిన ఒక చార్టర్ విమానంలో దక్షిణాఫ్రికాలోని జోహానెస్‌బర్గ్ ఒఆర్ టాంబో అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది అని దక్షిణాఫ్రికా బోర్డర్ మేనేజ్మెంట్ అథారిటీ తన ప్రకటనలో తెలిపింది.

ఇజ్రాయెల్ అధికారుల ఎగ్జిట్ స్టాంపులు లేకపోవడం, వారు దక్షిణాఫ్రికాలో ఎంతకాలం ఉండబోతున్నారో తెలియజేయకపోవడం, అలాగే స్థానిక చిరునామాలు ఇవ్వకపోవడం వలన, వలస అధికారులు వారికి ప్రవేశాన్ని నిరాకరించారని ప్రకటనలో వివరించింది. దక్షిణాఫ్రికా హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవడంతో పాటు, ఒక స్థానిక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వారికి నివాస సౌకర్యం కల్పించేందుకు ముందుకు రావడంతో, మొత్తం 153 మంది ప్రయాణికులను విమానం నుండి బయటకు వచ్చేందుకు అధికారులు అనుమతించారు. బోర్డర్ మేనేజ్మెంట్ అథారిటీ ప్రకారం, తరువాత 23 మంది ఇతర దేశాలకు వెళ్లగా, 130 మంది దక్షిణాఫ్రికాలో మిగిలారు.

## సుపరిపాలనకు విజయం

(మొదటి పేజీ తరువాయి)

తీర్పు ఎన్‌డిఎ ప్రజలకు సేవ చేయడానికి, బిహార్ కోసం కొత్త సంకల్పంతో పనిచేయడానికి తమకు మరింత శక్తినిస్తుందని ప్రధాని అన్నారు. 'బిహార్‌లో ఎన్‌డిఎ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని నిర్ధారించింది. మా ట్రాక్ రికార్డ్, రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలనే మా దార్శనికతను చూసిన తర్వాత ప్రజలు మాకు భారీ మెజారిటీని ఇచ్చారు' అని మోదీ అన్నారు. అవిశ్రాంతంగా పనిచేసిన, పాలక కూటమి అభివృద్ధి ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రతి ఎన్‌డిఎ కార్యకర్తకు కూడా ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో తాము బిహార్ అభివృద్ధి వైపు చురుకుగా పని చేస్తామని, అక్కడి మౌలిక సదుపాయాలకు, రాష్ట్ర సంస్కృతికి కొత్త గుర్తింపును ఇస్తామన్నారు. యువశక్తి, మహిళా శక్తి సంపన్న జీవితానికి తగినంత అవకాశాలను పొందేలా చూస్తామని మోదీ పేర్కొన్నారు.

## గెలుపు ఫలితం

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడమే ఆ పార్టీ ఓటమికి కారణమని, పైగా సానుభూతి పనిచేయడంలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం ద్వారా ప్రజలు ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని సూచిస్తున్నదని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మరింత బాధ్యతగా సమస్యల పరిష్కారం, హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికలలో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఉప ఎన్నికలలో సిపిఐ, కాంగ్రెస్‌కు మద్దతు తెలపడమే కాకుండా ప్రచారం చేశామని సాంబశివరావు గుర్తు చేశారు.

**బిహార్‌లో విజయం ఇసిదే**

బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్‌డిఎ సాధించిన విజయం ఆ కూటమిది కాదని ఎన్నికల కమిషన్‌దేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎన్నికల ముంగిట ఆ రాష్ట్రంలో 75 లక్షల మంది మహిళల బ్యాంక్ ఖాతాలకు నితీష్‌కుమార్ ప్రభుత్వం రూ.10 వేల నగదు బదిలీ చేసినా ఎన్నికల సంఘం ఏమాత్రం పట్టించుకోలేదని, అలాగే ఎస్‌ఐఆర్ పేరుతో 65 లక్షల ఓట్లు తొలగించారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇవ్వన్ని కూడా ఎన్‌డిఎ కూటమి విజయానికి దోహదం చేశాయని అన్నారు. విపక్ష మహా ఘట్‌బంధన్ సైతం ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకోకపోవడంతో ప్రజలలో కూటమి పట్ల నెలకొన్న సానుకూలతను ఉపయోగించు కోలేక పోయిందని అన్నారు. భవిష్యత్‌లో దీనిని ఒక పాఠంగా తీసుకుని సాధ్యమైనంత త్వరగా సర్దుబాటు చేసుకోవాలని ఈ ఎన్నికలు సూచిస్తున్నాయని అన్నారు.

## ఏకపక్ష ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవం నుంచి బిజెపి బయటపడింది. కాగా, భారీగా తరలి వచ్చిన మహిళా ఓటర్లే ఈ ఫలితాల్లో కీలకమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో గెలిచిన ఎన్‌డిఎ బిహార్‌లో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడియు గత ఎన్నికల్లో కేవలం 43 సీట్లతో సరిపుచ్చుకుంది. అయితే, ఈసారి ఆ పార్టీ బలాన్ని కూడగట్టుకుంది. ఇప్పటికే 24 స్థానాలను కైవసం చేసుకుంది. మరో 64 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. సాధారణ మెజారిటీ 122 సీట్లుకాగా, ఎన్‌డిఎ ఆ మైలురాయిని సులభంగానే అధిగమించింది. ఇలావుంటే, బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ, మంత్రులు ప్రేమ్ కుమార్, మహేశ్వర్ హజారీ, సంజయ్ సరౌగీ గెలిచిన ప్రముఖుల జాబితాలో ఉన్నారు. ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ విజయం సాధించారు. గత ఎన్నికల్లో వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ (విఐపి) టికెట్‌పై గెలుపొంది, ఆ తర్వాత బిజెపిలో చేరిన ప్రస్తుత బిహార్ టూరిజం శాఖ మంత్రి రాజు కుమార్ సింగ్ తన సమీప ప్రత్యర్థి, ఆర్‌జెడి అభ్యర్థి పృథ్వీ నాథ్ రేపై విజయం సాధించారు. లోక్‌జన్‌శకి పార్టీ (రామ్‌విలాస్) అభ్యర్థి రాజు తివారీ గవింద్‌గంజ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు చెందిన శశి భూషణ్ రాయ్‌పై గెలుపొందారు. జమూయ్ నియోజకవర్గంలో బిజెపి నేత శ్రేయసి సింగ్ తన సమీప ఆర్‌జెడి అభ్యర్థి మహమ్మద్ శంషాద్ ఆలంను ఓడించారు.

## జూబ్లీహిల్స్ ప్రజాస్వామ్యానికి అనుకూల ఫలితం

### టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో తెలంగాణ జన సమితి కార్యాలయంలో ఉత్సాహభరితంగా సంబరాలు జరిగాయి. పార్టీ కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం ప్రజాస్వామ్యానికి, అభివృద్ధి రాజకీయాలకు అనుకూలంగా నిలిచిన ఫలితమని తెలిపారు. ఈ గెలుపుతో గ్రేటర్ హైదరాబాద్‌లో జన సమితి పార్టీపై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. బస్తీల్లోని సమస్యలను పరిష్కరించేందుకు నాయకులు మరింత చురుకుదనం చూపాలని సూచించారు. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలకు పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని నగర కమిటీని కోదండరాం కోరారు.

టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్ కుమార్, రమేష్ ముదిరాజ్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, కార్యాలయ ఇన్‌చార్జ్ హనుమంత రెడ్డి, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్ హనుమంత గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దార సత్యం, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, నగర నాయకులు మహమ్మద్ అఫ్జల్, మెరుగు శ్రీనివాస్ యాదవ్, రమేష్, లక్ష్మణ్, మాణిక్యం, నాగభూషణం, సుధాకర్, అజయ్ గౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

## కార్మికులకు కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

లేకపోతే కార్మిక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వం కేంద్రంలో ఉన్నదని, అది అణిచివేస్తున్నదని అన్నారు. సిపిఐ 100 సంవత్సరాల పండుగ ఖమ్మంలో జరుగుతున్నదని, ఈ శత వార్షికోత్సవ సభకు కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సాంబశివరావు కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, రాష్ట్ర నాయకులు ఎం.నరసింహ, ప్రేంపావని, బాబు, కరుణలు పాల్గొన్నారు.

## అనుమానాస్పదం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తంచేశారు. ఇండియా ఐక్య సంఘటనలో సీట్ల సర్దుబాటు సమయంలో సమన్వయ లోపానికి భారీ మూల్యం చెల్లించుకోవల్సి వచ్చిందన్నారు. ఈ పరిణామం పరస్పర సహకారానికి, ఐక్య కార్యాచరణకు, సైద్ధాంతిక సంఘీభావానికి పిలుపునిస్తోందని రాజా అన్నారు.

అతిస్పష్టమైన ఉమ్మడి కార్యాచరణతో... విశ్వసనీయ సైద్ధాంతిక ప్రత్యామ్నాయంగా ప్రజల్లోకి వెళ్లడం ఎంత ముఖ్యమో ఈ ఫలితం నేర్పిందని రాజా వ్యాఖ్యానించారు. బీహార్‌లో సీపీఐ అభ్యర్థులకు మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికి, వారి గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామిక, న్యాయమైన, సుసంపన్నమైన బీహార్ కోసం ఎన్ని ఆటంకాలు వచ్చినాగానీ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, స్వాతంత్ర్యం రాకముందు నుంచి ప్రజల పక్షాన పోరాడటానికి సీపీఐ పూర్తిగా కట్టుబడి ఉన్నదని డి.రాజా వెల్లడించారు.

## 'కర్మ హిట్స్ బ్యాక్'

### జూబ్లీహిల్స్ ఫలితాల నేపథ్యంలో కవిత ఆసక్తికర ట్వీట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. 'కర్మ హిట్స్ బ్యాక్' (కర్మ అనుభవించాల్సిందే) అని ఆమె ఎక్స్ వేదికగా చేసిన ఈ ట్వీట్ చేశారు. ప్రస్తుతం కవిత చేసిన ట్వీట్ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఎవరి పేరును కానీ, ఏ పార్టీ పేరును కానీ, ఏ అంశాన్ని కానీ ప్రస్తావించకుండా ఆమె కేవలం మూడు పదాల్లో ట్వీట్ చేయడం గమనార్హం. ఎమ్మెల్సీ కవిత ఎవరిని ఉద్దేశించి ఈ ట్వీట్ చేశారు?, ఆ ట్వీట్ వెనక ఆంతర్యం ఏంటి?, బిఆర్‌ఎస్ ఓటమిని ఉద్దేశిస్తూ ఆమె ఈ ట్వీట్ చేశారా? అనే చర్చ జరుగుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు వెలువడిన తరుణంలో ఆమె ఈ ట్వీట్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. బిఆర్‌ఎస్ ఓటమి నేపథ్యంలోనే కవిత ఈ ట్వీట్ చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే జూబ్లీహిల్స్‌లో బిఆర్‌ఎస్ ఓటమి ఆమె రాజకీయ వ్యూహాలకు మరింత కలిసొచ్చే అంశంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి సునీత కోసం కెటిఆర్ కాళ్లకు బలపం కట్టుకుని ప్రచారం చేశారు. అయినప్పటికీ మాగంటి సునీత ఓటమి తప్పలేదు. కెటిఆర్ తీరుపై బాహాటంగానే విమర్శలు గుప్పించిన కవితకు ఈ అంశం కూడా అస్త్రంలా మారనుంది.

## నెగ్గితే ఉప్పొంగం

(మొదటి పేజీ తరువాయి)

కలిసి సిఎం మాట్లాడారు.

**రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రులు కలిసి రావాలి**

'రాష్ట్ర ఆదాయంలో 65శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తోంది. నగరానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా మరింత అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌ను సమస్యల రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయండి. సమస్యలు ఉంటే ప్రశ్నించండి, ధర్నాలు చేయండి. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ఉంది. రెండేళ్లు అభివృద్ధికి సహకరించండి' అని సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కోరారు. మెట్రో, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు అనుమతులను విషయంలో ప్రభుత్వ ప్రయత్నాలను కిషన్‌రెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోకుండా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారని, వీలయినంత మేరకు కేంద్రంలో అడ్డు తగులుతున్నారన్నారు. ఈ ఫలితాలు విశ్లేషించుకుని తెలంగాణ అభివృద్ధికి సహకరించాలన్నారు. నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వం పాత్రలను, వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారని, అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు విస్పష్టంగా తీర్పు ఇచ్చారని, ఇది బాధ్యతగా భావించి నగరాన్ని విశ్వ నగరంగా అభివృద్ధి చేయాలని సంకల్పించామన్నారు. మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు, మూసీ పునరుజ్జీవం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, గోదావరి జలాల తరలింపు లాంటి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్రం వద్ద పెండింగ్ అనుమతులు, నిధులపై చర్చించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సచివాలయానికి సాదరంగా ఆహ్వానిస్తున్నానన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ అనుమతులు, నిధులకు సంబంధించి సమీక్ష పెట్టి నివేదిక రూపంలో ఎంపిలకు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రికి సూచించారు. రాష్ట్ర ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చే బాధ్యత కేంద్రమంత్రులు, బిజెపి ఎంపిలపై ఉంది.

ఫలితం బిజెపికి భూకంపం ముందు వచ్చే ప్రకంపనలు

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డియే అభ్యర్థిగా మారి పనిచేస్తే 17 వేల ఓట్లు వచ్చాయని, ఈ ఫలితాల తరువాతైనా కిషన్‌రెడ్డి తన వ్యవహార శైలి మార్చుకోవాలని సూచించారు. జూబ్లీ హిల్స్ ఫలితం బిజెపికి ఫలితం బిజెపికి భూకంపం ముందు వచ్చే ప్రకంపనల లాంటిదన్నారు. కిషన్‌రెడ్డి ఎంపి నియోజకవర్గంలోనే బిజెపికి బాగా ఓట్లు తగ్గాయి. బిజెపి ఓట్లు 65 వేల నుంచి 17 వేలకు ఎందుకు తగ్గాయో కిషన్‌రెడ్డి ఆలోచించాలన్నారు. ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనించారని, ఇకనైనా వ్యవహారశైలి మార్చుకోకపోతే భూకంపం వచ్చి కాలగర్భంలో కలిసిపోతారన్నారు.

**బిఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తుందని సిఎం ఆగ్రహం**

హైడ్రా, ఈగల్ వంటివి ప్రజల కోసం తీసుకువచ్చామని, కానీ వాటిపైనే ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఈ విష ప్రచారం ఆపాలని బిఆర్‌ఎస్ నేతలకు సిఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి బిఆర్‌ఎస్ అడ్డు తగులుతోందన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు రెండేళ్ల పాలనకు ప్రతిఫలమని, ఈ ఎన్నికల ఫలితాల్లో ఎవరి పాత్ర ఏమిటో, ఎవరి బాధ్యత ఏమిటో ప్రజలు స్పష్టంగా చెప్పారని, ఇప్పటికైనా అర్థం చేసుకుని సహకరించాలని బిఆర్‌ఎస్, బిజెపిలకు రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నా కొన్ని ఛానళ్లు బిఆరెస్ హవా మొదలైందని వార్తలు వేశాయని, మీడియా విశ్వసనీయత కోల్పోవద్దన్నారు.

**హరీష్ అసూయ, కెటిఆర్ అహంకారం తగ్గించుకోవాలి**

మాజీ మంత్రులు హరీష్‌రావు తన అసూయను తగ్గించుకోవాలని, కెటిఆర్ తన అహంకారాన్ని తగ్గించుకోవాలని సిఎం సూచించారు. అధికారం, పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారన్నారు. 'మనం ఇంకా చాలా ఏళ్లు రాజకీయాలు చేయాల్సి ఉంది. ఫేక్ న్యూస్ రాయించి ఫేక్ సర్వేలు చేయించుకుని భ్రమలో బతకొద్దు. భారత రాష్ట్ర సమితి ఓడిపోతుంది. బిజెపికి డిపాజిట్ రాదని ముందే చెప్పా' అని సిఎం అన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలతో ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ విషం చిమ్మిందని, ప్రధాన ప్రతిపక్షం రాష్ట్రాభివృద్ధికి సహకరించకపోగా ప్రతీ సందర్భంలో అవహేళన చేసే ప్రయత్నం చేసిందని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కెసిఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరు. ఆయన ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదు. కెసిఆర్ గురించి ఇప్పుడు స్పందించాల్సిన అవసరంలేదు' అని ఒక ప్రశ్నకు సిఎం సమాధానం ఇచ్చారు.

**కాంగ్రెస్‌కు పెరిగిన ఓట్ల శాతం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారని, పోలైన ఓట్లలో 51 శాతం ఓట్లు కాంగ్రెస్‌కు రాగా, 38 శాతం బిఆరెస్‌కు, 8 శాతం బిజెపికి ఓటు వేశారని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా గమనించి ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 'అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైదరాబాద్ ప్రజలలో కాంగ్రెస్‌పై నమ్మకం పెరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ ఓటు బ్యాంకు పెరుగుతూ వస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39 శాతం ఓట్లు వచ్చాయి.

ఆరు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్ల శాతం 42కు పెరిగింది. కాంగ్రెస్ ఒక్కతాటిపై ఉన్నప్పుడు ఎవరి తాతలు దిగొచ్చినా కాంగ్రెస్‌ను ఓడించలేరు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ 51శాతం ఓట్లను ప్రజలు ఇచ్చారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించారు. గెలుపోటములకు కాంగ్రెస్ పొంగిపోదు, కుంగిపోదు. ప్రజల తరపున నిలబడటం, పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యం' అని సిఎం అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిన ఎంఐఎంకు సిఎం ధన్యవాదాలు తెలిపారు. వివిధ రాష్ట్రాల పరిస్థితులను బట్టి పొత్తులు, మద్దతు ఉంటుందన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రజాపాలనకు ప్రజల తీర్పు
### టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ గెలుపు అని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు ఎంత దుష్ప్రచారం చేసినా ఓటర్లు ప్రతిపక్షాల కుట్రలను పసిగట్టి, అభివృద్ధికే పట్టంకట్టారన్నారు. ఉపఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు సిఎం రేవంత్ రెడ్డి ఒకవైపు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ, అభివృద్ధి సమీక్షలు చేస్తూనే, మరోవైపు కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను పోరుకు సమాయత్తపరిచి, నవీన్ యాదవ్ గెలుపుకు బాటలు వేశారని బండి సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా దూసుకెళుతున్న సిఎం రేవంత్ రెడ్డికి ప్రజల మద్దతు నేడు జూబ్లీహిల్స్ లో వెల్లడైందన్నారు. అందుకే ఆ పార్టీ నాయకులకు ప్రజలు తాజా తీర్పుతో కర్రుకాల్చి వాతపెట్టారన్నారు.


## నవీన్ యాదవ్ 16 ఏళ్ల రాజకీయ ప్రస్థానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. నవీన్ యాదవ్ 16 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి శుక్రవారం ఓట్ల లెక్కింపుతో ఫలితం లభించింది. 2009లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన నవీన్ యాదవ్ 16 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎంఐఎం పార్టీతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, 2023లో రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అందివచ్చిన ఉపఎన్నికలో విజయాన్ని సాధించారు. 2009లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన నవీన్ యాదవ్ యూసుఫ్‌గూడ డివిజన్ నుంచి ఎంఐఎం తరఫున కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో ఎంఐఎం అభ్యర్థిగా జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి, 41,656 ఓట్లు సాధించి రెండవ స్థానంతో సరిపెట్టుకున్నారు. అనంతరం రహమాత్ నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి చెందారు. 2018లో జూబ్లీహిల్స్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, 18,817 ఓట్లు తెచ్చుకున్నారు. 2023లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుత ఉపఎన్నికలో విజయం సాధించారు.

**వ్యక్తిగత వివరాలు..**
**పేరు :** వల్లాల నవీన్ యాదవ్
**తండ్రి పేరు :** వి. చిన్న శ్రీశైలం యాదవ్
**పుట్టిన తేదీ :** 17111983 (42 సంవత్సరాలు)
**భార్య :** వర్ష యాదవ్
**కుమారుడు :** అన్ష్ యాదవ్
**విద్యార్హత:** బి.ఆర్క్ ( ఆర్కిటెక్చర్ ఇంజనీర్ )
**వృత్తి:** ఆర్కిటెక్ట్, రియల్ ఎస్టేట్ వ్యాపారం
**స్వస్థలం :** యూసుఫ్‌గూడ, హైదరాబాద్.

# అభివృద్ధికి ఓటు వేశారు
### మంత్రులు, కాంగ్రెస్ శ్రేణుల హర్షం






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ శాసన సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడం పట్ల రాష్ట్ర మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. నియోజక వర్గంలోని ఆయా డివిజన్‌లలో ప్రచారంలో చేసిన మంత్రులు కృషి ఫలించిందని వారు అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఘన విజయం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులందరం సమష్టిగా పనిచేసి ఉప ఎన్నికల్లో విజయం సాధించామని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఘన విజయం పట్ల మంత్రి జూపల్లి కృష్ణారావు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యం లోనిప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారనడానికి ఈ ఎన్నికలే నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాను ఇన్‌చార్జిగా ఉన్న ఎర్రగడ్డ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపునకు అహర్నిశలు కృషి చేసిన ఎంఎల్‌ఎలు, కార్పొరేషన్ చైర్మన్లు, కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నేతలకు అభినందనలు, ధన్యావాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండాసురేఖకి జూబ్లీహిల్స్ అసెంబ్లీ బై ఎలక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా... కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు ఇచ్చిన షేక్‌పేట్ డివిజన్‌లోని బూత్‌లలో హస్తం పార్టీకి పెద్ద ఎత్తున మెజార్టీ రావడం జరిగింది. పార్టీ అధి నాయకత్వం ఇచ్చిన బాధ్యతను తాను సంపూర్ణంగా నిర్వర్తించినట్టు ఈ సందర్భంగా మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపు గ్రామ గ్రామాన సంబరాలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని బధనం చేసే ప్రయత్నం చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఎర్రగడ్డ డివిజన్‌లో మంత్రిగా తాను విస్తృతంగా ప్రచారం చేయగా, ఈ డివిజన్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ వచ్చిందని ఈ నేపథ్యంలో మంత్రి నేరుగా ప్రజలను, కార్యకర్తలను కలిసి వారితో తన సంతోషాన్ని పంచుకున్నామని మంత్రి దమోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అపూర్వ విజయాన్ని కట్టబెట్టిన ఓటర్లకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నాం అని మంత్రి దనసరి అనసూయ సీతక్క , ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. ఈ విజయం కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిసి సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్ అఖండ మెజార్టీతో గెలవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని, ఇది బిసిల గెలుపుగా తాము భావిస్తున్నామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

**గాంధీ భవన్ లో పెద్ద ఎత్తున సంబరాలు ...**
జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన తరుణంలో గాంధీ భవన్ కు పెద్ద ఎత్తున చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చుతూ, డప్పు వాయిద్యాలతో రంగులు చల్లుకుని ఒకరినొకరు శుభాకాంక్షాలు చెప్పుకుని స్వీట్లు పంచుకున్నారు..గాంధీభవన్ పరిసరప్రాంతాలు కాంగ్రెస్ నేతలతో కోలాహాలంగా కనిపించింది.

**జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్**
జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విసయం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అంకితమన్నారు. జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు బిఆర్‌ఎస్ పార్టీకి సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో ఆ పార్టీకి చోటలేదని మరోసారి రుజువైందన్నారు. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆంకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. నవీన్‌ను గెలిపించిన ఘనత సిఎం, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తది అని ఆయన అన్నారు.

## మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి
### ఎఐటియుసి రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశంలో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు కనీస వేతనం కింద వారికి రూ.26వేలు చెల్లించాలని ఎఐటియూసి రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశంలో పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం హిమాయత్‌నగర్ రాష్ట్ర కార్యాలయంలోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్రన్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఎఐటియుసి డిప్యూటీ సెక్రటరీ ఎం.నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్మికుల సమస్యలపై రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో కార్మికుల సమస్యలు తీరేలా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ సంఘం నాయకత్వంలో సాధించుకున్నటువంటి ఒక సంవత్సరానికి 15 క్యాజువల్ లీవ్‌లని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మరణించిన కార్మికులకు దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వవద్దని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జివొని వెంటనే ఉపసంహరించుకోని, దహన సంస్కారాల ఖర్చు కింద రూ.30 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీలలో మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఈ నెల 18, 19 రెండు రోజులు ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్య, కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, ఉపాధ్యక్షులు కాంతారావు, ధర్మరాజు, రంగపాణి, నకిరేకంటి కృష్ణ, మద్దిలేటి, చెన్నయ్య, నర్సింలు, కమల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## హత్యల సంఖ్య కంటే పదింతలు రోడ్డు ప్రమాదంలో మృతి
### 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రారంభోత్సవంలో డిజిపి శివధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మన రాష్ట్రంలో ప్రతి ఏటా 800 మంది హత్యకు గురై చనిపోతే దానికి పదింతలు రోడ్డు యాక్సిడెంట్ ద్వారా చనిపోతున్నవారి సంఖ్య ఉందని డిజిపి బి.శివధర్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తపరిచారు. ఈ పరిస్థితిని నివారించేందుకు, వాహనదారుల్లో ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర పోలీసు శాఖ 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఎల్‌బిస్టేడియంలో శుక్రవారం హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్, ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ డి.జోయల్ డేవిస్, సినీ హీరో శర్వానంద్‌తో కలిసి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డిజిపి శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు భద్రతను ప్రజా ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని సూచించారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ఒక ఉద్యమం మాదిరిగా చేపట్టాలన్నారు. పోలీసు శాఖ, రవాణా శాఖ, కార్పొరేట్ సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పరస్పర సమన్వయంతో ముందుకు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరగనుందని, హైదరాబాద్ పోలీసులు ముందుగా మొదలు పెట్టారన్నారు. యాక్సిడెంట్స్ చాలా అవుతున్నాయి..ఇది అందరికీ సంబంధించిన సమస్య.. సీరియస్ గా తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరు ఫాలో కావాలి, డిఫెన్స్ డ్రైవింగ్ ప్రతి ఒక్కరు చెయ్యాలి అన్నారు. మన ం వెళ్లడమే కాదు ముందు వాళ్ళు,పక్క వాళ్ళను కూడా డ్రైవింగ్ చేసే సమయంలో గమనించడం చాలా అవసరమన్నారు. రూల్స్ పాటించడమే కాదు కామన్ సెన్స్ ప్రజలు పాటించాలన్నారు. ప్రాణాలు ఒక్కసారి పోతే మరోసారి తిరిగి రావని, మన ఫ్యామిలిలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. హెల్మెట్ పెట్టుకొని డ్రైవ్ చెయ్యాలి, స్పీడ్ లాక్ తప్పనిసరిగా ఉండాలి, కార్లో వెళ్లే వాళ్ళు సీట్ బెల్ట్ పెట్టుకోవాలి అని సూచించారు. రాష్ట్ర వాప్తంగా అందరికి ట్రాఫిక్ పైన అవగాహన కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చెప్పాడుతున్నామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ తెలిపారు. అందులో భాగంగా అరైవ్ అలైవ్ అవగాహన కార్యమాన్ని ఏర్పాటు చేశామన్నారు. యాడాది లో నాలుగున్నర లక్షలు రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయన్నారు. అందులో లక్ష మందికి పైగా చనిపోతున్నారన్నారు. హైదరాబాద్ లో 3500 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో కఠినంగా వ్యవహారిస్తాము. రోడ్డు ప్రమాదంలో ఉన్నావరికి సహాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నైతిక విజయం నాదే
### బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్‌లో నైతిక విజయం తనదే అని బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అన్నారు. ఓ మహిళపై ముఖ్యమంత్రి సహా రాష్ట్ర కేబినెట్ మొత్తం దౌర్జన్యం చేసి గెలిచిందని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రిగ్గింగ్, రౌడియిజం గెలిచాయన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం పూర్తి విఫలమైందన్నారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ది గెలుపే కాదని, నైతిక విజయం తనది, బిఆర్‌ఎస్‌దే అని అన్నారు. ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగాయని అన్నారు. పోలింగ్ రోజున ఎంతో అరాచకం సృష్టించారన్నారు. ఒక మహిళపై అంతమంది రౌడియిజం చేశారన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదన్నారు. తాను ఏం మాట్లాడినా, కార్యకర్తలను పరామర్శించినా తప్పుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. అప్పుడు రిగ్గింగ్‌లు, ఇప్పుడు ర్యాగింగ్‌లు చేస్తున్నారని మండిపడ్డారు. ఉదయం నుంచే కౌంటింగ్ హాలులో ఆడవాళ్లపై కాంగ్రెస్ ర్యాగింగ్ మొదలుపెట్టిందన్నారు. ఒక మహిళపై కాంగ్రెస్ నేతలు రౌడి రాజకీయం చేశారని విమర్శించారు. ఒక మహిళ అని కూడా చూడకుండా ఎన్నో రకాల దాడులు చేశారు. ప్రజలను కాంగ్రెస్ భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. గోపీనాథ్ ఉన్నంతకాలం రౌడిలు ఎక్కడో దాక్కున్నారన్నారు. ఆయన పోయాక కలుగుల్లో నుంచి బయటకు వస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను బెదిరించారని ఆరోపించారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడి ప్రజలు ఓట్లేశారన్నారు. గత ఎన్నికలు, ప్రస్తుత ఎన్నికలకు మధ్య తేడా ఏంటో ప్రజలు గమనించారని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి
### సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత వృత్తిదారుల సమస్యల పరిష్కారం, అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం నేతృత్వంలోని తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకుల ప్రతినిధి బృందం చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యను శుక్రవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలోని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీ నరసయ్య, గౌరవాధ్యక్షులు వెంకట్ రాములు, అధ్యక్షులు పెండెం సర్వేశ్వర్, నాయకులు జల్డీ రాములు, కస్తూరి బిక్షపతి, కర్నాటి మారయ్య, సురపల్లి జనార్దన్, దుడుక ఉప్పలయ్య తదితరులు ప్రతినిధి బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు లక్ష కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, సంక్షోభంలో కురుకపోయిన చేనేత రంగాన్ని గట్టు ఎక్కించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రకటించిన పథకాలను, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.1 లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్టు 14 నెలల కింద సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని, రూ.33 కోట్లు రుణమాఫీ కోసం విడుదల చేస్తున్నామని ఆయన వెల్లడించారని గుర్తు చేశారు. చేనేత కార్మికుల రుణ బకాయిల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నందున అవసరమైన నిధులను విడుదల చేసి రైతన్నల మాదిరిగా నేతన్నలను రుణ విముక్తులను చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు.
చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 527 చేనేత సహకార సంఘాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. టెస్కో కొనుగోలు చేసిన వస్త్రాలకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరిగి చేనేత సహకార సంఘాలు అప్పుల్లో కూరుకపోయాయని, వడ్డీల భారం పెరిగి చాలా చేనేత సంఘాలు మూతపడడంతో కార్మికులకు ఉపాధి దొరకని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. చేనేత సహకార సంఘాల రుణాలన్నింటినీ మాఫీ చేసి, బ్యాంకుల ద్వారా కొత్తగా రుణ సహాయం అందించి, మూతబడిన సంఘాలన్నింటినీ తెరిపించాలని కోరారు. సహకార చట్టం ప్రకారం చేనేత సహకార సంఘాలకు 2013లో ఎన్నికల నిర్వహించారని, 2018 తో వాటి కాల పరిమితి ముగిసినా ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. చేనేత సహకార సంఘాల సమాఖ్య 'టెస్కో' కు సైతం పాలకవర్గం లేనందున చేనేతల సంక్షేమం పట్టించుకునేవారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాలను ఎన్నిక చేసి ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు.
రాష్ట్ర ప్రభుత్వం 'నేతన్నకు భరోసా' పథకంలో జియో టాగ్ మగ్గం వేసే చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.18 వేలు, ఒక అనుబంధ కార్మికుడికి రూ.6 వేల చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించిందని, ఆ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.

## దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమే
### ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యం
### కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని, ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యమని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి సమావేశం ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరగగా, కూనంనేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు కమ్యూనిజంపై ప్రజల నమ్మకం పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయని, దానికి నిదర్శనం వరుసగా శ్రీలంక దేశంలో, న్యూయార్క్‌లో కమ్యూనిజం అధికారంలోకి రావడం, ఇప్పుడు నేపాల్‌లో అన్ని కమ్యూనిస్టులు ఐక్యం నిదర్శనమని అన్నారు.
మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు, ధరలు తగ్గిస్తాం, ఏటా 2కోట్లు ఉద్యోగాలు ఇస్తాం లాంటి ప్రజాకర్షక నినాదాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి అవేమీ అమలు చేయలేదన్నారు. దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు, భావోద్వేగాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటున్నదని ఆరోపించారు. 6 దశాబ్దాలుగా ప్రజల, కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను ఎల్ఐసి, బ్యాంకులు, టెలికాం, గనులు, చివరికి రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేటుకు కట్టబెట్టిన చరిత్ర బిజెపిది అని వారు ఉద్ఘాటించారు. దేశ సంపదను అదానీ, అంబానీ, కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని, సంపన్నులు మరింత సంపన్నులవుతుంటే. పేదలు మరింత పేదలుగా అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా మార్చే చట్టాలు తెచ్చారని, వీటి రద్దుకొరకు సిపిఐ పోరాడుతున్నదన్నారు. దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత గురించి సిపిఐ నిరంతరం కృషి చేస్తున్నదని, అందుకే రానున్న రోజుల్లో ప్రజలను కమ్యూనిస్టు భావజాలంవైపు ఆకర్షితులను చేయడానికి పోరాటాలు నిర్మిస్తామని వారు అన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న సిపిఐ వందేళ్ల పండగను నిర్వహించనున్నట్లు, ఈ ముగింపు సభకు 40 దేశాల నుంచి వామపక్ష ప్రతినిధులు హాజరవుతారని, ఐదు లక్షల మంది హాజరుకానున్నారని అన్నారు. ఈ ముగింపు సభకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కేంద్ర విధానాలతో రైతులకు గిట్టుబాటు ధర లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు.
బిజెపి పాలిత రాష్ట్రాలకు ఎక్కువ.. బిజెపియేతర పాలిత రాష్ట్రాలకు తక్కువగా నిధులు ఇస్తున్నారని విమర్శించారు. దీంతో అనేక రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.
ఈ సమావేశంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి,సాయిలు గౌడ్, కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, లక్ష్మి , స్వామి, కిషన్, శంకర్‌రావ్, హరినాథ్ రావ్, కృష్ణ, సత్యప్రసాద్, యాదయ్య గౌడ్, లొట్టి ఈశ్వర్, సల్మాన్ బేగ్, పరమేశ్వర, మాధవి, ప్రమీల, రమేష్, నరేంద్ర ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు


**CHANGE OF NAME**
I, V.Sreelatha, D/o. Kanakaiah, (Old Name) R/o: H.No: 5-11-1008, Pochammakunta, Hanumakonda (Mdl & Dist). Telangana - 506009. I have changed my Name from V.Sreelatha, D/o. Kanakaiah to VADLAKONDA SREELATHA, D/o. VADLAKONDA KANAKAIAH (New Name) for all purpose.

తెలంగాణ ప్రభుత్వం
**జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం, PIU డివిజన్, నల్లగొండ.**
Lr.No.D3/Tenders/04/2025-26/DPRENLG (షార్ట్ టెండర్ ప్రకటన) తేదీ: 13.11.2025
నల్లగొండ జిల్లాలోని పిఐయు నల్లగొండ డివిజన్‌లోని మడుగులపల్లి, మునుగోడు, నాంపల్లి, చండూర్ & ఘట్టుపల్ మండలాల్లో (6) పనుల కోసం కింద సంతకందారు టెండర్‌ను ఆహ్వానించడమైనది. **మొత్తం అంచనా వ్యయం:** రూ. 60.00 లక్షలు. **దరఖాస్తు చివరి తేదీ:** 19.11.2025, **టెండర్ షెడ్యూళ్ళు జారీ తేదీ:** 22.1.1.2025, **టెండర్ రసీదు మరియు ప్రారంభ తేదీ:** 24.11.2025. మరిన్ని వివరాల కోసం సంప్రదించండి : O/o. DPRE PIU నల్లగొండ. (జెడ్‌పిపి కాంప్లెక్స్, 2వ అంతస్తు), మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, నల్లగొండ పట్టణం.
సం/- జిల్లా. పి.ఆర్. ఇంజనీర్, పి.ఐ.యు.,:: నల్లగొండ.
DIPR R.O. No. : 10663-PP/CL/ADVT/1/2025-26, Date: 14-11-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
NIT No. 31/EE/Div.No.13 (Old-7B)/GHMC/2025-26 తేది: 14.11.2025
**పని పేరు:** (3) పనులు, హిటాచీ పనులు మరియు క్రీడా సామగ్రి పనులు, **అంచనా మొత్తం:** రూ.81.50లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 1 నుండి 3 వరకు పనుల ప్రారంభం: 15.11.2025న మ.1.00గం.ల నుండి, 18.11.2025న మ.1.00గం.వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.13 (ఓల్డ్-7బి) (కెజెడ్), జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్. సెల్ నెం. 9989930651. మరిన్ని వివరాలకు www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.13 (ఓల్డ్-7బి), జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 10684-PP/CL/ADVT/1/2025-26, Date: 14-11-2025

**జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం**
**మహిళలు, పిల్లలు, వైకల్య వ్యక్తులు & సీనియర్ సిటిజెన్స్ విభాగం, ఆదిలాబాద్.**
ప్రకటన
(1) వదిలివేయబడిన పిల్లలను ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ బాలసదన్‌లో ఉంచడం జరిగింది. వారిని ఆదిలాబాద్ విద్యానగర్ బస్ డిపో దగ్గరలోని చిల్డ్రన్ హోమ్‌లో ఉంచారు. వారు నిరంతరం ఐసిపిఎస్ యొక్క పర్యవేక్షణలో ఉంటారు.
(2) వదిలివేయబడిన ఒక చిన్నారి డూప్లికేట్ ఫోటో సమర్పించబడింది.
(3) జైవిక సంబంధమైన తల్లిదండ్రులు పైన పేర్కొనబడిన పిల్లలను క్లెయిమ్ చేయడానికి రుజువుతో ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోపు కింద సంతకం చేయబడిన సంబంధిత అధికారిని సంప్రదించవచ్చు. అనంతరం బిడ్డను విడిచిపెట్టబడిన వ్యక్తిగా ప్రకటిస్తారు. తదుపరి ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం దత్తత కోసం ఇవ్వబడుతుంది.
వదిలివేయబడిన చిన్నారి ఫోటో

Name: Kiara
DOB: 23.09.2025
సం/- జిల్లా సంక్షేమ అధికారి WD&CW డిపార్ట్‌మెంట్, ఆదిలాబాద్.
DIPR R.O. No. : 10676-PP/CL/ADVT/1/2025-26, Date: 14-11-2025

**పురపాలక సంఘ కార్యాలయము - హుజూరాబాద్**
జిల్లా : కరీంనగర్
లేఖ నెం. E1/298/2025-26 (టెండర్ ప్రకటన) తేదీ: 14.11.2025
హుజురాబాద్ పురపాలక సంఘ పరిధిలో 15వ ఆర్థిక సంఘం టైడ్ గ్రాంట్, అన్ టైడ్ గ్రాంట్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను అర్హత ఆసక్తి కలిగిన రిజిష్టర్డు సివిల్ కాంట్రాక్టర్ల / అధీకృత డీలర్ల నుండి e-procurement ద్వారా ఆన్ లైన్ టెండర్లు కోరబడుచున్నవి.

| | |
|---|---|
| 01. పనుల సంఖ్య | : (04) పనులు |
| 02. టెండర్ల విలువ | : 20.00 లక్షలు |
| 03. బిడ్ డౌన్ లోడ్ ప్రారంభ తేది | : 15.11.2025 ఉదయం 11.00 నుండి |
| 04. బిడ్ డౌన్ లోడ్ చివరి తేది మరియు సమయము | : 22.11.2025 మధ్యాహ్నం 4.00 గం. వరకు |
| 05. బిడ్లు తెరుచు తేది మరియు సమయము | : 22.11.2025 సాయంత్రం 4.05 నుండి |

ఇతర వివరముల కొరకు www.Tender.Telangana.gov.in వెబ్‌సైటులో చూడగలరు.
కొటేషన్ నోటీసు
హుజురాబాద్ పురపాలక సంఘ పరిధిలో ఈ క్రింద తెలిపిన పనులు చేపట్టుటకు గాను అర్హత / ఆసక్తి కలిగిన మునిసిపల్ రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి- అధీకృత డీలర్ల నుండి సీల్ కవర్ల ద్వార కొటేషన్లు కోరబడుచున్నవి.
**పనుల వివరములు:** 01. క్రిస్మస్ పండుగ సందర్భముగా హై స్కూల్ గ్రౌండ్ నందు టెంట్లు, చైర్స్, సౌండ్ సిస్టం, త్రాగు నీరు తదితర ఏర్పాట్లు చేపట్టుటకు గాను
పైన తెలిపిన పనులు చేపట్టుటకు గాను తేది : 17.11.2025 సోమవారము సాయంత్రము 4.00 గం.ల లోగా కొటేషన్లు పురపాలక సంఘము నందు అందచేయుటకు గాను కోరనైనది.
సంబంధిత వివరముల కొరకు మునిసిపల్ ఇంజనీర్ గారిని సంప్రదించగలరు.
N. సుధాకర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ - 8501845507
సం/- కమిషనర్, పురపాలక సంఘము, హుజురాబాద్.
DIPR R.O. No. : 10649-PP/CL/ADVT/1/2025-26, Date: 14-11-2025



# జనరల్

STATE & REGIONAL NEWS

## ఈషా సింగ్‌కు అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈజిప్టులోని కైరోలో జరుగుతున్న ఐ ఎస్ ఎస్ ఎఫ్ వరల్డ్ రైఫిల్ పిస్టోల్ ఛాంపియన్ షిప్ లో రెండు రజత పత కాలు ఒక కాంస్య పతకం గెలిచిన తెలంగాణ క్రీడాకారిణి ఇషా సింగ్ ను రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి లు అభినందించారు. 25 మీటర్ల పిస్టల్ మహిళల విభాగంలో 70 సంవత్సరాల తర్వాత భారతదేశానికి పతకం సాధించి చరిత్ర సృష్టించిన ఇషా సింగ్ కు వారు ప్రత్యేక అభినంద నలు తెలియజేశారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న క్రీడా ప్రోత్సాహక విధానాలతోతెలంగాణ యువ క్రీడాకారులు ప్రపంచ వేదికలపై అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నారని వారు పేర్కొన్నారు



## 1.152 కేజీల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దూల్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇంటిపై శుక్రవారం ఎస్‌టిఎఫ్ ఎ టీం లీడర్ అంజిరెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నరేందర్‌సింగ్ అనే వ్యక్తి వద్ద నుంచి 1.152 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నరేందర్‌సింగ్‌ను అరెస్టు చేయగా విజయలక్ష్మి, బిజిమా ది బాయ్ పరారీలో ఉన్నారు. నిందితుడి ని గంజాయిని దూల్పేట్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించాల్సినట్లు ఎ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

## భారతీయ హస్తకళల నైపుణ్య వేడుక




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్ (ఎబిఎఫ్ఆర్ఎల్) కు చెందిన ఆర్టిసానల్ లైఫ్ స్టైల్ బ్రాండ్, జైపోర్, బాలీవుడ్ డిజైనర్ అంజు మోదీతో కలిసి హైదరాబాద్ లోని తన జూబ్లీహిల్స్ స్టోర్ లో ఎడిషన్ కలెక్షన్‌ను శుక్రవారం ఆవిష్కరించింది. సృజనాత్మకత, వారసత్వం, సమకాలీన శైలిని వేడుక చేసే రాత్రిగా ఈ కార్యక్రమం కళ, డిజైన్, భారతీయ హస్తకళల ప్రియులను ఒకచోట చేర్చింది.ఈ కార్యక్రమం ఫ్యాషన్ కు ఒక నిదర్శనంగా నిలిచింది. ఇది హస్తకళల ద్వారా కథ చెప్పేందుకు ఒక రూపంగా నిలిచింది. జైపోర్ బ్రాండ్ హెడ్ మను గుప్తా మాట్లాడుతూ హస్త కళ అనేది ఫ్యాషన్ నిజమైన ఆత్మ అని జైపోర్ ఎల్లప్పుడూ నమ్ముతుంద న్నారు. వారసత్వం, కథ చెప్పడం పట్ల మనకున్న గౌరవాన్ని పంచు కునే అంజు మోదీ వంటి డిజైనర్‌తో భాగస్వామ్యం చేసుకోవడం వల్ల, ఆర్టిసానల్ డిజైన్‌ను తాజాగా, ఫ్యాషన్‌ఫార్వర్డ్ మార్గంలో ప్రదర్శించడానికి తమకు వీలు కలుగుతుందన్నారు.



## 48 మద్యం బాటిళ్ల స్వాధీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోవా, ఢిల్లీ, హర్యానా ప్రాంతాల నుంచి నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ సరఫరా అవుతుందనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ సిడి టీమ్స్‌తో పాటు ఎక్సైజ్ సిబ్బంది హహాడ్ షరీఫ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. పలు వాహనాలను తనిఖీలు చేయగా 48 నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ పట్టుబడినట్లు ఎస్‌టిఎఫ్ సి టీమ్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మంజు తెలిపారు.



ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో

## మూడు రోజుల జాతీయ మైనింగ్ సదస్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఈ నెల 19 నుండి 21 వరకు మూడు రోజులపాటు జాతీయ మైనింగ్ సదస్సు జరగనుంది. ఆపరేషనల్ ఎక్సలెన్స్ ఇన్ మైన్స్ త్రూ ఇన్నోవేటివ్ టెక్నాలజీ అనే అంశంపై మైనింగ్ నిపుణులు, ఇంజనీర్లు, సెక్యూరిటీ అధికారులు, పాలసీ మేకర్స్ పాల్గొననున్నారని కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు తెలిపారు. మైనింగ్ హెడ్ కె.జె. అమరనాథ్, ఫ్యాకల్టీ ఎల్. కృష్ణతో సదస్సు ఏర్పాట్లపై సమీక్షించిన అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతల వినియోగంతో మైనింగ్ రంగంలో భద్రత, ఉత్పాద కతను పెంపొందించే మార్గాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రియల్‌టైమ్ మానిటరింగ్ సిస్టమ్స్, ఆటోమేషన్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ వంటి ఆధునిక టెక్నాలజీల ప్రయోజనాలు, స్మార్ట్ మైనింగ్ పరిష్కారాలు, ప్రమాదాల గుర్తింపు, ఆపరేషనల్ రిస్క్‌ను తగ్గించే క్రమంలో తీసుకోవాల్సిన చర్యలపై సీనియర్ మైనింగ్ అధికారులు, ఇంజనీర్లు చర్చించనున్నారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న ఉత్తమ మైనింగ్ విధానాలపై నిపుణులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు ఇవ్వనున్నారు. ఇందులో స్మార్ట్ మైనింగ్, డ్రోన్లు, లైడార్ వినియోగం, జియో ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీ అంశాలు ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. ఈ సదస్సు ప్రభుత్వ, ప్రైవేట్ మైనింగ్ రంగ సిబ్బంది, ఖనిజ సంస్థల ఉద్యోగులు, పరిశోధనా, విద్యాసంస్థలు, కన్సల్టెంట్లు టెక్నికల్ పేపర్లు సమర్పించడానికి, ప్రధాన సమస్యలపై చర్చించడానికి, తమ అనుభవాలను పంచుకోవడానికి అనువైన వేదికగా నిలుస్తుందని డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్ రావు పేర్కొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో తాండూరు మండల, పట్టణానికి చెందిన 120మంది లబ్దిదారులకు రూ.1,20,13, 920 విలువగల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక నాయకులు, అధికారులతో కలసి పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడతూ ఆడపిల్లలను అక్కున చేర్చుకునెందుకు గాను ప్రభుత్వమే వారికి అండగా ఉంటూ కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్‌లను అందజేస్తుందన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి,డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, ఉత్తమ్‌చంద్, తహసిల్దార్ తారాసింగ్, ఎంపిడిఒ విశ్వప్రసాద్, మాజీ కౌన్సిలర్‌లు నీరాజబాల్‌రెడ్డి, బోంబినా,ప్రభాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ సమ్మిట్‌కు ఫ్యూచర్‌సిటీ ఆతిథ్యం!

### మీర్‌ఖాన్‌పేట వేదికగా వంద ఎకరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

### తెలంగాణ విజన్ రైజింగ్-2047' పేరుతో డిసెంబర్‌లో సమ్మిట్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భారత్ ఫ్యూచర్ సిటీ ప్రతిష్టాత్మక తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది.ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల పేరుతో తెలంగాణ విజన్ రైజింగ్2047' పేరుతో కందుకూరు మండలం మీర్ ఖాన్‌పేట వేదికగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ సమ్మిట్‌ను నిర్వహించబోతోంది.దేశ,విదేశాలకు చెందిన ఫార్చ్యూన్500 కంపెనీల ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరు కాబోతుండటంతో ప్రభుత్వం ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఇప్పటి వరకు జాతీయ,అంతర్జాతీయ సదస్సులకు హెచ్ఐసిసి లోని నోవాటెల్ హోటల్ వేదికగా నిలిచాయి. గత సాంప్రదాయానికి భిన్నంగా ప్రభుత్వం ఈ సారి భారత్ ఫ్యూచర్‌సిటీలోని మీర్‌ఖాన్‌పేట ను ఎంచుకోవడం విశేషం.

**27 మందితో 9 కమిటీలు**

ఇప్పటికే 27 మంది ఉన్నతాధికారులతో తొమ్మిది కమిటీలను ఏర్పాటు చేసింది.టిజిఎస్ పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారూఖీ, రంగారెడ్డిజిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి,వాటర్‌బోర్డు ఎండి అశోక్‌రెడ్డిలతో వేదిఏరినా డిజైన్ కమిటీని,హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఐటిఇఐసి సిఎస్ భవేష్ మిశ్రా,డిఒఐ నిఖిల్ చక్రవర్తిలతో ఆహ్వాన కమిటీ,ఎఫ్‌సిడిఎ కమిషనర్ శశాంక,ట్రాన్స్‌కో సిఎండీ కృష్ణ భాస్కర్,స్పెషల్ సెక్రట్రీ విపి గౌతం లతో పోగ్రామ్ డిజైన్ అండ్ కో ఆర్డినేషన్ కమిటీ,ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కుమార్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఇలంబర్తి,ఎఫ్‌సిడిఎ కమిషనర్ శశాంకలతో అవగాహన ఒప్పందాల కమిటీలను ఏర్పాటు చేసింది. అదే విధం గా ఎస్‌ఎటిజి ఎండి సోనిబాల,టిడిసిఎండి వల్లూరి క్రాంతిలతో ఆతిథ్యం, లాజిస్టిక్ కమిటీని ఏర్పాటు చేసింది. డైరెక్టర్ ప్రోటోకాల్ శివలింగయ్య,స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మీ, కల్చరల్ డైరెక్టర్ నరసింహ్మా రెడ్డిలతో ఫుడ్ అండ్ కల్చరల్ కమిటీ, ఇక జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక,సిపిఆర్‌ఒ మల్సూర్, డైరెక్టర్ ఆఫ్ మీడియా కమ్యూనికేషన్స్ శ్రీరాంకర్రిలతో డిజిటల్ మార్కె టింగ్ అండ్ మీడియా కమిటీని ఏర్పాటు చేశారు. జెన్‌కో సీఎండీ హరీష్, ఎంఆర్‌డీసీఎల్ జేఎండీ గౌతమి, డైరెక్టర్ ఆఫ్ మీడియా కమ్యూనికేషన్స్ శ్రీరాంకర్రిలతో కంటెంట్ క్రియేషన్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇక అడి షినల్ డీజీపీ డిఎస్ చౌహాన్ సహ రాచకొండ సీపీ సుధీర్‌బాబు,ఐజీపీ ఎం.రమేష్‌ల నేతృత్వంలో ‘సెక్యూరిటీ అండ్ ప్రోటోకాల్ కమిటీని ఏర్పాటు చేసింది. సమ్మిట్‌కు మరో 26 రోజుల గడువు మాత్ర మే మిగిలి ఉండ టంతో ఆయా కమిటీలు ఏర్పాట్లపై దృష్టి సారించాయి.

**వంద ఎకరాల్లో భారీ ఏర్పాట్లు**

ఈ మేరకు గురువారం సీనియర్ ఐఏఎస్‌లతో కూడిన ఈ తొమ్మిది బృందాలు సమ్మిట్ నిర్వహించతల పెట్టిన ప్రదేశాన్ని సందర్శించాయి.అమేజాన్ డేటా సెంటర్‌కు సమీపంలో 100 ఎకరాల్లో వసతి కోసం తాత్కాలిక షెడ్లు నిర్మాణం సహా రెండు నుంచి మూడు హెలీ ప్యాడ్స్,ఎగుడు దిగుడుగా ఉన్న భూమిని చదును చేయడం, రాకపోకలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా,నిరంతరాయ విద్యుత్ సరఫరా,భద్రత వం టి ఏర్పాట్లను పరిశీలించింది.ఈ బృందం శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డితో సమావేశం అయిన్నట్లు తెలిసింది.సమ్మిట్ నిర్వహాణ సహా మౌలిక సదుపాయాల కల్పన,భద్రతా పరమైన ఏర్పాట్లపై చర్చించే అవకాశం ఉంది. మూడు నియోజకవర్గాలు..ఏడు మండలాలు..64 గ్రామాల్లోని సుమారు 30 వేల ఎకరాల్లో చేపట్టనున్న నవ్యభవ్య భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ సమ్మిట్‌ను నిర్వ హిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## ఆశ్చర్యానికి గురిచేశాయ్

### బిహార్ ఎన్నికలు మొదటినుంచి న్యాయంగా జరగలేదు : రాహుల్

**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందించారు. ఈ ఎన్నికలు మొదటి నుంచి న్యాయంగా జరగలేదని ఆరోపించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురిచేశాయన్నారు. మహాఘట్బబంధన్‌పై విశ్వాసంతో ఓట్లు వేసిన లక్షలాది మంది బిహార్ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే ఈ పోరాటమన్నారు. కాంగ్రెస్, ఇండి కూటమి ఈ ఫలితాలను లోతుగా సమీక్షించి.. ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ ప్రయత్నాలను మరింత సమర్థంగా కొనసాగిస్తాయని పేర్కొన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్డీయే కూటమి ప్రభంజనం సృష్టించగా.. మహాఘట్బంధన్ కేవలం 35 లోపు సీట్లకే పరిమితమై చతికిలపడిన విషయం తెలిసిందే.

## ఎమ్మెల్యేగా అతిపిన్న వయస్కురాలు మైథిలీ ఠాకూర్



పాట్నా : ఆధ్యాత్మిక, జానపద గీతాలను ఆలపిస్తూ మైథిలీ ఠాకూర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టించారు. ఇప్పుడు బిహార్ రాజకీయాల్లో కూడా ఆమె రికార్డు నెలకొల్పారు. బిహార్ అసెంబ్లీకి ఎన్నికైన అతిపిన్న వయస్కురాలిగా నిలిచారు. మైథిలీ ఠాకూర్ అలీనగర్ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా రంగంలోకి దిగిన ఆమె.. ఆర్‌జెడి దిగ్గజ నేత వినోద్ మిశ్రాను 11 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓడించారు. దాంతో తొలిసారి బిహార్ అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. వాస్తవానికి 2008లో అలీనగర్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత బిజెపి ఇక్కడ తొలిసారి జయకేతనం ఎగురవేసింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఆమెకు 1.1 కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇక ఫేస్‌బుక్‌లో అయితే 1.4 కోట్ల మంది ఆమెను అనుసరిస్తున్నారు.

## జిన్నింగ్ మిల్లులతో మాట్లాడండి

### అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 17 నుంచి జిన్నింగ్ మిల్లులు సమ్మె ప్రకటించిన నేపథ్యంలో జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో చర్చలు జరపాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ సెక్రటరీని ఆదేశించారు. జిన్నింగ్ మిల్లుల సమస్యలను సిసిఐ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం దిశగా ఒత్తిడి తెస్తామని మంత్రి స్పష్టం చేశారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. కేంద్ర జౌళిశాఖ సూచనల మేరకు రాష్ట్రంలో మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేసి, జిల్లాల వారీ సగటు పత్తిని లెక్కించేలా కలెక్టర్లకు వెంటనే ఆదేశాలు ఇవ్వాని సెక్రటరీని మంత్రి ఆదేశించారు.




## ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒయాసిస్ ఫెర్టిలిటీ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. సంస్థ 16వ వార్షికోత్సవం సందర్భంగా తమ హాస్పిటల్స్‌లో అధునాతన సంతానోత్పత్తి ద్వారా జన్మించిన 11 మంది ప్రతిభావంతులైన పిల్లలకు ఆయుష్మాన్ స్కాలర్‌షిప్ 2.0ను అందించింది. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశం కార్యక్రమంలో ఒయాసిస్ ఫెర్టిలిటీ సిఈఒ పుష్కరాజ్ షెనాయ్ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా సంతానలేమి సమస్యలతో బాధపడుతున్న తల్లిదండ్రుల కలను నెరవేర్చడంలో సఫలీకృతమయ్యామని ఆనందం వ్యక్తం చేశారు. 2009లో స్థాపించిన ఒయాసిస్ ఫెర్టిలిటీ దేశంలోని 19 నగరాల్లో 31 కేంద్రాలతో సంతాన సాఫల్య చికిత్సలో విశ్వసనీయ సంస్థగా నిలిచిందన్నారు. హైదరాబాద్ అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ ఎల్.జయంతిరెడ్డి మాట్లాడుతూ వంధ్యత్వం నిత్యం పెరుగుతున్న ఆరోగ్య సమస్య అని, దంపతులు ఎదుర్కొనే భావోద్వేగపరమైన, వైద్యపరమైన సమస్యల నేపథ్యంలో మెరుగైన వైద్య ప్రమాణాలతో పాటు ఆధునిక టెక్నాలజీతో 16 సంవత్సరాలలో ఒక లక్ష వరకు ఆరోగ్యవంతులైన శిశువులను ఈ ప్రపంచంలోకి తీసుకురావడంలో ఒయాసిస్ ముందంజలో ఉంది. ఈ కార్యక్రమంలో ఒయాసిస్ ఫెర్టిలిటీ వైద్యులు డాక్టర్ దుర్గా జి.రావు, వరలక్ష్మి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా గ్రంథాలయ సంస్థల58 వారోత్సవాల సందర్భంగా వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా అదనపు కలెక్టర్ సుధీర్ పాల్గొని మాట్లాడుతూ గ్రంథాలయల్లో లభించే జ్ఞానసంపదను ప్రజలకు చేరువ చేయడం ,వివిధ వయస్సుల వారికి అనుగుణంగా రోజుకో ప్రత్యేక కార్యక్రమంతో వారోత్సవాలను నిర్వహించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రూప్ చర్చలు ,పుస్తక పఠనం ద్వారా సాధారణంగా నాలుగు రోజులు పట్టి విజ్ఞానాన్ని ఒక రోజులో పొందగలుగుతరన్నారు. విజ్ఞానాన్ని కేవాలం పోటీ పరీక్షలకు పరిమితం కాకుండా దినచర్యలో ఒక భాగంగా ప్రశాంతంగా అధ్యయనం చేసే వారు జీవితంలో నిజమైన పురోగతిని సాదిస్తారని తెలిపారు. పోటీ పరీక్షల్లో విజయం సాదించేందుకు క్రమశిక్షణ ,పఠన అలవాటు లోతైన ఆలోచన వంటి అంశాలపై మేలుకువలు ,పాఠకులకు అందించారు. నెహ్రూ ,అంబేద్కర్ ,ఎస్ఆర్‌రంగనాథన్ , వంటి మహనీయుల జీవన సత్యాలు ,క్రమశిక్షణ సాధింఛ్చన విజయాలు మనకు శాశ్వత ప్రేరణ అని అన్నారు. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించడంలో ,సంస్కృతిని కాపాడటంలో ,అభ్యాస ప్రక్రియను ప్రోత్సహించడంలో కీలక కేంద్రాలు ,అందుకే వాటని జ్ఞాన హృదయం అని పిలుస్తారని తెలిపారు. పుస్తకలు పత్రికలు ,ప్రత్యేక డేటాబేస్‌లు వంటి బౌతికి ,డిజిటల్ వనరులను అందింస్తు ,ప్రాంతం భాష కులమత సంబంధం లేకుండా గ్రంథాలయలు కీలక పాత్ర పోషిస్తాయి అని అన్నారు. 15న పుస్తక ప్రధర్శన ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజేష్‌రెడ్డి , సురేష్‌బాబు ,సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ నుండి మినహాయింపునివ్వాలి

### రాష్ట్ర టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎవి.సుధాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపునివ్వాలని రాష్ట్ర టీచర్స్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎవి.సుధాకర్ అన్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే గతంలో జారీచేసిన ఉత్తర్వులకు సవరణ చేస్తూ ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు కూడా టెట్ ను తప్పనిసరి చేస్తూ జీవో.28ను జారీచేయడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, ఉపాధ్యాయ సంఘాలు సుప్రీం కోర్టు తీర్పును సవాలు చేస్తూ రివ్యూ పిటిషన్ వేసాయని పేర్కొన్నారు. ఈ సారి జరగబోయే టెట్ పరీక్షకు ఉపాధ్యాయులు పెద్దమొత్తంలో హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నారని, అయితే వచ్చిన చిక్కల్లా సిలబస్ తోనే అని ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు వాపోతున్నారని తెలిపారు. తాము బోధించే సబ్జెక్టులో పరీక్ష నిర్వహిస్తే రాయడానికి సిద్ధమే కానీ స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉపాధ్యాయుడికి కొరుకుడుపడని గణితం ఇవ్వడం సరైన విధానం కాదని, ఎవరి సబ్జెక్టులో వారికి పరీక్ష నిర్వహిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని మెజారిటి ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(1) మేరకు జాతీయ ఉపాధ్యాయ విద్యా కౌన్సిల్ నిర్దేశించిన మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయని, సర్వీసులో ఉన్న టీచర్లను మినహాయించాలని ఉపాధ్యాయ లోకం కోరుతున్నట్లు వెల్లడించారు. సిటెట్‌లో కేంద్ర సిలబస్ ఉండడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యాశాఖ నేటివరకు అన్ని ఉత్తర్వుల్లో మినహాయింపు ఇవ్వడం, టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఆదేశాలు ఇవ్వకపోవడంతో టీచర్లు టెట్ గురించి ఆలోచించలేదని, ఉన్నపాటుగా సుప్రీం తీర్పుతో ఉలిక్కిపాటుకు గురయ్యారని తెలిపారు. ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు, వ్యక్తిగతంగా టీచర్లు, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయడంతో తీర్పు మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఏది ఏమైనా దశాబ్దాల అనుభవం గడించిన టీచర్లకు ఇది సవాలుగానే భావించినా సిలబస్ విషయంలో మార్పులు చేపడితే పెద్ద సమస్య కాదని ఎవి.సుధాకర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పెట్టుబడులకు అనువైన రాష్ట్రం

### ఎడిబి బ్యాంక్ ప్రతినిధులకు వెల్లడించిన తెలంగాణ సిఎస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అనువైనదని, దేశంలో ‘ఫాస్ట్ గ్రోయింగ్ స్టేట్’గా ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, మూసీ నది సుందరీకరణ, యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీ, రాష్ట్రంలో రోడ్ల విస్తరణ తదితర ప్రాజెక్టులపై ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం తెలంగాణ సచివాలయంలో సమావేశమయ్యారు. ‘తెలంగాణ రైజింగ్–2047’లో భాగంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పన, రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌లో సివరేజ్ ప్లాంట్‌ల నిర్మాణం. హెచ్‌ఎఎం రోడ్ల విస్తరణ, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ విద్యుత్ అనుసంధానం, టిజిఆర్‌టిసి ఇబస్సులు, యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలలో చేపట్టే ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్ట్ వివరాలు, ఆర్థిక పరమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. పరస్పర సహాకారంతో నిర్దేశించిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళిక కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి టి.కె.శ్రీదేవి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, టిజిఐఐసి డైరెక్టర్ శశాంక, వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.వి.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ‘ఆప్’ జాడు చాలావ్ యాత్ర

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా తెలంగాణలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) బలోపేతమే ధ్యేయంగా ఈ నెల 15న హైదరాబాద్ మైలార్‌దేవులపల్లి నుంచి ‘జాడు చాలావ్ యాత్ర’ చేపట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లిబర్టీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యాత్రలో భాగంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, పాదయాత్రలు చేపట్టాలని పార్టీ నేతలకు ఆయన సూచించారు.

### సురక్షితంగా భూమికి చేరుకున్న

## ముగ్గురు చైనా వ్యోమగాములు


**బీజింగ్:** స్వదేశ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన ముగ్గురు చైనా వ్యోమగాములు శుక్రవారం సాయంత్రం భూమికి సురక్షితంగా చేరుకున్నారు. చైనా ఖగోళ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, వారి ఖగోళ నౌకను అంతరిక్ష వ్యర్థ పదార్థాలు ఢీకొన్నాయి. దీనితో వారు అక్కడే చిక్కుకుపోయారు. కొత్త బృందాన్ని తీసుకెళ్లిన చైనా వ్యోమ నౌక వారిని క్షేమంగా తీసుకొచ్చింది. ఈ క్యాప్సూల్ మంగోరియాలో ల్యాండ్ అయినట్టు అధికారిక వర్గాలు ధ్రువీకరించాయి. వాస్తవానికి వీరి తిరుగు ప్రయాణం ఈనెల 5వ తేదీ బుధవారం జరగాల్సి ఉంది. కానీ, వివిధ కారణాలతో సుమారు పది రోజులు ఆలస్యమైంది. చివరికి షెంజౌ 21 నౌక ద్వారా చెన్ డాంగ్, చెన్ జోంగ్‌రూ. వాంగ్ జి భూమికి చేరుకున్నారు. కాగా, ముగ్గురు వ్యోమగాములను షెంజౌ20 ఖగోళ నౌక అంతరిక్ష కేంద్రానికి చేర్చింది. వారి క్యాప్సూల్ కిటికీలో చిన్న రంధ్రాలు కనిపించడంతో, ముందు జాగ్రత్తగా వారి తిరుగు ప్రయాణాన్ని నిలిపివేశారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు పంపిస్తున్న ఉపగ్రహాలు కాలం చెల్లిన తర్వాత అంతరిక్షంలోనే తిరుగుతుంటాయి. ఫలితంగా కోట్లాది శకలాలు భూమి చుట్టూ వేగంగా తిరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇవి ఖగోళ కేంద్రాలకు, వ్యోమ నౌకలకు ఢీకొనే ప్రమాదం ఉంది. ఇలావుంటే, షెంజౌ ఖగోళ నౌక ఇప్పటికీ భూ కక్ష్యలోనే తిరుగుతున్నది. భవిష్యత్తు ఖగోళ కేంద్ర మిషన్ల సమయంపై ఈ ఖగోళ నౌక ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఇంకా స్పష్టంగా తెలియడం లేదు. సాధారణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి అంతరిక్ష కేంద్రానికి కొత్త సభ్యులను పంపి, అప్పటికే అక్కడ ఉన్న వ్యోమగాములను తిరిగి తీసుకురావడం జరుగుతుందని చైనా స్పేస్ స్టేషన్‌కు చెందిన ఒక అధికారిని ఉటంకిస్తూ పిటిఐ తెలిపింది. షెంజౌ 20 అంతరక్షంలోనే ఉన్నందున, షెంజౌ22ని ఎప్పుడు ప్రయోగిస్తారనేది ఇప్పుడే చెప్పలేమని సదరు అధికారి పేర్కొన్నాడు.

### హోమ్ స్టే అభివృద్ధికి

## టిజిటిడిసి కసరత్తు

### దేశీయ, విదేశీ పర్యాటకులకోసం హోమ్ స్టే సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు దేశీయ, విదేశీ పర్యాటకుల కోసం ‘హోమ్ స్టే’ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి శాఖ (టిజిటిడిసి) కసరత్తు చేపట్టింది. ఈ క్రమంలోనే హోమ్ స్టే సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. పర్యాటకులకు ప్రమాణితమైన ప్రపంచ స్థాయి సేవలతో కూడిన సౌకర్యవంతమైన హోమ్‌స్టే వసతి సౌకర్యాలను అందించడం, అలాగే జిల్లా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలతో పాటు పర్యాటక గమ్యస్థానాల్లో వసతి లభ్యతను పెంపొందించడం లక్ష్యంగా, తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ టూరిజం హోమ్‌స్టే ను ప్రవేశపెట్టడం జరిగింది. విదేశీ,దేశీయ పర్యాటకులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన నివాసాన్ని అందించడం, అలాగే కుటుంబ సభ్యులతో కలిసి ఉండి స్థానిక సంప్రదాయాలను అనుభూతిని కల్పించడం, తెలంగాణ వంటకాల రుచిని ఆస్వాదించే అవకాశాన్ని ఇవ్వడం ఇందులోని ప్రధాన ఉద్దేశం. దరఖాస్తు దారులు హోమ్‌స్టే వర్గీకరణ,పునర్వర్గీకరణ కోసం చెల్లించాల్సిన దరఖాస్తు రుసుములు రూ.2000, రూ.4000గా ఉంటాయి. డిమాండ్ డ్రాఫ్ట్‌ను కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ టూరిజం, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ పేరుపై చెల్లించాల్సి ఉంటుందని టిజిటిడిసి ఒక ప్రకటనలో తెలిపింది. మిగతా వివరాలకు 04023459282 నెంబర్‌ను సంప్రదించాలని సూచించింది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## గుంతలో కారు పడి ఐదుగురు మృతి



**రత్లం/ఇండోర్ :** మధ్యప్రదేశ్‌లోని రత్లం జిల్లాలో శుక్రవారం వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి, ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న అడ్డంకిని ఢీకొట్టి గుంతలో పడి ఐదుగురు మృతి చెందారని పోలీసులు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యాలయం నుండి 30 కి.మీ దూరంలో ఉన్న రావతి పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఎనిమిది లైన్ల ఢిల్లీముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ఉదయం ఈ ప్రమాదం జరిగిందని పోలీసు సూపరింటెండెంట్ అమిత్ కుమార్ పిటిఐకి తెలిపారు. వాహనం వేగంగా నడుపుతూ బలమైన అల్యూమినియం అడ్డంకిని ఢీకొట్టి గుంతలోకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 15 ఏళ్ల బాలుడు, 70 ఏళ్ల వృద్ధుడు సహా ఐదుగురు మృతి చెందారని ఆయన అన్నారు. డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు కుమార్ చెప్పారు. మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం పంపారని, దర్యాప్తు జరుగుతోందని ఆయన తెలిపారు.

## బిహార్‌లోనూ 'ఓట్ చోరీ'
### సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వెల్లడయ్యాయి. ఎన్‌డిఎ కూటమి ఘన విజయం సాధించింది. అయితే బిహార్‌లో కూడా 'ఓట్ చోరీ' జరిగిందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య ఆరోపించారు. కాంగ్రెస్‌–ఆర్‌జెడి నేతృత్వంలోని కూటమి వెనుకబడటానికి, ఎన్‌డిఎ మెజారిటీతో విజయం వైపు పయనించడానికి గల కారణాలపై తనకు ఇంకా సమాచారం రాలేదని ఆయన అన్నారు. 'మనం ప్రజల ఆదేశాన్ని అంగీకరించాలి. ఆ వెనుకబాటుకు కారణమేమిటో నాకు తెలియదు. నేను అక్కడికి (బిహార్‌కు) వెళ్ళలేదు. (మాకు) ఎవరు ఓటు వేయలేదు. ఎన్‌డిఎ ఎందుకు పెద్ద మెజారిటీతో గెలిచిందో నాకు తెలియదు. నేను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను' అని బిహార్‌లో మహాఘట్బంధన్‌కు ఎదురుదెబ్బ తగిలిన ప్రశ్నకు సమాధానంగా సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. బిహార్‌లో ఒబిసి ఓట్లు నిర్ణయాత్మకమైనప్పటికీ, ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని అడిగిన ప్రశ్నకు 'నాకు తెలియదు. నితీష్ కుమార్ ఎవరు? అతను ఒబిసి కాదా? బదులిచ్చారు. బిహార్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్, ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన 'ఓటు చోరీ' ఆరోపణల గురించి అడిగినప్పుడు, 'వారు ఇక్కడ కూడా చోరీ చేశారు' అని ముఖ్యమంత్రి అన్నారు.

**కొత్త వ్యూహం రూపొందించాలి : డికె**

బిహార్ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి కోసం భవిష్యత్తు కోసం కొత్త వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ భావించారు. కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ బిహార్ ఎన్నికలు ఫలితాలు తమ పార్టీకి, మిత్ర పక్షాలకు పాఠంగా ఆయన అభివర్ణించారు. 'ప్రజలు ఈ ఆదేశాన్ని ఇచ్చారు. ఇది మాకు ఒక పాఠం. భవిష్యత్తులో మేము కాంగ్రెస్ పార్టీకి, ఇండియా కూటమి కోసం కొత్త వ్యూహాన్ని రూపొందిస్తాము' అని శివకుమార్ పిటిఐకి తెలిపారు. బిహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ పనితీరుకు మహిళలకు రూ.10,000 డిబిటి, మహిళా ఓటర్ల పెరుగుదల కారణమా అని అడిగినప్పుడు ఫలితాలపై వివరణాత్మక నివేదిక వచ్చిన తర్వాత స్పందిస్తానన్నారు.

## బిహార్‌లోనూ మహారాష్ట్ర నమూనా
### ఎన్నికల ఫలితాలు దిగ్భ్రాంతికరమైనవేమీ కావు : రౌత్




**ముంబయి :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దిగ్భ్రాంతికరమైనవి కావని శివ సేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్, బిజెపి తమ జాతీయ ఎజెండాను అమలు చేయడానికి చేతులు కలిపి పనిచేసినందు వల్లే విజయం సాధ్యమైందని విమర్శించారు. 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల 'నమూనా'ను బిహార్ ఎన్నికల ఫలితాలు అనుసరించాయని, అందులో బిజెపి, శివసేన, ఎన్‌సిపిల అధికార మహాయుతి కూటమి అద్భుతమైన విజయాన్ని నమోదు చేసిందని కూడా ఆయన అన్నారు. బిహార్ ఫలితాలు 2024లో ఎన్నికల ఫలితాలను సూచిస్తున్నాయని, రాష్ట్రంలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) తుడిచిపెట్టుకుపోయిందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో షాక్ అవ్వాల్సిన అవసరం లేదని, ఎన్నికల కమిషన్, బిజెపి కలిసి నిర్వహిస్తున్న జాతీయ ఎజెండాను చూస్తే, దీనికి భిన్నమైన ఫలితం సాధ్యం కాలేదన్నారు. ఇది మహారాష్ట్ర నమూనా లాంటిదేనని ఆయన తెలిపారు. అధికారంలోకి వస్తుందని భావించిన కూటమి 50 సీట్ల కంటే దిగువకు పడిపోయిందని రౌత్ ఆరోపించారు.

## కూలిన ఐఎఎఫ్ శిక్షణా విమానం



**చెన్నై :** భారత వైమానిక దళానికి (ఐఎఎఫ్) చెందిన శిక్షణా విమానం ప్రమాదానికి గురైంది. సింగిల్ సీటర్ ట్రైనర్ విమానం చెన్నైలోని తాంబరం ఎయిర్ బేస్ సమీపంలో కుప్పకూలింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పైలట్‌ను రక్షించారు. అనంతరం ప్రమాదం గురించి అధికారులకు సమాచారం ఇచ్చారు. సాధారణ శిక్షణా సమయంలో ప్రమాదవశాత్తూ కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. అయితే, అదృష్టవశాత్తూ పైలట్ సురక్షితంగా ప్రాణాలతో బయట పడ్డారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేస్తున్నారు.

## అవయవాల అక్రమ రవాణా...
### ప్రధాన నిందితుడు అరెస్టు




**కొచ్చి:** అక్రమ అవయవ దానం కోసం ఇరాన్‌కు వ్యక్తులను రవాణా చేసిన కేసులో ప్రధాన నిందితుడిని జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. కేరళలోని ఎర్నాకుళంకు చెందిన మధు జయ కుమార్ ఈనెల 8న ఇరాన్ నుండి వచ్చిన తర్వాత అరెస్టు చేసినట్లు వర్గాలు తెలిపాయి. జాతీయ సంస్థ పిటిషన్ తర్వాత, మధును 12న కొచ్చిలోని కోర్టులో హాజరుపరిచినట్లు వర్గాలు తెలిపాయి. 19వ తేదీ వరకు కోర్టు ఎన్‌డిఎ కస్టడీ విధించింది. ప్రస్తుతం కొచ్చిలోని ఎన్ఐఎ కార్యాలయంలో ఆయనను ప్రశ్నిస్తున్నారు. మే 18, 2024న కొచ్చి విమానాశ్రయంలోని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారులు అవయవ అక్రమ రవాణా నెట్‌వర్క్‌లో ప్రమేయం ఉందనే అనుమానంతో ఒక యువకుడిని అడ్డుకున్నప్పుడు కేసు ప్రారంభమైంది. ఈ దర్యాప్తును మొదట ఎర్నాకుళం గ్రామీణ పోలీసులు నిర్వహించగా, ఆ తరువాత ఎన్ఐఎ స్వాధీనం చేసుకుంది. నిందితులు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని, చట్టబద్ధమైన అవయవ దానం పేరుతో వారిని ఇరాన్‌కు రప్పించారని దర్యాప్తులో తేలింది. వారు అవయవ గ్రహీతలను కూడా గుర్తించి, ఇరానియన్ ఆసుపత్రులలో వారికి చికిత్సను సులభతరం చేశారు. అక్కడ ఈ ప్రక్రియ చట్టబద్ధమైనదని తప్పుగా పేర్కొన్నారు. గత సంవత్సరం ఎన్ఐఎ మధు, సబిత్, సజిత్ శ్యామ్, బెల్లంకొండ రామ్ ప్రసాద్ లపై చార్జిషీట్ దాఖలు చేసింది. ఫిబ్రవరి 2025లో ఇరాన్‌లో నివసిస్తున్న మధుపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయబడింది. ఇరాన్‌లో అవయవ అక్రమ రవాణా కార్యకలాపాలను నియంత్రిస్తూ, అక్కడి ఆసుపత్రులతో సమన్వయం చేసుకుంటూ మధు అరెస్టు ఎన్ఐఎకు చాలా కీలకమని వర్గాలు తెలిపాయి.

## ఉప ఎన్నికల్లో అధికార పార్టీలకు చుక్కెదురు
### నాలుగు నియోజకవర్గాల్లో ఓడిన పాలక పార్టీలు




**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా 8 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఈనెల 11వ తేదీన ఉప ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. నాలుగు స్థానాల్లో అధికార పార్టీ అభ్యర్థులు ఓటమి చవి చూశారు. బిజెపి పాలిత రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఒక స్థానాన్ని గెలుచుకోగా, జమ్మూకశ్మీర్‌లోని బుద్గామ్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌కు పిడిపి తొలిసారిగా ఓటమిని మిగిల్చింది. జమ్మూకశ్మీర్‌లోని నగ్రోటా స్థానాన్ని బిజెపి గెలుచుకుంది. మిజోరాం ప్రధాన ప్రతిపక్ష పార్టీ మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) తన అభ్యర్థి ఆర్ లాల్తాంగ్లియానా 562 ఓట్ల తేడాతో పాలక జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్‌కు చెందిన వన్‌లాల్‌సైలోవాను ఓడించి దంపా అసెంబ్లీ స్థానాన్ని నిలుపుకుంది. అంటా (రాజస్థాన్), ఘట్‌శిల (జార్ఖండ్, జూబ్లీహిల్స్ (తెలంగాణ), టర్న్ తరన్ (పంజాబ్), నువాపాడ (ఒడిశా)లలో కూడా ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, బిజెపిలు ఒక్కొక్క స్థానాన్ని గెలుచుకోగా, ఆప్, జెఎంఎం కూడా ఒక్కొక్క స్థానంలో విజయం సాధించాయి. ఒడిశాలోని నువాపాడలో బిజెపికి చెందిన జై ధోలాకియా కాంగ్రెస్‌కు చెందిన ఘాసిరామ్ మాఝీపై 83,748 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. జై దివంగత బిజెడి ఎమ్మెల్యే రాజేంద్ర ధోలాకియా కుమారుడు. ఆయన మరణంతో ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. నగ్రోటాలో బిజెపికి చెందిన దేవయాని రాణా జమ్మూకశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ (జెకెఎన్‌పిపి) అభ్యర్థి హర్ష్ దేవ్ సింగ్‌ను 24,647 ఓట్ల తేడాతో ఓడించారు. 10,872 ఓట్లు పొందిన ఎన్‌సి అభ్యర్థి షమీమ్ బేగం డిపాజిట్ కోల్పోయారు. రాణా మాజీ ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా కుమార్తె. ఆయన మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. జమ్ము కశ్మీర్‌లోని బుద్గామ్ ఉప ఎన్నికలో ప్రతిపక్ష పిడిపికి చెందిన ఆగా సయ్యద్ ముంతాజీర్ అధికార ఎన్‌సి అభ్యర్థి అగా సయ్యద్ మెహమూద్‌ను 4,478 ఓట్ల తేడాతో ఓడించారు. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుండి గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆ స్థానాన్ని ఖాళీ చేసి తన కుటుంబ కంచుకోట అయిన గందర్‌బాల్‌ను ఎంచుకున్న తర్వాత బుద్గామ్‌లో ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. 1957లో శాసనసభకు తొలి ఎన్నికలు జరిగిన తర్వాత మధ్య కశ్మీర్‌లోని బుద్గాంలో ఎన్‌సి ఓడిపోవడం ఇదే తొలిసారి. రాజస్థాన్‌లోని అంటా అసెంబ్లీ నియోజకవర్గంలో, తెలంగాణలోని జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం సాధించింది. అంటలో, ప్రమోద్ జైన్ భయా తన సమీప ప్రత్యర్థి , బిజెపి అభ్యర్థి మోర్పాల్ సుమన్‌ను 15,612 ఓట్ల తేడాతో ఓడించారు. క్రిమినల్ కేసులో దోషిగా తేలిన తర్వాత బిజెపి ఎమ్మెల్యే కన్వర్ లాల్ మీనాను అనర్హుడిగా ప్రకటించిన తర్వాత ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. తెలంగాణలో కాంగ్రెస్‌కు చెందిన నవీన్ యాదవ్ తన సమీప బిఆర్ఎస్ ప్రత్యర్థి మాగంటి సునీతను 24,729 ఓట్ల తేడాతో ఓడించి జూబ్లీహిల్స్ స్థానాన్ని గెలుచుకున్నారు. జూన్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక జరిగింది. పంజాబ్‌లోని టర్న్ తరన్ అసెంబ్లీ స్థానాన్ని అధికార ఆప్ తన అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధు సమీప ప్రత్యర్థి, ఎస్ఎడి అభ్యర్థి సుఖ్విందర్ కౌర్ రాంధ్వాను 12,091 ఓట్ల తేడాతో ఓడించి మళ్లీ ఆ స్థానాన్ని నిలుపుకుంది. జూన్‌లో ఆప్ ఎమ్మెల్యే కాశ్మీర్ సింగ్ సోహల్ మరణంతో టర్న్ తరణ్ స్థానం ఖాళీ అయింది.

జార్ఖండ్‌లోని ఘట్‌షిల అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో జెఎంఎం అభ్యర్థి సోమేశ్ చంద్ర సోరెన్ తన సమీప ప్రత్యర్థి బిజెపికి చెందిన బాబు లాల్ సోరెన్‌ను 38,500 ఓట్ల తేడాతో ఓడించారు. ఆగస్టు 15న మరణించిన జెఎంఎం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్ కుమారుడు సోమేశ్. జూలై 21న ప్రస్తుత మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) శాసనసభ్యుడు లాల్‌రింట్లుంగా సైలో మరణంతో దంప స్థానం ఖాళీ అయింది.

## ఐదు స్థానాల్లో ఎంఐఎం విజయం




**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని ప్రధాన పార్టీలు చతికిల పడ్డప్పటికీ ముస్లిం మెజార్టీ 'సీమాంచల్' ప్రాంతంలో మజ్లిస్ పార్టీ సత్తా చాటుకుంది. గత ఎన్నికల్లో గెలిచిన 5 స్థానాల్లో, ఈసారి కూడా అసదుద్దీన్ ఒవైసీ 'పతంగి' రివ్వున ఎగిరింది. ముస్లిం ఓటుబ్యాంకు రేసులో ఆర్‌జెడి, కాంగ్రెస్‌లను మజ్లిస్ దాటేసింది. జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు సరిసమాన స్థాయిలో 5 సీట్లను గెల్చుకొని ఔరా అనిపించింది. 47 శాతం ముస్లిం జనాభా ఉన్న సీమాంచల్ ప్రాంతంలో మజ్లిస్ హవా కొనసాగింది. అమౌర్, బహదూర్‌గంజ్, బైసి, జోకిహాట్, కొచధమాన్ సీట్లను వరుసగా రెండోసారి ఆ పార్టీ కైవసం చేసుకుంది. అమౌర్ స్థానంలో 38,928 ఓట్ల తేడాతో అఖ్తరుల్ ఇమాన్ గెలిచారు. కొచధమాన్ స్థానంలో 23,021 ఓట్ల తేడాతో మహ్మద్ సర్వర్ ఆలం విజయం సాధించారు. జోకిహాట్ స్థానంలో మహ్మద్ ముర్షిద్ ఆలం, బహదూర్‌గంజ్ స్థానంలో మహ్మద్ తౌసిఫ్ ఆలం, బైసి స్థానంలో గులాం సర్వర్ గెలుపొందారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ ఐదు స్థానాల్లో మజ్లిస్ పార్టీయే గెలిచింది. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత నలుగురు మజ్లిస్ ఎమ్మెల్యేలు ఆర్‌జెడిలోకి జంప్ అయ్యారు. అయినప్పటికీ వరుసగా రెండోసారి ఆ స్థానాలను మజ్లిస్ పార్టీ నిలుపుకోవడం విశేషం. ఈ సీట్లలో ఒవైసీకి పెరుగుతున్న పట్టుకు తాజా ఫలితం నిలువెత్తు నిదర్శనం. ఈ వరుస విజయాలను పునాదిగా చేసుకొని రాబోయే రోజుల్లో సీమాంచల్‌లోని అరారియా, కిషన్‌గంజ్, కతిహార్, పూర్ణియా జిల్లాలపై పట్టు బిగించేందుకు మజ్లిస్ వ్యూహ రచన చేసే అవకాశాలు ఉన్నాయి.

## ఫలితాలు పూర్తిగా అసహజమైనవి
### సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య



**న్యూఢిల్లీ :** బిహార్ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేవని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య అన్నారు. రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం, 2010 పనితీరును ఎలా పునరావృతం చేస్తుందో వివరించలేని విధంగా ఉందని భట్టాచార్య అన్నారు. 'ఫలితాలు పూర్తిగా అసహజమైనవి; ఇవి బిహార్ వాస్తవ పరిస్థితులకు ఏమాత్రం అనుగుణంగా లేవు' అని భట్టాచార్య పిటిఐకి తెలిపారు. శుక్రవారం ఉదయం ఎక్స్‌లో పోస్టు చేస్తూ సర్ తర్వాత బిహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్ల జాబితా ఉందని, పోల్ తర్వాత ఇసిఐ ప్రెస్ నోట్ ఈ సంఖ్యను 7,45,26,858గా పేర్కొందన్నారు. అంటే మూడు లక్షల ఓటర్లు పెరిగారని, ఈ 'అదనపు 2 ఎబి' ఎక్కడి నుండి వచ్చిందని ప్రశ్నిస్తూ, ఇసిఐ వివరించడానికి శ్రద్ధ వహిస్తుందా నిలదీశారు.

## ఫెమా కేసులో సమన్లు దాటవేసిన అనిల్ అంబానీ...

### 17న హాజరు కావాలని ఇడి తాజా నోటీస్ జారీ
### 'వర్చువల్ మార్గాల' ద్వారా సాక్ష్యం చెబుతానన్న అంబానీ ప్రతిపాదనను తిరస్కరించిన 'ఇడి'




**న్యూఢిల్లీ :** రిలయన్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ అనిల్ అంబానీ తన షెడ్యూల్ తేదీని దాటవేయడంతో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆయనను ఫెమా కేసులో నవంబరు 17న తమ ముందు హాజరు కావాలంటూ తాజా సమన్లను జారీచేసింది. 'వర్చువల్ మార్గాల' ద్వారా సాక్ష్యం చెబుతానన్న అంబానీ ప్రతిపాదనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తిరస్కరించిందని ఇడి వర్గాలు తెలిపాయి. 66 సంవత్సరాల వ్యాపారవేత్త ప్రతినిధి ఒక ప్రకటనలో, దర్యాప్తులో పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇస్తూ ఫెడరల్ దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఒక లేఖ రాశారని తెలిపారు. విదేశీ మారక ద్రవ్య చట్టం (ఫెమా) కింద శుక్రవారం స్వయంగా దరఖాస్తు చేసుకుని తన స్టేట్‌మెంట్‌ను నమోదు చేసుకోవాలని ఏజెన్సీ అంబానీని కోరిందని వర్గాలు వెల్లడించిన సమాచారం.ఈ దర్యాప్తు జైపూర్‌రీన్‌గస్ హైవే ప్రాజెక్ట్‌కు సంబంధించినది. ఇటీవల అంబానీ మరియు అతడి కంపెనీలకు చెందిన రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అటాచ్ చేసిన తర్వాత రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌పై జరిపిన సోదాల్లో రూ.40కోట్లు హైవే ప్రాజెక్ట్ నుండి 'సిఫోన్డ్' చేయబడినట్లు తేలిందని ఇడి గతంలో ఒక ప్రకటనలో తెలియజేసింది. 'సూరత్‌లోని షెల్ కంపెనీల ద్వారా దుబాయ్‌కు నిధులు తరలించబడ్డాయి. ఈ ట్రయల్‌లో రూ.600 కోట్లకు మించి అంతర్జాతీయ హవాలా నెట్‌వర్క్ బయట పడింది' అని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. 'హవాలా డీలర్లుగా ఆరోపించబడుతున్న కొంతమంది వ్యక్తుల వాంగ్మూలాలను ఇడి నమోదు చేసింది. ఆ తర్వాత వారు అంబానీని విచారించాలని నిర్ణయించుకున్నారు' అని ఆ వర్గాలు తెలిపాయి. హవాలా అంటే అక్రమ నిధుల తరలింపు అని అర్థం. 'ఈ విషయం( ఫెమా కేసు)15సంవత్సరాల నాటిది. అంటే 2010 నాటిది. రోడ్డు కాంట్రాక్టర్‌తో సంబంధం ఉన్న సమస్యలకు సంబంధించినది' అని ఒక ప్రకటన తెలిపింది. 2010లో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జె.ఆర్ టోల్ రోడ్డును నిర్మించడానికి ఇపిసి (ఇంజనీరింగ్, సేకరణ, నిర్మాణం) కాంట్రాక్ట్‌ను ఇచ్చింది. ఇది పూర్తిగా దేశీయ ఒప్పందం. ఎటువంటి విదేశీ మారకం అంశీభూతం ఇందులో లేదు. 2021 తర్వాత జెఆర్ టోల్ రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యింది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వద్ద ఉంది అని ప్రకటన పేర్కొంది. 'అంబానీ రిలయన్స్ ఇన్‌ఫ్రా బోర్డ్‌లో సభ్యుడు కాదు. ఆయన ఏప్రిల్ 2007 నుండి మార్చి 2022వరకు దాదాపు 15సంవత్సరాల పాటు సేవలు అందించాడు. కేవలం నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మాత్రమే ఉన్నాడు. ఆయన ఎప్పుడూ రోజువారీ కంపెనీ మేనేజ్‌మెంట్‌లో పాల్గొనలేదు'అని తెలిపింది. తన గ్రూప్‌కంపెనీలపై జరిగిన రూ.17,000కోట్ల మోసానికి సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆ వ్యాపారవేత్తను ఒకప్పుడు అంబానీని ప్రశ్నించింది.

### కీలక వైకల్య సాధికారత కమిటీ
## ఎంపిల నియామకానికి కేంద్రం నోటిఫై



**న్యూఢిల్లీ :** సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ వైకల్యాలు ఉన్న వ్యక్తుల హక్కుల చట్టం2016 ప్రకారం కీలక కమిటీల కూర్పులో మార్పులను కేంద్రం నోటిఫై చేసింది. ఈ కీలక కమిటీలో ఇద్దరు లోక్‌సభ సభ్యులను తన కొత్త ప్రతినిధులుగా నియమించింది. దీనికి సంబంధించి ఇటీవల సోమవారం విడుదల చేసిన ఒక గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం..గతంలో నామినేట్ చేయబడిన ఎంపీల స్థానంలో ఇ.టి.మహ్మద్ బషీర్, సి.ఎన్.మంజునాథన్‌లను నియమిస్తూ కమిటీ నిర్మాణాన్ని వివరించే 2017 ఉత్తర్వును కేంద్రం సవరించింది. వైకల్యాలకు సంబంధించిన విధానాలను సమీక్షించడానికి, సమస్యలను పరిశీలించే పార్లమెంటరీ ప్యానెళ్లకు సహాయం చేయడానికి వికలాంగుల సాధికారత శాఖగా ఏర్పాటు చేయబడిన ప్యానెల్‌లో ఇద్దరు శాసనసభ్యులు ఇప్పుడు ఎన్నికైన పార్లమెంట్ సభ్యుల వర్గం కింద సభ్యులుగా వ్యవహరిస్తారు. వికలాంగుల హక్కుల చట్టంలోని సెక్షన్ 60 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి ఈ సవరణ చేయబడింది. ఇది చట్టాన్ని అమలుచేయడానికి అవసరమైన నియమాలను రూపొందించడానికి, సవరించడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఇస్తుంది. కమిటీని ఏర్పాటు చేస్తూ అసలు నోటిఫికేషన్ 2017నవంబరులో జారీ చేయబడింది.అప్పటి నుండి జూన్ మరియు అక్టోబరులలో సవరణలకు గురైంది. ఈ తాజా మార్పులను సీరియల్ నెంబర్ 3, క్లాజ్ (ఎ)ని అప్‌డేట్ చేస్తుంది. మునుపటి సబ్ క్లాజ్‌లను కొత్తగా నామినేట్ చేయబడిన ఇద్దరు ఎంపీలతో భర్తీ చేయడం జరిగింది.

## జ్ఞానేష్ కుమార్‌దే కీలకపాత్ర
### బిహార్ ఎన్నికల ఫలితాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ఆరోపణలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నేత భూపేష్ బఘేల్



**దుర్గ్ :** ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత భూపేష్ బఘేల్ ఎన్నికల కమిషన్‌పై మండిపడ్డారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ భారీ విజయాన్ని నమోదు చేయడంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్‌డిఎ విజయంలో జ్ఞానేష్ కీలక పాత్ర పోషించారని, ఎన్నికల ఫలితాలకు ఆయనే బాధ్యత వహించారని భూపేష్ బఘేల్ విమర్శించారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై ఎలాంటిదో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బిహార్ ఎన్నికలకు కాంగ్రెస్ సీనియర్ పరిశీలకుడిగా ఉన్న బఘేల్ దుర్గ్‌లో పిటిఐతో మాట్లాడుతూ ఎన్‌డిఎ నాలుగింట ఒక వంతు మెజారిటీ వైపు పయనిస్తోందని ట్రెండ్స్ సూచిస్తున్నాయి.(కేంద్ర హోం మంత్రి) అమిత్‌షా ఇప్పటికే దీని గురించి మాట్లాడారు. ఈ మొత్తం ఎన్నికలకు (ఫలితానికి) బాధ్యత వహించే వ్యక్తి ఎవరైనా ఉంటే అది జ్ఞానేష్ కుమార్ అని, అందుకు తాను ముందుగానే ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియ చేస్తున్నామన్నారు. అయితే జ్ఞానేష్ కుమార్‌పై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించగా, 'ఎన్నికల సంఘం పనిచేసిన విధానం బిహార్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల, బాధ్యత వహించే వారు ఎవరినైనా అభినందించాలి. ఈ మొత్తం ఎన్నికల్లో జ్ఞానేష్ కుమార్ జీ పాత్ర కీలకం' అని అన్నారు. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) ఇమేజ్ 'జంగల్ రాజ్' అయితే, కాంగ్రెస్ ఆ పార్టీతో ఎందుకు పొత్తు పెట్టుకుంటోంది అని ప్రశ్నించగా, '20 సంవత్సరాల క్రితం జన్మించిన వారికి జంగిల్ రాజ్ గురించి తెలియదు. ప్రస్తుత జంగిల్ రాజ్ గురించి వారికి తెలుసు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిఒక్కరికీ మోదీ,షా జంగిల్‌రాజ్ గురించి తెలుసు' అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎంలు) పాత్ర గురించి లేవనెత్తిన ప్రశ్నలపై స్పందిస్తూ ఇంకా చాలా విషయాలు బయటకు వస్తాయన్నారు.

## సీట్ల పంపకాల్లో జెఎంఎంపై వివక్ష
### ఫలితాల్లో మహాగఠ్‌బంధన్ పేలవ ప్రదర్శన : జెఎంఎం



**రాంచి :** బిహార్‌లోని మహాఘట్బంధన్ కూటమిలో భాగస్వామిగా ఉన్న తమపై సీట్ల పంపకాల విషయంలో తమపై వివక్ష చూపించారని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) ఎంపి మహువా మాజీ పేర్కొన్నారు. అయితే శుక్రవారం వెల్లడియిన ఫలితాల్లో దుర్భరమైన ప్రదర్శనను కనబరిచిందన్నారు. సీట్ల పంపకాల ఒప్పందం సమయంలో మహాగఠబంధన్ ధర్మాన్ని నెరవేర్చడంలో లోపం ఉందని ఆమె అన్నారు. 'మేము ఇండియా కూటమిలో భాగం. సీట్ల పంపకాల ఒప్పందం చివరి నిమిషంలో జెఎంఎం వివక్షను ఎదుర్కొంది. పోటీ చేయడానికి మాకు సీట్లు కేటాయించాల్సి ఉంది. కానీ సీట్లు మాకు ఇవ్వలేదు. బిహార్‌లో మహాఘగట్బంధన్ ధర్మాన్ని నెరవేర్చడంలో లోపం ఉంది' అని రాజ్యసభ ఎంపి ఆరోపించారు. కాగా, జార్ఖండ్ అధికార పార్టీ అయిన జెఎంఎం అక్టోబర్ 20న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోమని ప్రకటించింది. మిత్రపక్షాలు ఆర్‌జెడి, కాంగ్రెస్ రాజకీయ కుట్ర నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. జెఎంఎం బిహార్‌లోని 12 స్థానాల్లో పోటీ చేయాలని కోరుకుందని, కానీ తరువాత ఆరు స్థానాల్లో స్వతంత్రంగా పోటీ చేస్తామని ప్రకటించింది. అయితే, పార్టీ నుండి ఏ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయలేదు. బిహార్‌లో కాంగ్రెస్ పనితీరుపై మాజీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ తగిన అభ్యర్థులను నిలబెట్టలేకపోయిందని నేను భావిస్తున్నాను. బిహార్‌లో తుది ఫలితాలు ప్రకటించే నాటికి మహాఘట్బంధన్ మొత్తం పనితీరు మెరుగుపడుతుందని ఆశిస్తున్నాను' అని ఆమె అన్నారు.

## సూసైడ్ బాంబర్ ఉమర్‌నబీ ఇల్లు కూల్చివేత



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారులో ఆత్మాహుతి దాడికి పాల్పడిన ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీ అలియాస్ ఉమర్ మహమ్మద్ ఇంటిని శుక్రవారం భద్రతా దళాలు కూల్చివేశాయి. కశ్మీర్‌లోని పుల్వామాలో ఉన్న ఆ ఇంటిని భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కూల్చివేత ప్రక్రియ కొనసాగింది. పేలుడు పదార్థాలు దాచేందుకు ఆ ఇంటి ఉమర్ నబీ వాడుకున్నట్లు గుర్తించారు. హుందయ్ ఐ20 కారుతో పేలుడుకు పాల్పడిన ఉమర్ నబీ.. డిఎన్ఎ శ్యాంపిళ్లను కన్ఫర్మ్ చేశారు. ఢిల్లీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 13 కాగా, 20 మందికిపైగా గాయపడ్డ విషయం తెలిసిందే. ఎర్రకోట సమీపంలోని నేతాజీ సుభాష్ మార్గ్ వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర పేలుడు ఘటన జరిగింది. ఉగ్రకార్యకలాపాలకు మద్దతు ఇచ్చే వారికి ఇలాంటి శిక్షే ఉంటుందన్న ఉద్దేశాన్ని తెలిపేందుకు ఉమర్ నబీ ఇంటిని పేల్చివేశారు. భారత భూభాగంపై ఉగ్రకార్యకలాపాలకు చోటు లేదన్న సంకేతాన్ని వినిపించారు

## వృక్షమాత పద్మశ్రీ తిమ్మక్క కన్నుమూత



**బెంగళూరు :** ప్రకృతితో ఐక్యంగా జీవితాన్ని మార్చుకున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రకృతి పరిరక్షకులు, ప్రముఖ పర్యావరణవేత్త అవార్డు గ్రహీత సాలుమరద తిమ్మక్క కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 114. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తిమ్మక్క బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. 1911, జూన్ 30న తుమకూరు జిల్లాలోని గుబ్బి తాలూకాలో తిమ్మక్క జన్మించారు. కర్ణాటక గ్రామీణ ప్రాంతాలను సస్యశ్యామలం చేయడంలో ఎంతో కృషి చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. 25 సంవత్సరాల వరకు పిల్లలు కలగకపోవడంతో మొక్కల్నే పిల్లలుగా భావించి, పచ్చదనం, పర్యావరణం కోసం ఆమె పనిచేస్తున్నారు. తిమ్మక్క అందించిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2019లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. అంతేకాదు, బిబిసి ఎంపిక చేసిన 100 మంది ప్రభావశీల మహిళల జాబితాలో తిమ్మక్క ఒకరిగా నిలిచారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ, ప్రకృతి ప్రేమికులు సంతాపం తెలియజేస్తున్నారు.

ప్రజాపక్షం
శనివారం, 15 నవంబరు

# కాంగ్రెస్ చేతికి జూబ్లీహిల్స్

హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌పై (ఆయన అకాల మరణం వల్లనే ఈ ఎన్నిక అవసరమైంది) దాదాపు 25 వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కొండంత ప్రోత్సాహకం పనికివస్తుంది.

గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్‌కి కాని ఈ నియోజకవర్గం కాంగ్రెస్ ఖాతాకు చేరటం మాత్రమే ఘనత కాదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ హైదరాబాద్ మహానగరంలో దానికి ఒక్కసీటు లభించని నేపథ్యంలో, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో గెలుపు తదుపరి జూబ్లీహిల్స్ కాంగ్రెస్ వశం కావటం నగరంలో పార్టీని పటిష్టం చేసేందుకు తోడ్పడుతుంది. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జిహెచ్ఎంసి) ఎన్నికల్లో ఇది పాలకపార్టీకి తప్పక సహాయకారి అవుతుంది. అంతేకాదు, పోలైన ఓట్లలో 51శాతంపైగా ఓటు వాటా కాంగ్రెస్‌కు లభించటం తెలంగాణ ఎన్నికల చరిత్రలో ఇదే ప్రథమం. రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల క్షేత్రంలోనూ ఈ ఉప ఎన్నిక ఫలితం కాంగ్రెస్ పార్టీని పురికొల్పుతుంది. అన్నిటికీ మించి రేవంత్‌రెడ్డి నాయకత్వం మరింత బలం సంతరించుకుంది. కాంగ్రెస్ కు 98,988; బిఆర్ఎస్‌కు 74,259; బిజెపికి 17,061 ఓట్లు లభించాయి.

తమ స్థానాన్ని నిలబెట్టుకునేందుకై ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ మాగంటి సునీతను తమ అభ్యర్థిగా నిలబెట్టి సానుభూతి ఓటుకు విజ్ఞప్తులు చేయటం సహా సర్వశక్తులు ఒడ్డింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోవటమేగాక, ఆ తదుపరి ఆరుమాసాల్లో జరిగిన లోకసభ ఎన్నికల్లో ఒక్కసీటు గెలుచుకోలేక చతికిలబడిన స్థితినుండి కోలుకుని పూర్వవైభవ పునరుద్ధరణకు, పార్టీ పునరుజ్జీవనకు ఈ ఉప ఎన్నికను అవకాశంగా భావించింది. వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తానే అభ్యర్థి అన్నంతగా వీధివీధి తిరిగారు. సైన్యాధిపతిలా పార్టీ శ్రేణులను నడిపించారు. ఆయన వ్యయప్రయాస వృధాపోలేదు. 'బిఆర్ఎస్ పని అయిపోయింది. ప్రధాన ప్రతిపక్షం మేమే, వచ్చే ఎన్నికల్లో అధికారం మాదే' అని భ్రమలు వ్యాప్తి చేస్తున్న బిజెపిని మూడవస్థానంలోకి నెట్టి ప్రధాన ప్రతిపక్షం మాదే అని బిఆర్ఎస్ నిలదొక్కుకోగలిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకున్న బిజెపి, 8 లోకసభ సీట్లు ఎలా గెలుచుకోగలిగిందన్నది ఇప్పటికీ, ఎప్పటికీ మిస్టరీయే. ఈ జూబ్లీహిల్స్ సెగ్మెంట్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలిచిన సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఉంది. ఆ ఎన్నికలో ఇక్కడ కిషన్‌రెడ్డికి 65 వేల ఓట్లు పోలైనాయి. ఇప్పుడు కిషన్‌రెడ్డి తానే అభ్యర్థి అన్నట్లుగా అవిశ్రాంతంగా ప్రచారం చేసినా బిజెపి అభ్యర్థికి సుదూర మూడవ స్థానం దక్కింది, డిపాజిట్ దక్కలేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బిజెపికి ఇంత నిరాశాజనక ఫలితం రావటం ఆ పార్టీకి నిస్సందేహంగా గట్టి ఎదురుదెబ్బ.

ఎవరు గెలిచినా – ఓడినా రాష్ట్రప్రభుత్వ సుస్థిరతకు ఇబ్బంది లేదు కాబట్టి ఈ ఉప ఎన్నిక సాంకేతికంగా పర్యవసానరహితమైంది. అయితే మూడు ప్రధాన పార్టీల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే రాజకీయవైరంతో అది ప్రతిష్టాత్మకమైంది. ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్, బిజెపిలు రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనపైనే దాడి ఎక్కుపెట్టాయి. కెటిఆర్ అయితే ఇది ప్రభుత్వంపై రెఫరెండం అని కూడా అన్నారు. నియోజకవర్గంలోని పరిస్థితులను చూసి విస్తుపోయిన ముఖ్యమంత్రి కనీస వసతుల మెరుగుదలకు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే తక్షణ చర్యలు తీసుకున్నారు. సామాజికవర్గాల వారీ తమ మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. తాను స్వయంగా ముమ్మర ప్రచారం చేస్తూ ప్రత్యర్థులపై రాజకీయ దాడిచేస్తూనే తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఇక్కడ బస్తీల స్థితిగతులను గుర్తెరిగి మాట ఒక్క కాగితం ఇచ్చిన వారు లేరు. తమ అభ్యర్థిని గెలిపిస్తే మీకు ప్రభుత్వంతో నేరుగా సంబంధం ఏర్పడుతుందని రేవంత్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి పేద ఓటర్లను ఆలోచింపజేసింది. ఎంఐఎం, సిపిఐ, సిపిఐ(ఎం)ల తోడ్పాటును, సినీ కార్మికులు సహా అనేక ప్రజా సంఘాల అండదండలు రాబట్టారు. మొత్తంమీద రేవంత్‌రెడ్డి ప్రచారం, వ్యూహాలు, ఎత్తుగడలు ప్రత్యర్థులను చిత్తుచేశాయనవచ్చు. రానున్న మూడేళ్లు రాష్ట్ర అభివృద్ధిపైనే కేంద్రీకరిస్తామని, ఇందుకు బిఆర్ఎస్, బిజెపి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కలిసిరావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమయోచిత విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ గెలుపు – కెటిఆర్ ఓటమి!


ఎస్.కె.జకీర్

జూబ్లీహిల్స్ యుద్ధంలో రేవంత్ రెడ్డి గెలిచారు. కెటిఆర్ ఓడిపోయారు. ఈ ఉపఎన్నిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు మధ్య పోరాటంలా జరిగినందున కాంగ్రెస్ అభ్యర్థి గెలుపును సిఎం గెలుపుగా అభివర్ణించవచ్చు. అలాగే బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటమిని కెటిఆర్ ఓటమిగానే భావించాలి.పైగా జూబ్లీహిల్స్ లో పార్టీ ఓడిపోతే తానే బాధ్యత వహిస్తానని కెటిఆర్ పోలింగుకు రెండు రోజుల ముందు చెప్పారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మృతి కారణంగా ఉప ఎన్నిక జరిగితే దీని ఫలితం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెఫరెండంగా పేర్కొనడం కెటిఆర్ చారిత్రక తప్పిదం. ఆయన రాజకీయ అపరిపక్వానికి నిదర్శనం. అసలే వరుస ఓటములకు గురవుతూ వస్తున్న బిఆర్ఎస్ పార్టీకి ఇది కోలుకోలేని దెబ్బ. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పాటు కంటోన్మెంటు ఉపఎన్నికలోనూ పరాజయం పాలు కావడం సాధారణ విషయం కాదు. ఎక్కడో ఏదో లోపం ఉన్నది. సైద్ధాంతికంగా కాకుండా కేవలం 'ప్రత్యేక తెలంగాణ' భావోద్వేగంతో పార్టీని ఏర్పాటు చేయడం తాజా సంక్షోభ పరిస్థితులకు ఒక కారణంగా విశ్లేషించవచ్చు. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత తెలంగాణలో మొదటిసారి అధికారంలోకి వచ్చిన కెసిఆర్ తన పార్టీని బలంగా నిర్మించుకోలేక పోయారు. సంస్థాగతంగా కింది స్థాయి నుంచి పార్టీ నిర్మాణం బలపడితే తనను ఎవరూ ఖాతరు చేయరని ఆయన అనుకొని ఉండవచ్చు. తనకు పార్టీలోపాలా, వెలుపలా ఎదురు లేకుండా ఉండాలంటే, తన మాటే శాసనంగా మారాలంటే 'సర్వస్వం తానే' అయి ఉండాలని టిఆర్ఎస్ పార్టీ నిర్మాత భావించి ఉండాలి. తనకు తెలియకుండా ఏదీ జరగరాదని, తనకు తెలియకుండా ఎవరూ ఏమీ చేయకూడదని కెసిఆర్ ఆశిస్తూ వస్తున్నారు.

తెలుగుదేశం పార్టీలో కీలక భూమిక పోషించి, చంద్రబాబు కేబినెట్ సహచరునిగా పనిచేసిన కెసిఆర్ కు పార్టీ నిర్మాణం గురించి ఎవరూ పాఠాలు చెప్పవలసిన పని లేదు. టిడిపి ఎన్ని సార్లు ఆటుపోట్లకు ఎదురయినా తిరిగి నిలబడడానికి, నిలదొక్కుకోవడానికి, ఓటమి నుంచి విజయానికి చేరుకోవడం వెనుక 'క్యాడర్ పార్టీ' గా చంద్రబాబు ఆ పార్టీని తీర్చిదిద్దడమే ప్రధాన కారణం. టిడిపి కూడా ప్రాంతీయ పార్టీయే. చంద్రబాబు కంటే తమ నాయకుడు కెసిఆర్ గొప్ప, ప్రధాన మంత్రి పదవి చేబట్టేందుకు అర్హుడు అంటూ భజనచేసే ముఠాలు కెసిఆర్ ను మరింత దెబ్బ తీస్తున్నాయి. పార్టీ లోపల, వెలుపల ఏమి జరుగుతుందో చెప్పేవారు పార్టీలో లేరు. చెప్పినా ఆయన తలకెక్కించుకోరు కనుక చెప్పకపోవడం మంచిదని అనుకునేవారు లేకపోలేదు. పైగా విమర్శను స్వీకరించే నైజం కాదు. సలహాలు తీసుకునే మనిషి కాదు. తనకే అన్నీ తెలుసునని కెసిఆర్ తన మైండ్‌లో ఫిక్స్ అయినందున సమీక్షలు, ఆత్మ విమర్శ వంటివి ఆయనకు నచ్చనివి. పార్టీ అంటే తానే. తానే పార్టీ. టిడిపి వలె పొలిట్ బ్యూరో లేదు. పోనీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ అయినా లేదు. పార్టీకి జిల్లా అధ్యక్షులుగా ఎమ్మెల్యేలనే నియమించారు. ఎమ్మెల్యేలు అయితేనే తన మాట వింటారని సిఎంగా ఉన్నప్పుడు కెసిఆర్ భావన. వేరే నాయకులను అధ్యక్షునిగా నియమిస్తే జిలాల్లో సమాంతర రాజకీయాలు, పోటీ రాజకీయాలు నడుస్తాయని ఆయన అనుమానం. అవి ఆధిపత్య పోరాటాలుగా మారితే పరిష్కరించడం కష్టమన్న భావన.

''ఇకపై తమది ఫక్తు రాజకీయ పార్టీ'' అని కెసిఆర్ 2014 లో ప్రకటించారు. కానీ రాజకీయ పార్టీ నిర్మాణాన్ని ఆయన ఉద్దేశపూర్వకంగానే మరచిపోయారు. పార్టీ నిర్మాణం పటిష్టంగా లేకపోతేనే తన 'మాట చెల్లుబాటు' అవుతుందని కెసిఆర్ భావిస్తున్నారేమో!! పైగా ఆయన బయట ప్రపంచానికి తెలిసినంత ధైర్యవంతుడు, శూరుడు కాదు. పిరికితనం ఎక్కువ. దాంతో అనుమానాలూ ఎక్కువే. తన నీడను కూడా కెసిఆర్ నమ్మేరకం కాదు. టెలిఫోన్ ట్యాపింగ్ ఉదంతం వెలుగులోకి వచ్చిన తర్వాత ఆయన గురించిన కొన్ని నిజాలు బయటపడ్డాయి. తన భర్త, భర్త తరపు మనుషుల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని కవిత ఆరోపించిన నేపథ్యంలో బహుశా తన కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా కెసిఆర్ ట్యాప్ చేయించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా కెసిఆర్ అనుమతి లేకుండా పోలీసు అధికారులు ఫోన్ ట్యాపింగ్ వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే సాహసం చేయకపోవచ్చు. కెసిఆర్ లేదా అంతటి 'ప్రాధాన్యం' ఉన్న వారెవరో పురమాయిస్తేనే 'ట్యాపింగ్ కాండ'కు పోలీసులు పాల్పడతారని పోలీసు వర్గాల్లో టాక్ ఉన్నది.









కాగా కెటిఆర్ నాయకత్వ సామర్థ్యంపై పార్టీలో చర్చ ఇదివరకటి నుంచే ఉన్నది. ఉపఎన్నిక ఫలితం వల్ల ఆ చర్చ మరింత ముదరనుంది. అంటే ఇంకా రంజుగా మారనుంది. కెసిఆర్ పాలనలో తాము చేసిన అభివృద్ధి పనులు, ఇతర అంశాలను ప్రచారంలోకి తీసుకువెళ్లే బదులుగా రెండేళ్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గురి పెట్టడమే తప్పు. పదేండ్లలో చేయలేని పనులు రెండేండ్లలో రేవంత్ ఎలా చేస్తారని ప్రజలు భావించారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థినని, సిఎం రేవంత్ రెడ్డికి తాను మాత్రమే పోటీదారు అని కెటిఆర్ ప్రవర్తించారు. ఆయన బాడీ లాంగ్వేజ్ కూడా అహంకారపూరితంగా, అణువణువునా గర్వం తొణికిసలాడినట్లుగా ఆ పార్టీ కార్యకర్తలే మాట్లాడుకున్నట్టు స్థానిక విలేకరుల ద్వారా తెలిసింది.

కెసిఆర్ కు కుడిభుజం అయిన మాజీమంత్రి హరీశ్ రావు తన తండ్రి మరణించిన మూలంగా పదిరోజుల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోయారు. హరీశ్‌రావు ప్రచారంలో లేకపోవడం తమకు మైనస్ అయినట్టు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. అలాగే పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ ఒక్క రోడ్ షోలో కూడా పాల్గొనకపోవడం, లేదా ఒక సభ నిర్వహించకపోవడం పెద్ద మైనస్ గా వాళ్ళనుకుంటున్నారు. ఇకపై పార్టీ బరువు బాధ్యతలన్నీ కొడుకు కెటిఆర్ చూసుకుంటారని గడచిన ఏప్రిల్ 27న ఎల్కతుర్తి సభలోనే కెసిఆర్ బహిరంగంగా సంకేతాలు ఇచ్చారు. ఆ సభ తర్వాత వివిధ కారణాలతో పార్టీలో సంక్షోభ వాతావరణం మొదలైంది. కెసిఆర్ కూతురు కవిత తండ్రికి రాసిన లేఖ బహిర్గతం కావడం, సామాజిక తెలంగాణ పేరిట ఆమె సొంత కార్యక్రమాలకు పూనుకోవడం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఆమెను సస్పెండ్ చేయడం, జాగృతి జనం బాట పేరుతో కవిత జిల్లాల యాత్ర ప్రారంభించడం వంటి పరిణామాలు ఆరు నెలల్లో సంభవించాయి.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికను కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేశాయి. ఏ కారణంగానో బిజెపి పోటీలో లేకుండా పోయింది. పోలింగుకు ముందే ఆ పార్టీ పోటీ నుంచి దాదాపు తప్పుకుంది. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ కేంద్రీకృతం కావడం విశేషం. త్రిముఖ పోటీ కాస్తా ముఖాముఖిగా మారింది. మాగంటి సునీత అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన సమయానికి బిఆర్ఎస్ ఆధిక్యంలో కనిపించింది. కాంగ్రెస్ పార్టీ కన్నా పది శాతానికి పైగా బిఆర్ఎస్ ఆధిక్యంలో ఉన్నట్టు కొన్ని సంస్థలు ప్రీపోల్ సర్వేల లో అంచనా వేశాయి. అది క్రమంగా తగ్గుతూ 3 లేదా 4 శాతంగా మారుతూ వచ్చింది. జూబ్లీహిల్స్ ఎన్నికల అనంతరం 500 రోజుల్లో కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడుతుందని కెటిఆర్ ప్రకటించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కవ్వించారు. కోరికోరి కష్టాలు కొని తెచ్చుకున్నట్లయ్యింది. జూబ్లీహిల్స్ ఫలితంపై కెటిఆర్ చేసిన 'ఓవర్ యాక్షన్' రేవంత్ ను రెచ్చగొట్టింది. అప్పటివరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ గురించి చేసిన ఆలోచన, రచించిన వ్యూహరచన వేరు. కెటిఆర్ ప్రకటన తర్వాత రేవంత్ రెడ్డి వ్యూహరచనను మలుపు తిప్పారు. పార్టీకి చెందిన బలగాలన్నింటినీ బరిలోకి దింపారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ ఎన్నికల కదనరంగంలోకి పరుగెత్తించారు. సిఎం స్వయంగా ప్రచారంలో పాల్గొంటూనే మరోవైపు పార్టీ పరిస్థితిని, ప్రత్యర్థుల బలాన్ని నిరంతరం అంచనా వేస్తూ, డివిజన్ల వారీ పరిస్థితిని సమీక్షిస్తూ, పర్యవేక్షిస్తూ, సలహాలు సూచనలు చేస్తూ నవీన్ యాదవ్ ను విజయతీరాల వైపునకు నడిపించారు. తమ ప్రభుత్వం 500 రోజుల్లో కూలిపోతుందని కెటిఆర్ అనడంతో ఉపఎన్నిక గెలవడానికి మించిన ఎజండా మరొకటి ప్రస్తుతానికి లేదని రేవంత్ పట్టుదలకు వచ్చారు. దీనికి కారణం తారక రామారావే. ఆయన రెచ్చగొట్టకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గెలుపు కోసం ఇంతగా పట్టు బట్టేవారు కాకపోవచ్చు.

అసలు రేవంత్ రెడ్డిని తక్కువ అంచనా వేయడంలోనే కెటిఆర్ వైఫల్యం కనిపిస్తుంది. మహాపర్వతం వంటి కెసిఆర్ ను 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటిచేత్తో కూల్చేసినప్పుడే రేవంత్ శక్తి సామర్థ్యాల గురించి కెటిఆర్ సరైన అంచనాకు వచ్చి ఉండాలి. అలాగే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ఎందుకు తిరస్కరించారన్న అంశంపై బిఆర్ఎస్ కు కనువిప్పు కలగకపోవడం వల్ల ఆ పార్టీకి అనర్థాలు జరుగుతున్నవి. ''ఒకసారి గొప్ప విజయం సాధించాక, ఇక విశ్రాంతి గురించి మాట్లాడకూడదు. వెసులుబాటు కావాలని అనుకోకూడదు. ఆధునిక యుగంలో సంపూర్ణ విజయమే లక్ష్యం అనేది మూల సూత్రం'' అని 1469 1527 కు చెందిన రాజకీయ తత్వవేత్త నికోలో మాకియవెలి అన్నాడు. అలాగే ''ఇంకా యుద్ధం ముగియలేదు'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాలలో అన్నారు.

# ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ నుండి మినహాయింపు నివ్వాలి

లేఖ

తెలంగాణ ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదలచేసింది. ఇన్ సర్వీసుఉపాధ్యాయులకు కూడా టెట్‌ను తప్పనిసరి చేస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు సవరణ చేస్తూ జిఒ.28 ను జారీచేసింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, ఉపాధ్యాయ సంఘాలు సుప్రీంకోర్టు తీర్పును సవాలు చేస్తూ రివ్యూ పిటిషన్ వేసాయి. ఈసారి జరగబోయే టెట్ పరీక్షకు ఉపాధ్యాయులు పెద్దమొత్తంలో హాజరయ్యే అవకాశం ఉంది. అయితే వచ్చిన చిక్కల్లా సిలబస్‌తోనే అని ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు వాపోతున్నారు. తాము బోధించే సబ్జెక్టులో పరీక్ష నిర్వహిస్తే రాయడానికి సిద్ధమే కానీ స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉపాధ్యాయుడికి కొరుకుడు పడని గణితం ఇవ్వడం సరైన విధానం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరి సబ్జెక్టులో వారికి పరీక్ష నిర్వహిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని మెజారిటి ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(1) మేరకు జాతీయ ఉపాధ్యాయ విద్యా కౌన్సిల్ నిర్దేశించిన మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయని, సర్వీసు లో ఉన్న టీచర్లను మినహాయించాలని ఉపాధ్యా య లోకం కోరుతున్నది. సీటెట్ అయితే కేంద్ర సిలబస్ ఉండడం ఇబ్బందిగా మారింది.

రాష్ట్రంలో విద్యాశాఖ నేటివరకు అన్ని ఉత్తర్వుల్లో మినహాయింపు ఇవ్వడం, టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఆదేశాలు ఇవ్వకపోవడంతో టీచర్లు టెట్ గురించి ఆలోచించలేదు. ఉన్నపాటు గా సుప్రీం తీర్పుతో ఉలికిపాటుకు గురయ్యా రు. అనుభవంతో పాటు నిత్యం అదే క్షేత్రంలో ఉన్న ఉపాధ్యాయులకు ఈ పరీక్షలు సాధారణ అంశమే. అయితే సైన్స్ వారికి గణితం ప్రశ్నలు అలాగే గణితం వారికి జీవశాస్త్ర ప్రశ్నలు ఉండడం కాస్త ఇబ్బందిగా మారింది. సాంఘిక శాస్త్రం వలె పూర్తిస్థాయి మార్కులు ఆయా సబ్జెక్టులకు కేటాయించే మార్పు వెంటనే చేయవలసిన అవసరం ఉంది. లేకుంటే టీచర్లు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. అదే మాదిరిగా భాషా ఉపాధ్యాయ టెట్ గురించి పూర్తిస్థాయి స్పష్టత రావలసి ఉంది.

ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు, వ్యక్తిగతంగా టీచర్లు మరియు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయడంతో తీర్పు మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఏది ఏమైనా దశాబ్దాల అనుభవం గడించిన టీచర్లకు ఇది సవాలుగానే భావించినా సిలబస్ విషయంలో మార్పులు చేపడితే పెద్ద సమస్య కాబోదు అన్నది పలువురు మాట్లాడుతున్న అంశం.


**సుధాకర్.ఎ.వి**
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్
9000674747

# ఏఐ తో గ్రామీణ భారతానికి కొత్త రూపం

గ్రామీణ భారతదేశంలో పేదరిక నిర్మూలనకు ఉపాధి హామీకి ఆధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో విప్లవాత్మక సాంకేతిక మార్పుల ఆవశ్యకత ఏర్పడింది. 2005లో ప్రారంభమైన ఈ పథకం ఇప్పుడు కృత్రిమ మేధస్సు డేటా విశ్లేషణ సాంకేతికతను ఉపయోగించి చెల్లింపుల ఆలస్యం, వేతనాల క్షీణత పర్యవేక్షణలో లోపాల వంటి సమస్యలను పరిష్కరించడానికి ముందడుగు వేసింది. దేశ గ్రామీణ జనాభాలో సుమారు 30 శాతం మందికి సంవత్సరానికి 100 రోజుల వేతన ఉపాధి హామీ ఇవ్వడమే దీని ప్రధాన లక్ష్యం. 2024 సంస్కరణల కేంద్ర బిందువుగా కృత్రిమ మేధస్సు వినియోగం ఇంకా కొన్ని రాష్ట్రాలలో నత్తనడక వేస్తున్నది. ఏఐ ఆధారిత పద్ధతులు ఉద్యోగ అవసరాలను ముందుగా అంచనా వేసి, వనరుల కేటాయింపును సద్వినియోగం చేసుకోవడంలో అలాగే ప్రాజెక్టుల పురోగతిని ప్రత్యక్షంగా పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఏఐ సాధనాలు ప్రాంతాల వారీగా ఉపాధి అవసరాలను ముందుగానే అంచనా వేయడం ద్వారా సమయోచితంగా ఉద్యోగ కేటాయింపులు జరిగేలా చేస్తాయి కానీ ఈ సాంకేతికను ఉపయోగించుకోవడానికి స్థానిక సంస్థలు గ్రామీణాభివృద్ధి సిద్ధంగా లేవు.

ఈ సంస్కరణల్లో ప్రధానమైన సాంకేతిక ఆవిష్కరణ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్. ఈ సిస్టమ్ జియోట్యాగింగ్ సాయంతో రోడ్లు, కాల్వలు, వరద రక్షణ నిర్మాణాలు వంటి ప్రాజెక్టులు నిర్దేశి త ప్రణాళిక ప్రకారం అమలవుతున్నాయా అని రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తుంది. ఇది నిధుల లీకేజీలను తగ్గించి, బాధ్యత నిర్ధారిస్తుంది. కొత్త డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా కార్మికులు మొబైల్ లేదా వెబ్ యాప్‌ల ద్వారా పనికోసం దరఖాస్తు చేసుకొని, కేటాయింపులను తెలుసుకోవచ్చు, వేతన చెల్లింపుల స్థితిని వెంటనే తనిఖీ చేయవచ్చు. అలాగే ప్రెడిక్టివ్ అనలిటిక్స్ ఆధారంగా వలస, వ్యవసాయ చక్రా లు, స్థానిక అవసరాలపై పాత డేటాను విశ్లేషించి, మట్టి సంరక్షణ, వనరుల పెంపకం, పునరుత్పత్తి శక్తి ప్రాజెక్టుల వంటి పనులు సమాజ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్నారు. అలాగే కరకట్టల నిర్మాణం, చెరువు ల్లో కుంటలు, తలపిరులు వంకలు సూయిజ్ సప్లయి ఛానెల్స్ మరమత్తులకు, అలాగే నాలా వ్యవస్థను పటిష్టపరచడానికి డ్రోన్ వ్యవస్థను అనుసంధానం చేయాలి.

ఈ ఏఐ ఆధారిత సాధనాలు ఇప్పటికే అమలులో ఉన్న డిజిటల్ చెల్లింపు విధానాలపై ఆధారపడి ఉన్నాయి, ఇవి నగదు లావాదేవీల లీకేజీలను గణనీయంగా తగ్గించాయి. అయితే, ఇంటర్నెట్ సదుపాయం లేని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా సవాళ్లు ఉన్నాయి. అందుకే ప్రభుత్వం సంప్రదాయ పద్ధతులతో కలిపి హైబ్రిడ్ పద్ధతిని అనుసరిస్తోంది. నారెగ పథకంలో చాలాకాలంగా ఉన్న సమస్యలు చెల్లింపు ఆలస్యం, వేతనాల క్షీణత, పర్యవేక్షణ లోపం వంటివి 2024 సంస్కరణలతో తగ్గుముఖం పట్టాయి. వేతనాలను ద్రవ్యోల్బణంతో అనుసంధానించి, పని పూర్తయిన 15 రోజుల్లో చెల్లింపులు జరిగేలా ఏఐ ఆధారిత పద్ధతులు అమలు చేస్తున్నారు. పథకం పరిధిని విస్తరించి, ప్రకృతి వనరుల నిర్వహణ మరియు నైపుణ్యాభివృద్ధికి అనువైన ప్రాజెక్టులను కూడా చేర్చారు. కనీసం ఒక మూడవ వంతు మంది మహిళల పాల్గొనడం తప్పనిసరిగా చేయడం ద్వారా లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు, సమానపనికి సమాన వేతనం దక్కుతుంది.




ఏఐ విశ్లేషణ ఆధారంగా వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒడిశాలోని వలస ప్రభావిత బ్లాకులలో లబ్ధిదారులకు అదనపు వేతనాలు ఇవ్వడం వంటి కొత్త చర్యలు కూడా ప్రవేశపెట్టబడ్డాయి. 2023–24 సంవత్సరానికి బడ్జెట్ రు.60,000 కోట్లు తగ్గిన, ప్రభుత్వం ఏఐ ఆధారిత ఆడిట్లు మరియు సోషల్ ఆడిట్ల ద్వారా పారదర్శకతను, ఖర్చు తగ్గింపును సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. నిపుణుల అంచనా ప్రకారం, ఈ సంస్కరణలు గ్రామీణ ఉపాధి సృష్టిని పెంచి, పట్టణ వలసలను తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచగలవు. అయితే అమలులో కొన్ని అడ్డంకులు కూడా ఉన్నాయి. కార్యాలయం ఆలస్యం, సాంకేతికతను అంగీకరించడంలో ప్రతిఘటన, గ్రామీణ కార్మికులలో డిజిటల్ అక్షరాస్యత లోపం. దీనికి పరిష్కారంగా ప్రభుత్వం స్థానిక పంచాయతీ సామర్థ్యాన్ని పెంచడం పై దృష్టి సారించింది. అలాగే స్వచ్ఛంద సంస్థలతో భాగస్వామ్యం ద్వారా కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. తమిళనాడులో ఈ సంస్కరణలు విజయవంతమయ్యాయి. ఏఐ ఆధారిత అమలు విధానం స్థానిక ఉపాధి అవసరాలు తీరడమే కాకుండా మౌలిక వసతుల అభివృద్ధి చేసింది. ఏఐ ఆధారిత జాతీ య ఉపాధి హామీ పథకం కేవలం ఉద్యోగాలు ఇవ్వడమే కాదు, గ్రామీణ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

2030 నాటికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ ప్రాజెక్టుల ను సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానం చేయడం ప్రభుత్వ లక్ష్యం. ఏఐ ఆధారిత ప్రణాళికలు పర్యావరణానికి అనుకూలమైన ప్రాజెక్టులను నిర్ధారించనున్నాయి. సమయానికి వేతనాలు రావడం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం జీవితాలను మార్చేసిందని లబ్ధిదారులు అంటున్నారు. 2024 సంస్కరణలు కేవలం ఉపాధి హామీ పథకం కంటే ఎక్కువ. ఇవి గ్రామీణ భారతదేశాన్ని సాంకేతికంగా శక్తివంతం చేసే దిశగా ముందడుగు. కృత్రిమ మేధస్సు ఆధారంగా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ, ఈ పథకం ఉపాధి నుండి సుస్థిర అభివృద్ధి దిశగా ప్రయాణిస్తోంది.

డా. సిహెచ్. నవీన్ కుమార్ రెడ్డి

# వ్యర్థాల పునర్వినియోగానికి పెద్ద పీట వేద్దాం

వ్యర్థాలను మట్టిలో వదిలేయకుండా ఉపయోగించి నూతన ప్రయోజనకర వస్తువులను తయారు చేసే ప్రక్రియను రీసైక్లింగ్ (పునర్వినియోగ ప్రక్రియ) అని పిలుస్తాం. వ్యర్థాలు రేపటి సమాజ అనారోగ్య కారణాలు. వ్యర్థాలతో నేల తల్లి తల్లడిల్లుతున్నది. గరళ వ్యర్థాల కారణంగా వన్యప్రాణులు, జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. నేలపై వ్యర్థాల కుప్పలను తగ్గించడం, కాలుష్యాన్ని తగ్గించడం, నీటి వనరుల రక్షణ, శక్తి ఆదా, హరితగృహ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, ఆర్థిక వెసులుబాటు, ఉద్యోగాల కల్పన, కొత్త ఉత్పత్తుల తయారీ లాంటి ప్రయోజనాలు కలిగిన రీసైక్లింగ్ ప్రక్రియను వ్యక్తి నుంచి మొదలై పౌర వ్యవస్థలు, సంస్థలు, ప్రభుత్వాల వరకు అందరూ నిరంతరం కృషి చేయాలి. ఒక టన్ను వ్యర్థ పేపర్‌ను రీసైక్లింగ్ చేయడం ద్వారా పరోక్షంగా వేల చెట్లు, 7,000గ్యాలెన్ల నీరుకా సమానంగా ప్రయోజనం జరుగుతుందని తేలింది.

వ్యర్థాల రీసైక్లింగ్ ప్రక్రియ ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆచరణలో పెట్టడానికి ఏటా 15 నవంబర్ రోజు జాతీయ రీసైక్లింగ్ దినోత్సవం (నేషనల్ రీసైక్లింగ్ డే) పాటించడం అమెరికా నుంచి ప్రారంభానికి నేడు విశ్వవ్యాప్తం అవుతున్నది. ప్రస్తు త పౌర సమాజ ఆరోగ్య పరిరక్షణే కాకుండా భవిష్యత్తు తరాల మనుగడకు నేడే రీసైక్లింగ్ పునాదులు పడాలి. రీసైక్లింగ్ ఫలితంగా పర్యావరణం పరిరక్షణ, నేలపై వ్యర్థాల కుప్పలు తగ్గడం, ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, శక్తి పొదుపు, పౌర సమాజ అభివృద్ధి, వన్యప్రాణుల రక్షణ, సహజ వనరుల సంరక్షణ, భూపాల వాయువుల కట్టడి లాంటి ప్రయోజనాలు కలిగిన రీసైక్లింగ్ ప్రక్రియ పట్ల ప్రజల్లో లోతై న అవగాహన కల్పించాలి. వ్యర్థాల నియంత్రణ సూత్రాలుగా రెడ్యూస్ (తగ్గించడం), రీయూజ్ (తిరిగి వాడడం), రీసైక్లింగ్ (నూతన వస్తువుల తయారీ), రెఫ్యూజ్ (తిరస్కరించడం), రీకవర్ (తిరిగి పొందడం), రోట్ (జీవవిచ్ఛిన్నం చేయడం), రీపర్పస్ (మరో పనికి వాడడం) లాంటి ప్రధాన అంశాలను పేర్కొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యం రానున్న రోజుల్లో ప్రమాదకరంగా మారనుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టిలో జీవవిచ్ఛిన్నం కావడానికి వందల ఏండ్ల పట్టడం వల్ల ఈ వ్యర్థాలతో వన్యప్రాణులు, జల తరాల మనుగడ ప్రాణాంతకంగా మారింది. రీసైక్లింగ్ అనే ప్రక్రియ మన నిత్య మంత్రం కావాలి. వ్యర్థాలను తగ్గించడం ఇంటి నుంచే మొదలు కావాలి. నేటి వ్యర్థం రేపు మన ప్రాణాలను తీసే ప్రమాదం కూడా ఉందని తెలుసుకోవాలి. రీసైక్లింగ్ ప్రాధాన్యాలను గుర్తించిన విశ్వ పౌర సమాజం ప్రతి ఏట 18 మార్చి రోజు ప్రపంచ రీసైక్లింగ్ దినం, 27 మార్చి రోజు శూన్య వ్యర్థాల అంతర్జాతీయ దినం కూడా పాటించడం జరుగుతుంది.

(15 నవంబర్ జాతీయ రీసైక్లింగ్ దినోత్సవం సందర్భంగా)

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# బిర్సా ముండా... ఆదివాసీ స్వేచ్ఛా హక్కుల సింహగర్జన

భారత స్వాతంత్ర్య పోరాట గాథలో అనేక మంది ధీరులు తమ ధైర్యం, త్యాగం, సంకల్పంతో చరిత్ర సృష్టించారు. కానీ ఆ విప్లవ జ్వాలలో అరణ్యాల మధ్యనుండి మహాగర్జనగా ఎదిగి, ఆదివాసీ హక్కుల కోసం అచంచలంగా పోరాడిన నాయకుడే బిర్సా ముండా. 15 నవంబర్ 1875లో జార్ఖండ్‌లోని ఉలిహాటు గ్రామంలో పేద కౌలు రైతు కుటుంబంలో జన్మించిన ఈ గిరిజన బాలుడు చిన్నతనం నుంచే బ్రిటిష్ దోపిడీ, భూస్వాముల అణచివేత, ఆదివాసీలపై జరుగుతున్న దౌర్జన్యాలను చూసి రగిలిపోయాడు. 19వ శతాబ్దం చివర్లో ఛోటానాగ్పూర్ ప్రాంతంలో బ్రిటిష్ పాలకులు 'ఖుంట్ కట్టి' భూమి వ్యవస్థను (సమిష్టి భూమి యాజమాన్య హక్కులు) రద్దు చేయడం, ఆదివాసీ భూములను ఆక్రమించడం, పన్నుల భారం మోపడం, బలవంతపు శ్రమను అమలు చేయడం వంటి చర్యల వల్ల ఆదివాసీల జీవితం పూర్తిగా దెబ్బతింది. తాము సాగుచేసిన భూమిపై హక్కులు కోల్పోయిన గిరిజనులు అణచివేతలో కూరుకుపోయారు. ఈ సమయంలో బిర్సా ముండా వారిలో నిద్రించిన ఆత్మగౌరవాన్ని మేల్కొలిపి, వారిని స్వాభిమాన పోరాటానికి నడిపించాడు. అతని ఆధ్యాత్మిక శక్తి, నాయకత్వం లోని దృఢత్వం ప్రజలకు కొత్త జీవం పోశాయి. గిరిజనులు అతన్ని ధర్తి అబ్బా, రక్షకుడు, దివ్య నాయకుడిగా, 'అబ్బా బిర్సాగా' భావించారు. వారిలో 'బిర్సాయిత్' అనే సంప్ర దాయాన్ని, విశ్వాసాన్ని నెలకొల్పి గిరిజన సంఘాలన్నింటిని ఏకీకరణ చేసి ఉద్యమం వైపు నడిపించాడు. బిర్సా ముండా నాయకత్వంలో ఆవిర్భవించిన మహా పోరాటం ఉలుగులాన్ అంటే మహాగర్జన. ఇది బ్రిటిష్ వలస పాలనను అణచివేసే శక్తివంతమైన ఆదివాసీ తిరుగుబాటు. బిర్సా గెరిల్లా యుద్ధ వ్యూహాలను ప్రయోగించి అరణ్యాల భౌగోళిక పరిజ్ఞానాన్ని తన



సేనకు శక్తిగా మార్చాడు. అతని సేనలో ప్రజల ఐక్యత, నైతిక ధైర్యం, స్వేచ్ఛా సంకల్పం. ఇవన్నీ కలిసి అజేయ శక్తిగా నిలి చాయి. ఈ పోరాటం కేవలం ఆయుధ యుద్ధం కాదు. ఇది సంస్కృతి రక్షణ, భూమి హక్కుల పునరుద్ధరణ, న్యాయం కోసం సాగిన పవిత్ర విప్లవం.

మన భూమి మనదే. మన స్వేచ్ఛ మన హక్కు. అని ఇచ్చిన బిర్సా నినాదం అరణ్యాల్లో ప్రతిధ్వనించింది. అతని ప్రబల ప్రభావంతో భయపడిన బ్రిటిష్ పాలకులు 1900లో బిర్సాను అరెస్టు చేశారు. రాంచీ జైలులో 25 ఏళ్ల వయసులోనే అతను మరణించినా, అతని పోరాటం అమరత్వం పొందింది. అతని త్యాగం అనంతరం బ్రిటిష్ ప్రభుత్వం 'చోటానాగ్పూర్ టెనెన్సీ చట్టం' (1908)ను అమలు చేసేందుకు అంగీకరించింది. ఇది గిరిజన భూములకు చట్టబద్ధ రక్షణ కల్పించిన చారిత్రక అడుగు. బలవంతపు శ్రమను రద్దు చేయడం, భూబదిలీ నియంత్రణ వంటి సంస్కరణలు బిర్సా పోరాటానికి ప్రత్యక్ష ఫలితాలు. నేడు బిర్సా ముండా పేరు భారతదేశానికే పరిమితం కాదు. ప్రపంచ వ్యాప్తంగా స్వదేశీ ప్రజల హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలన్నింటికీ ఆయన జీవితం ప్రేరణ. ఆయన జయంతిని భారత ప్రభుత్వం జాతీయ గిరిజన దినోత్సవం 'జన జాతీయ గౌరవ దివస్' గా ప్రకటించడం ఆయన చారిత్రక పోరాట ప్రభావానికి నిదర్శనం.

(నవంబర్ 15న బిర్సా ముండా జయంతి సందర్భంగా)

**గిలకత్తుల వెంకటరమణ**
9866878769

## పోరాటానికి సిద్ధం కావాలి



ప్రజాపక్షం/ఫరూక్‌నగర్: మాలల పోరాటానికి సిద్ధం కావాలని షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు సుంకం నరసింహ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం, కిషన్‌నగర్ గ్రామాల్లో మాలల రణబేరి మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు సుంకం నరసింహ, మండల అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ నవంబర్ 23న సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న మాలల రణబేరి సభను సక్సెస్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బర్ల శ్రీనివాస్, శివశంకర్, లింగం, రవి, అనిల్, రామచంద్రయ్య, చెన్నయ్య, మాణెమ్మ, పద్మమ్మ, పార్వతమ్మ, చిన్నమ్మ, అండాలు, అంజమ్మ, సబిత, కిష్టమ్మ, అంతమ్మ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజాపక్షం/మియాపూర్: మియాపూర్ డివిజన్ మయూరి నగర్ కాలనీలోని జలమండలి కార్యాలయంలో డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శుక్రవారం జలమండలి డిజిఎం నారాయణ, మేనేజర్ సునీతతో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని, అభివృద్ధి విషయంలో రాజీ పడకూడదని, ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా పనిచేయాలని, ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండాలని అన్నారు. అభివృద్ధి పనులలో వేగం పెంచాలని, అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎం సహాయ నిధి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/కేశంపేట: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయం అంధిస్తున్నామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20లబ్దిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరేశం, మార్కెట్ డైరెక్టర్లు కరుణాకర్, భాస్కర్‌గౌడ్, మాజీసర్పంచులు శ్రీధర్‌రెడ్డి, రాఘవేందర్‌రావు, రాము లు, నేతలు చేవెళ్ల నర్సింలు, రాజేందర్‌రెడ్డి, ఎండి ఆమేర్, నరేందర్‌రెడ్డి, నాగేశ్వర్, మధు, ముత్యాలు, అఖిల్, శ్రీశైలం, రాజేందర్, రాజేష్ పాల్గొన్నారు.

## ఘనంగా నెహ్రూ జయంతి వేడుక

షాద్‌నగర్: భారతదేశ తొలి ప్రధాన మంత్రి పండిత్ జవహర్‌లాల్ నెహ్రు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న నెహ్రు విగ్రహానికి పూల మాలలు వేసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాళ్ళు అర్పించారు. నెహ్రు జయంతిని పురస్కరించుకొని చిన్నారులకు గులాబీ పూలను అంధించారు. దేశానికి నెహ్రు చేసిన సేవలను కొనియాడారు. నందిగామ మండల పరిధిలోని మోదళ్ళగూడ, నర్సప్పగూడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని గృహప్రవేశం చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నేతలు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, విశ్వం, బస్వం, సత్తయ్య, లింగారెడ్డిగూడ అశోక్, మాణిక్యం, భగవాన్‌దాసు, సీతారాములు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : శంకర్ పల్లి పట్టణంలోని లిటిల్ స్టార్స్ హై స్కూల్ లో శుక్రవారం జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కూరగాయల మార్కెట్లో గల నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ సిఐ సతీష్ పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సంజీత్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు ఆనంద్ కుమార్, ఇందిరా, జయశ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను నియమించండి

ఎంఇఒకు వినతిపత్రం ఇచ్చిన గ్రామస్తులు



ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సక్రమంగా లేకపోవడంతోనే విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని పాఠశాల అభివృద్ధి కమిటి సభ్యులు ఆరోపించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడంటూ ఎంఇఓ మనోహర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సక్రమంగా లేకపోవడంతోనే విద్యార్థులు విద్యకు దూరం కావడంతోపాటు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారని వాపోయారు. రంగంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి వరకు ఉండగా 24మంది విద్యార్థులు ఉన్నారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఉన్నా..వాటిని ఎవరు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడుతున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని, కొంతమంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్ళారని వివరించారు. రంగంపల్లి ప్రాథమిక పాఠశాలకు ఎంతమంది ఉపాధ్యాయులు ఉండాలో అంతే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఇవో మనోహర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పురుగుల శివరాజ్, సక్కని దశరథ్, పురుగుల రమేష్, శ్రీకాంత్, చెన్నయ్య, వెంకటేష్, సురేష్, రమేష్, వేణు, శివ, నవీన్‌లు ఉన్నారు.

## క్రీడోత్సవ్ ముగింపు వేడుకలు




ప్రజాపక్షం/మియాపూర్: మియాపూర్ త్రివేణి స్కూల్ లో మూడు రోజుల పాటు నిర్వహించిన త్రివేణి ప్రైమరీ స్కూల్స్ విద్యార్థుల క్రీడోత్సవ్ ముగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ముగింపు వేడుకలకు త్రివేణి స్కూల్స్ డైరెక్టర్ డా. వీరేంద్ర చౌదరి, ప్రముఖ పర్వతారోహకురాలు, విమెన్ పురస్కార్ అవార్డు గ్రహీత పడిమితి అన్విత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డా. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, "విద్యార్థులు క్రీడలను, యోగాను తమ దినచర్యలో భాగం చేసుకుంటే, వారు చేసే ప్రతీ పనిలోనూ విజేతలుగా నిలుస్తారు. కేవలం చదువులు మాత్రమే కాదు, శారీరక దారుఢ్యం కూడా విజయానికి మేలుకొలుపు అని అన్నారు. పర్వతారోహకురాలు పడిమితి అన్విత మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే ఆటల్లో పాల్గొనడం ద్వారా భవిష్యత్ విజేతల లక్షణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం మూడు రోజులు పాటు వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విజేతలకు డా. వీరేంద్ర చౌదరి, పడిమితి అన్వితలు మెమెంటోలు , సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో త్రివేణి విద్యా సంస్థల సీఆర్వోలు, జాట్ టీం సభ్యులు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# 'మీ డబ్బు – మీ హక్కు'పై అవగాహన

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్



ప్రజాపక్షం/రంగారెడ్డి: 'మీ డబ్బు,మీ హక్కు'పై అవగాహన కలిగి ఉండాలని, ప్రజలు తమ క్లెయిమ్ చేసుకోకుండా బ్యాంకులలో మిగిలి ఉన్న డిపాజిట్లు, వాటాలు, డివిడెండ్‌లు, మ్యూచువల్ ఫండ్‌లు, బీమా ఆదాయాలు మొదలైన వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించడం జరిగిందని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన మీ డబ్బు – మీ హక్కు"అనే థీమ్‌తో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల పరిష్కారంపై జిల్లా స్థాయి అవగాహ కమ్ క్యాంపెయిన్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా, 01.10.2025 నుండి 31.12.2025 వరకు "మీ డబ్బు,మీ హక్కు"అనే ట్యాగ్‌లైన్‌తో ఆర్థిక రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తుల పరిష్కారం కోసం జాతీయ స్థాయి అవగాహన ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రచారం తో ప్రజలు తమ క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, వాటాలు, డివిడెండ్‌లు, మ్యూచువల్ ఫండ్‌లు, బీమా ఆదాయాలు మొదలైన వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తుల హక్కుదారులు తమ బ్యాంకులను లేదా ఇతర సంస్థలను సంప్రదించి, నిధులను తిరిగి పొందాలని మరియు ప్రచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎస్‌బిఐ డిజిఎం ప్రియవ్రత మిశ్రా మాట్లాడుతూ క్లెయిమ్ చేయని డిపాజిట్లు, పెట్టుబడులు వాటి చట్టబద్ధమైన యజమానులకు తిరిగి ఇవ్వబడతాయని, ఈ ప్రచారం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. ఎస్ఎల్‌బిసి, ఎజిఎం పద్మజారాణి మాట్లాడుతూ ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి, ఆర్థిక పారదర్శకతను నిర్ధారించడానికి వారి సంబంధిత కమ్యూనిటీలలో అవగాహనను వ్యాప్తి చేయాలని, పాల్గొనే వారందరినీ ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సందర్శించారు. శిబిరం ఏర్పాటు చేయడంతో వినియోగదారులకు సేవలు అందించారు. సరైన హక్కుదారులకు సెటిల్‌మెంట్ లెటర్‌లను జారీ చేశారు. ఎల్ డిఎం పి.సుశీల్ కుమార్, ఎల్ డిఎల్ డిఎం కార్యాలయ అధికారులు, క్లెయిమ్ చేయని ఆస్తులను క్లెయిమ్ చేయడంలో అదేవిధంగా కస్టమర్లు తమ నిజమైన డబ్బును పొందడంలో సహాయం చేయడం తోపాటు అవగాహన కల్పించడంలో అన్ని బ్యాంకర్లు చురుగ్గా వ్యవహరించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి(డిపిఒ)వి.సురేష్ మోహన్, శ్రీలక్ష్మి, రామరావు, ఉష, బ్యాంక్ అధికారులు, ప్రజలు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## బిహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి గెలుపు అప్రజాస్వామికం

సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ

ప్రజాపక్షం/యాచారం : బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అప్రజాస్వామికంగా గెలిచిందని సిపి(ఐ)ఎం రాష్ట్రకార్యదర్శి జాన్ వేస్లీ విమర్శించారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలోని గున్‌గల్ గేటు వద్ద ఉన్న పక్షన్ హల్‌లో పార్టీ రంగారెడ్డి జిల్లా వర్కుషాపు జరిగింది. కార్యక్రమానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిజెపి వ్యతిరేక ఓట్లను బిహార్‌లో తొలగించిందన్నారు. కేంద్రంలోని మతతత్వ బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. రాష్టంలోని జూబ్లి హిల్స్ ఉప ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ గెలిపించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాచారం మండలంలో చేస్తున్న బలవంతపు భూసేకరణ అపాలని డిమాండ్ చేశారు. హైద్రాబాల్ గ్రీన్ ఫార్మాసిటిలో నిషేధిత జాబితాలో ఉన్న రైతులందరి పేర్లు అన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. రైతుల ఇష్టం లేకుండా భూసేకరణ చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, నాయకులు జగదీష్, బాస్కర్, సామేల్, కె. జగన్, ఎ. నర్సింహ్మా, సిహెచ్ జంగయ్య,పి.అంజయ్య, బ్రహ్మయ్య, చందు నాయక్, ఎ.జంగయ్య, ఎంజె వినోద్‌కుమార్ పాల్గొన్నారు.




## యువత స్వయం ఉపాధి అవకాశాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి : సుధీర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : యువత స్వయం ఉపాధి అవకాశాలు అలవర్చుకోవాలని ఎల్‌బి నగర్ నియోజకవర్గ ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని టీచర్స్ కాలనీ బిడి రెడ్డి గార్డెన్స్ ప్రధాన రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లయన్ క్లబ్ కిడ్స్ వేర్‌ను సంస్థ ప్రతినిధి బుడిద సాయి కృష్ణ, బోలుసాని నిఖిల్ కుమార్‌తో కలిసి ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ పిల్లల కోసం నాణ్యమైన, ఆధునిక శైలిలోని దుస్తులను సరసమైన ధరల్లో అందించాలనే లక్ష్యంతో ఈ స్టోర్‌ను ప్రారంభించామని వారు తెలిపారు. నవంబర్ 14, 2025 పుట్టిన వారికి స్టోర్ ఉన్నంతవరకు 50 శాతం రాయితీ ఇస్తామని, 3 వేలు పైగా షాపింగ్ చేసిన వారికి ఫోటో షూట్ ఉచితంగా తీయబడునని నిర్వాహకులు తెలిపారు. నూతన ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా అన్ని వయస్సుల చిన్నారుల కోసం విస్తృత శ్రేణిలో కలెక్షన్స్‌ను అందిస్తున్నామని వారు పేర్కొన్నారు. అనంతరం ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త కొత్త అలోచనతో వ్యాపారం చేయడం ద్వారా ప్రజల్లో మంచి పేరు వస్తుందని ఆయన అభినందించారు. అనంతరం ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డికి, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని నిర్వహకులు ఘనంగా శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో నిర్వహకులు పాల్గొన్నారు.

### సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి చేకురుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్‌కు చెందిన చెరుకు శ్రీనివాసులు కడుపు నొప్పి సమస్యతో బాధపడుతున్న అతని, బాధిత కుమారుడు పవన్ తేజ్‌కు రూ.లక్ష 15 వేల ఎల్‌ఓసీని శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీయం సహాయనిధి దోహదపడుతుందన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సిఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చైతన్య పురి డివిజన్ పార్టీ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, సింగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

## విద్యావేత్త మంజులారాణి మరణం విద్యారంగానికి తీరని లోటు

రాష్ట్ర గ్రంథాలయ శాఖ మాజీ చైర్మన్ ఆయచితం శ్రీధర్

ప్రజాపక్షం/సరూర్‌నగర్ : ప్రముఖ విద్యావేత్త లోటస్ ల్యాప్ స్కూల్స్ డైరెక్టర్ కోమటిరెడ్డి మంజులారాణి అకాల మరణం విద్యారంగానికి తీరని లోటని రాష్ట్ర గ్రంథాలయ శాఖ మాజీ చైర్మన్ ఆయచితం శ్రీధర్ అన్నారు. దిల్‌షుఖ్‌నగర్ లోటస్ ల్యాప్ స్కూల్ ఆడిటోరియంలో తెలంగాణ స్టడీ ఫోరం ఆధ్వర్యంలో మంజులారాణి సంస్మరణ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ స్టడీ ఫోరం అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్‌చారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ వికాసంతి ప్రధాన కార్యదర్శి రాజా మహేందర్‌రెడ్డి, స్టడీ ఫోరం ఉపాధ్యక్షులు టి.సత్యనారాయణ, లోటస్ ల్యాప్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి పాల్గొని మంజులారాణి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో పేరు ప్రఖ్యాతలు సాధించిన విద్యావేత్త మంజులారాణి మరణం భాదాకరం అని ఆవేధన వ్యక్తం చేశారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల ఎదుగుదలలో, తన వ్యక్తిగత అభివృద్ధిలోమంజూలరాణి కృషి ఎనలేనిదన్నారు. ప్రభుత్వ కళాశాలలో సేవలు అందిస్తునే, ప్రవేటు రంగంలో లోటస్ ల్యాబ్ స్కూల్స్ డైరెక్టర్‌గా విశేష కృషి చేశారని కొనియాడారు. ఆమె ఆకాంక్షను, లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని విద్యార్థులను ఉద్దేశించి వెల్లడించారు. తమ విద్యా సంస్థల ప్రతి మలుపులో మంజులారాణి ఆశయ పాత్ర కొనసాగుతూనే ఉంటుందని, భవిష్యత్‌లో సాధించే ప్రతి విద్యా విజయంలోఆమె దార్శనికతే మాకు మూలమవుతుందన్నారు. కార్యక్రమంలో ఈపిడిసి అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య పాల్గొన్నారు.




# అభివృద్ధి, సంక్షేమానికి పట్టంకట్టిన జూబ్లీహిల్స్ ప్రజలు

ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ శంకర్

నవీన్ విజయం పట్ల కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



ప్రజాపక్షం/షాద్‌నగర్ : జూబ్లీహిల్స్‌లో ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టంకట్టారని, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ప్రభుత్వ తీరుకు నిదర్శనమని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఉప ఎన్నికలో బిఆర్‌ఎస్‌కు జూబ్లీహిల్స్ ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారన్నారు. విలువలతో కూడిన ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రిపై బిఆర్‌ఎస్ నేతలు నోటికి వచ్చినట్లు విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. అనంతరం జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయంపై ఎమ్మెల్యే నాయకత్వంలో స్థానిక కాంగ్రెస్ నేతలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

షాబాద్ : ప్రభుత్వ సంక్షేమ ఫలాలే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం సాధించిందని గుడి మల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విజయత్సోవ సంబరాలు జరుపుకున్నారు. పార్టీ కార్యకర్తలు ఒక్కరిరొక్కరు స్వీట్స్ తినిపించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, మాజీ సర్పంచులు జనార్ధన్ రెడ్డి, తమ్మలి రవీందర్, నాయకులు దండు రాహుల్, శేఖర్, శ్రీనివాస గౌడ్, ఖుదూస్, గౌరీశ్వర్, శ్రీనివాస్,రమేష్, జంగయ్య పాల్గొన్నారు.



హయత్ నగర్: జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయాన్ని పురస్కరించుకొని హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ప్రజలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నగౌని రవీందర్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాచారం : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయంపై యాచారం మాజీ ఎంపిపి రమావత్ జ్యోతీ శ్రీనివాస్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడూతూ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే ఉంటారని విశ్వాసం వ్యక్తం చేశారు.

సరూర్‌నగర్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపొందడం హర్షణీయం అని గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వివినగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన టపాసులు పేల్చి, మిఠాయిలు తినిపించి సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బద్దుల మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమానికి జూబ్లీహిల్స్ ప్రజలు పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేశంపేట: జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుతో మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేష్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు రాణి, కరుణాకర్‌రెడ్డి, తైదా పర్వతాలు, కోడూరి రాములు, తుమ్మల గోపాల్, ప్రకాష్ గౌడ్, అనసూయమ్మ, హరిశ్వర్‌రెడ్డి, పాండు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమానికి చేయూత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

శంకర్‌పల్లి : హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందినందుకు శుక్రవారం శంకర్ పల్లి పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో మున్సిపల్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టపాకాయలు కాల్చి ఆనందించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి జూబ్లీహిల్స్ ఓటర్లు పట్టం కట్టారని తెలిపారు. కార్యక్రమంలో శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాతా ప్రవీణ్ కుమార్, చేకూర్త గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.











## కార్తీక మాసం పూజల్లో మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్



**ప్రజాపక్షం/వర్ధపల్లి:** కార్తీక మాసం సందర్భంగా కీసర దాయర గ్రామంలో ఉప్పల్ మాజీ ఎంఎల్ఎ ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ వ్యవసాయ క్షేత్రంలో శివారాధన, గో పూజలు, వన భోజనం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.నాధం, తాళ్ల ఆనంద్ గౌడ్, ఎం లక్ష్మణ్ గౌడ్, రామకృష్ణగౌడ్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో కాంగ్రెస్ పార్టీ విజయోత్సవం



**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడంతో టపాకాయలు కాల్చి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకటరెడ్డి, హరిబాబు, ఆదం షఫీ, నాయకులు అన్నంరాజు సురేష్, సతీష్‌గౌడ్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నవాబుపేట్ లో కాంగ్రెస్ సంబరాలు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ దాదాపు 25 వేల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించిన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో భారీ ఆనందం అలుముకుంది. నవాబుపేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి టపాసులు కాల్చి, ప్రజలకు మిఠాయిలు పంచుతూ విజయ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లి వెంకటయ్య, సామ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు రేవంతన్న మంచి పాలనకు నిదర్శనం. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లింది. బిజెపిని కూడా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. ప్రజలు నమ్మింది ఒక్క కాంగ్రెస్ పార్టీనే. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరింత బలపడుతుంది. ఇంకో పది సంవత్సరాలు కూడా రేవంతన్న నాయకత్వంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని నమ్మకం ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ తలారి శేఖర్, శ్రీధర్ నర్సింహా రెడ్డి, నవాబుపేట్ మాజీ సర్పంచ్, ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

**ఘట్‌కేసర్‌లో:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బర్ల రాధా



కృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షులు నాగరాజు ముదిరాజ్, రఫియుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్క సుధాకర్ రెడ్డి, బ్యాంక్ మాజీ డైరెక్టర్ బోక్క ప్రభాకర్ రెడ్డి, ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి మేకల సునీల్ కుమార్, మాజీ వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




## అలియాబాద్ మున్సిపాలిటీలో అంబరాన్నంటిన సంబరాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రధాన చౌరస్తాలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. జూబ్లిహిల్స్ ఫలితాలు కాంగ్రెస్‌కు అనూకులంగా రావడంతో కాంగ్రెస్ నాయకుల్లో మరింత జోష్ పెరిగింది. అనంతరం మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ మాట్లాడుతూ జూబ్లిహిల్స్ ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌కు ఓటు వేశారని చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతారని అన్నారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టి ఒకరికోకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, యూత్ అధ్యక్షుడు శ్రీకర్‌రెడ్డి, మాజి సర్పంచ్ ఎల్ల మల్లేష్, మాజి ఎంపిటిసి బొగ్గుల వెంకటేష్, సీనియర్ నాయకులు బండి రాంరెడ్డి, యాదగిరి, నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మా పాలన ప్రజల ఆశీర్వదం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** మా పాలనను ప్రజలు ఆశీర్వదించారని, ఇందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ పాలనకు నిదర్శనమని టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ గెలుపు సంబరాలు గాంధీ భవన్‌లో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులతో కలిసి డా.సత్యం శ్రీరంగం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సిఎం రేవంత్‌రెడ్డి సమర్థ పాలన, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కార్యాచరణతో కాంగ్రెస్ వరుస విజయాలు సాధిస్తుందని అన్నారు. 10ఏళ్లు ఏమి చేయలేని బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసిన ప్రజలు విశ్వసించలేదని, సెంటిమెంట్ రగిలించిన ప్రజలు విశ్వసించలేదని అన్నారు. ఇప్పటికైనా కెటిఆర్ అహంకారపూరిత వ్యాఖ్యలు తగ్గించుకోవాలని అన్నారు. మేము చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు మమ్మల్ని గెలిపించాయన్నారు. సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మా గెలుపు మంత్రాలుగా పనిచేశాయన్నారు.






## బిజెపి సంబరాలు

**ప్రజాపక్షం/నాగారం:** బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ కూటమి బీహర్ రాష్ట్రంలో విజయం సాధించడం పట్ల నాగారం మున్సిపాలిటీ పరిధిలో బిజెపి ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. నరేంద్ర మోదీ పట్ల ప్రజలు విశ్వాసం మరింత పెరిగిందని, సమిష్టి కృషి ఫలితంగా విజయం సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి మునిగంటి సురేష్, నాగరాజు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రావెల్ ఏజెన్సీలు నిబంధనలు పాటించాలి

### సమీక్ష సమావేశంలో డిసిపి ఎస్. రష్మి పెరుమాళ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు ప్రమాదాల నివారణలో ట్రావెల్ ఏజెన్సీలు చట్టబద్ధమైన నిబంధనలు, భద్రతా నిబంధనలు పాటించాలని నార్త్‌జోన్ డిసిపి ఎస్.రష్మి పెరుమాళ్ హెచ్చరించారు. నార్త్‌జోన్ పరిధిలోని ట్రావెల్ ఏజెన్సీ యజమానులు, ప్రతినిధులతో శుక్రవారం డిసిపి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భం గా రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా భద్రతా చట్టం, భారతీయ నాగరిక సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) నిబంధనలకు అనుగుణంగా ట్రావెల్ ఏజెన్సీలు పనిచేయాలని సూచించారు. చేవేళ్ల టిప్పర్‌ఆర్టిసి బస్సు ఢీ కొన్న ఘోర సంఘటనను ఈ సందర్భంగా డిసిపి వివరించారు. ఈ సమావేశంలో ట్రావెల్ ఆపరేటర్లు తమ కార్యకలాపాలలో పారదర్శకతను కొనసాగించడం, ప్రయాణికుల ధృవీకరణ చర్యలను బలోపేతం చేయడం, ఏ ఏజెన్సీ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా చూసుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రజా భద్రతను ప్రభావితం చేసే చట్టవిరుద్ధ కార్యకలాపాలను సులభతరం చేసే ఏవైనా ఉల్లంఘనలు లేదా నిర్లక్ష్యం కఠినమైన చట్టపరమైన చర్యలకు దారితీస్తాయని వారిని హెచ్చరించారు. ప్రయాణీకుల తప్పనిసరి ధృవీకరణ, ముఖ్యంగా అవుట్‌స్టేషన్, అంతర్జాతీయ ప్రయాణీకులు, సరైన డిజిటల్, భౌతిక రికార్డులను నిర్వహించడం తప్పనిసరి అని అన్నారు. ప్రజాభద్రతా చట్టం ప్రకారం అవసరమైన విధం గా కనీస బ్యాకప్‌తో బుకింగ్ కౌంటర్లు, కార్యాలయ ప్రాంగణాలను కవర్ చేసే సిసిటివి కెమెరాల సంస్థాపన, ప్రయాణీకుల భద్రతను నిరంతరం పర్యవేక్షించడానికి బస్సు ల లోపల సిసిటివి కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైనప్పుడల్లా స్థానిక పోలీసుల తనిఖీ కోసం ప్రయాణ వివరాలు, సిబ్బంది సమాచారం, వాహన వివరణ లాగ్‌లు వంటి ఖచ్చితమైన బుకింగ్ రికార్డుల నిర్వహణ సూచించారు. ప్రమాదాలను నివారించడానికి ప్రయాణీకులకు సురక్షితమైన ప్రయాణాన్ని నిర్ధారించడానికి అగ్నిమాపక భద్రతా నిబంధనలను క్రమ తప్పకుండా వాహన నిర్వహణను ఖచ్చితంగా పాటించాలన్నారు.

ఈ సమావేశంలో నార్త్ జోన్ ఏసిపిలు, ఎస్‌హెచ్ఓలతో పాటు 50 మందికి పైగా ట్రావెల్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గంజాయికి వ్యతిరేకంగా కలిసి పనిచేద్దాం

### సబ్‌ఇన్‌స్పెక్టర్ నవీన్‌రెడ్డి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** రానున్న రోజుల్లో కూడా గంజాయికి వ్యతిరేకంగా అందరం కలిసి పనిచేయాలని జగద్గిరిగుట్ట సబ్‌ఇన్‌స్పెక్టర్ నవీన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జగద్గిరి గుట్ట బస్టాప్‌లో అఖిలపక్ష పార్టీల నాయకులు, బస్తీ కమిటీల నాయకులు విద్యార్థుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మానవహారాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా జగద్గిరిగుట్ట సబ్ ఇన్స్‌పెక్టర్ నవీన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో జగద్గిరిగుట్టలో గంజాయిని నిర్మూలించడానికి పనిచేస్తామన్నారు. గంజాయి ఆరోగ్యాన్ని పాడుచేయడమే కాకుండా సమాజంలో అశాంతిని సృష్టిస్తుందని, గంజాయికి ఎక్కువగా విద్యార్థులు, యువకులు అలవాటు పడుతున్నారని అన్నారు. దీనికి కారణం ఒత్తిడి, పనిభారం, తల్లిదండ్రులు వారిని సరిగ్గా పట్టించుకోకపోవడం లాంటి కారణాలేనని తెలిపారు. గంజాయికి అలవాటు పడకుండా ఉండాలంటే చిన్నప్పటి నుంచే క్రీడల్లో పాల్గొంటే ఒత్తిడిని తట్టుకోగలుగుతామన్నారు. గంజాయి కి వ్యతిరేకంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, రాములు ప్రజానాట్య మండల అధ్యక్షుడు ప్రవీణ్, కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్, సాయి పంతుల, జనసేన అధ్యక్షుడు సతీష్, టిఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ సాజిద్, సోషల్ వర్కర్ చికిలే మధుబాబు, హెల్పింగ్ హార్ట్స్ విజయ్, ప్రజానాట్యమండలి బాబు, సదానందం, ఖయ్యాం, సాయిలు, రవీందర్‌రెడ్డి, యువజన నాయకులు కీర్తి, వంశీ, జంబు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ పత్రాల సంచలనం

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై మళ్లీ అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయన్న వార్తలు స్థానికులను కుదిపేస్తున్నాయి. జూన్ 6, 2025 న బొడుప్పల్ లక్ష్మీ నగర్ కాలనీలో 534 గజాల స్థలంపై నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. 1985లో రెండు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ అయిన ఈ స్థలాన్ని యజమానులు వేరే ప్రాంతంలో ఉండడాన్ని అవకాశంగా తీసుకుని, సత్యపాల్ సింగ్ అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్ నంబర్ వేసి నకిలీ డాక్యుమెంట్‌ను సృష్టించి ముత్యపు మురళి అనే వ్యక్తికి విక్రయించాడు. కొన్న వ్యక్తి నిర్మాణ పనులు ప్రారంభించగా, కాలనీ వాసులు అడ్డుకుని అసలు యజమానుల డాక్యుమెంట్లు చూపించడంతో మోసం బయటపడింది. విచారణలో నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు తేలింది.ఈ ఘటనపై సబ్ రిజిస్ట్రార్ విజయ జ్యోతి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో సత్యపాల్ సింగ్,మురళి పై కేసు నమోదు చేయించారు. అయితే డాక్యుమెంట్ రైటర్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇలాంటి మరిన్ని ఆరోపణలు నాగోల్, ఉప్పల్ ప్రాంతాల్లో 400 గజాల స్థలాన్ని యజమాని బ్రతికుండగానే చనిపోయినట్లు చూపించి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. డాక్యుమెంట్ రైటర్లు, కార్యాలయ సిబ్బంది ముడుపులు తీసుకుని మౌనంగా ఉన్నారా అన్న ప్రశ్నలు ప్రజలలో వినిపిస్తున్నాయి. ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కావడానికి అనేక స్థాయిల్లో పరిశీలన జరుగుతుంది. నకిలీ పత్రాలు ఎవరికీ కనిపించలేదా, లేక అందాల్సిన ముడుపులు అందినందున మౌనంగా ఉన్నారా, అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనలు రిజిస్ట్రేషన్ వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేస్తూ, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## మధుమేహం వ్యాధిపై ప్రజలు అప్రమత్తం కావాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణి చేస్తున్నామని ఉచిత వైద్య శిబిరం ఇన్‌చార్జ్ ఎలబోయిన సాంబరాజు అన్నారు. శుక్రవారం ఐజిఎఫ్ స్వచ్ఛంద సంస్థ, బయోలాజికల్ ఈ లిమిటెడ్ డాట్ల ఫౌండేషన్ వారి సహకారంతో శామీర్‌పేట, బొమ్మరాశిపేట గ్రామాల్లో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌరె భవాణి మాట్లాడుతూ ప్రజలకు మధుమేహం వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మధుమేహ వ్యాధి గ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. షుగర్ వ్యాధిని నియంత్రించుకుంటే కలిగే లాభాలను ప్రజలకు వివరించి అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవికుమార్, దేశం రమేష్‌గౌడ్, బండి మహేశ్వరి, అశోక్, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.





## రైతులకు ఆర్థిక సేవలు అందిస్తున్న ఏకైక బ్యాంక్ సిబిఐ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులు మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు సకాలంలో సమగ్ర రుణాలను అందిస్తున్న ఏకైక బ్యాంక్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని సెంట్రల్ బ్యాంక్ రీజినల్ హెడ్ డి కె బర్నవాల్ అన్నారు. శుక్రవారం అలియాబాద్ మున్సిపాలిటీలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆద్వర్యంలో అలియాబాద్ లో వ్యవసాయ క్రెడిట్ అవుట్ స్కాచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ విచ్చేసి ప్రసంగించారు. మహిళలు సెంట్ర ల్ బ్యాంక్ వారు మంజూరు చేస్తున్న రుణాలను పెద్ద మొత్తంలో తీసుకుని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. మహిళలు చక్కగా పొదుపులు చేస్తారని గుర్తించి బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. రుణాలతో యూనిట్‌లు ఏర్పాటు చేసుకుని స్వయం జీవనోపాధి పొందాలని చెప్పారు. సెంట్రల్ బ్యాంక్ రీజినల్ హెడ్ బర్నవాల్ మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ వ్యవసాయరంగ అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలు, కోల్డ్ స్టోరేజ్, ఫుడ్ ప్రాసెసింగ్ మిల్లు, పిఎం కుసుమ్, అగ్రి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లు, అగ్రి క్లినిక్స్, గిడ్డంగులు, పౌల్ట్రీ మరియు డైరి, ఇతర వ్యవసాయ అభివృద్ధి పథకాలకు రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. లబ్దిదారులకు రూ.12 కోట్ల రుణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనెజర్ మాధురి, ఆర్థిక అక్షరాస్యత కోఆర్డినేటర్ జ్యోతి, సిసి నాగశ్రీ, విఒఎలు, బ్యాంక్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోటర్ డ్యామ్ స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆరోవార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులచే ఆట పాటలు సంగీత నృత్య ప్రదర్శనలు పౌరాణిక నాటకాలతో పాటు దేశభక్తిని నింపే ప్రదర్శనలో ఆకర్షించాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ట్‌ట్రైనర్ గీతా భాస్కర్,చీఫ్ ఎగ్జిక్యూట్ ఆఫిసర్ జోస్‌పాల్,పాఠశాల చైర్మన్ మందడి విజయ సింహా రెడ్డి,డైరెక్టర్ జి శ్వేతా రెడ్డి,ప్రధానోపాధ్యాయురాలు కె రూపారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటర్ డ్యామ్ ప్రధానోపాధ్యాయురాలు రూపారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో ఒక్కొక్క ప్రతిభ దాగి ఉంటుందని అందుకు తగినట్టుగా తాము సృజనాత్మక సామర్థ్యాలను ఎలాంటి మానసిక ఒత్తిడిని కలిగించకుం డా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించి వెలికితీసే ప్రయత్నం చేస్తామని అన్నారు. పాఠశాల డైరెక్టర్ శ్వేతా రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలోని ప్రతి పిల్లవాడిపై ప్రతేక శ్రద్ధను వహిస్తూ నైతిక విలువలను కుటుంబం పట్ల సమాజం పట్ల తమ బాధ్యతలను తెలుసుకునేలా చేయడం వ్యక్తిత్వ లోపాలను సరిచేస్తూ ఆత్మధైర్యాన్ని నింపుతూ అన్ని విషయాల్లో ముందుండే విధంగా విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నామని శ్వేతారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.






## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతల సంబురాలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన సందర్భంగా బాచుపల్లిలో కాంగ్రెస్ నేతలు సంబురాలను నిర్వహించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఎన్‌ఎంసి అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలను హన్మంత రెడ్డి పాల్గొని బాణా సంచాను పేల్చి, మిఠాయిలను తినిపించారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమమే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో రాబోవు భవిష్యతులో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయాన్ని సాధిస్తుందని ధీమాను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి, ఎన్‌ఎంసి ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కొలను బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు హరియా నాయక్, రాంచంద్ర నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుమతుల్లేని భవనాల కూల్చివేత షురూ

### బహుళ అంతస్థుల భవన నిర్మాణదారుల్లో పరుగెడుతున్న రైళ్లు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అనుమతులు లేని బహుళ అంతస్థుల భవనాల కూల్చివేసే కార్యక్రమాన్ని అధికారు లు శుక్రవారం ప్రారంభించారు. నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పాటై న నాటినుండి నేటి వరకు అనుమతుల్లేకుండా బహుళ అంతస్థుల భవనాలను కూల్చివేసిన దాఖలాలు లేవు. ఎవరైనా అనుమతులు లేకుండా నిర్మించే వాటిపై ఫిర్యాదులు వస్తే తప్ప కనీస నోటీసులు జారీ చేయలేని దుస్థితిలో కార్పొరేషన్ అధికారులు ఉండేవారని పలువురు వాపోతున్నారు. అయితే తాజాగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్, వెంకట్రాయ నగర్‌లో జీ ప్లస్ త్రీ వరకు అనుమతులు పొంది ఏకంగా ఐదంతస్థుల భవనా న్ని నిర్మిస్తున్నారు. ఈ మేరకు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం భవనం వద్దకు చేరుకుని నాలుగు, ఐదు అంతస్థుల స్లాబ్‌లని కూల్చివేశారు. దీంతో అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల భవనాలు నిర్మించే నిర్మాణ దారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

కేవలం నిజాంపేట్‌లో మాత్ర మే అనుమతులకు మించి బహుళ అంతస్థుల భవనాలు నిర్మాణా లు జరగడం లేవని, కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, ప్రగతినగర్ లోని పలు కాలనీలు, బస్తీల్లో అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల భవనాలు కోకొల్లలు. ముఖ్యంగా బాచుపల్లి లోని రాజీవ్ గాంధీ నగర్, సాయినగర్, ఇందిరానగర్, ఇంద్రన్న బస్తీ, 191 బస్తీ తదితర బస్తీలలో కనీసం జీ ప్లస్ టూ అంతస్థులకు అనుమతులు ఉండవు. ప్రభుత్వ స్థలాల్లో వెలసిన ఈ బస్తీల్లో ప్లాట్ల క్రయ విక్రయాలు కేవలం నోటరీ పత్రాలపై మాత్రమే ఉంటాయి. ఇటీవల ప్రభుత్వం జీవో నంబరు 59 కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లకు మాత్రమే కొన్నింటికి జీ ప్లస్ టూకి అనుమతులు ఉంటాయి. మిగిలిన వాటన్నింటికి అనుమతులు ఉండవు. ఇదిలా ఉండగా అరవై, ఎనభై, వంద గజాల్లో నిర్మిస్తున్న భవనాలు ఏకంగా ఐదు, ఆరు, ఏడు అంతస్థుల బహుళ భవనాలు నిర్మించడం విశేషం. కనీస సెట్ బ్యాక్‌లు, నియమ నిబంధనలను పాటించకుండా నిర్మించే బహుళ నిర్మాణాల పై ప్రత్యేక నిఘా పెట్టాలని పలు కాలనీల వాసులు కోరుతున్నారు. శుక్రవారం నిజాంపేట్ వెంకట్రాయ నగర్‌లో ఏ విధంగా అనుమతులకు మించి నిర్మించిన బహుళ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారో మిగిలిన బస్తీల్లో సైతం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బహుళ అంతస్థుల భవనాల పై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు జాగ్రతలు తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడవలసిన బాధ్యత మన అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు, రవాణా, జాతీయ రహదారులు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. వికారాబాద్ జిల్లాలో ప్రమాద స్థలాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా రోడ్లకు ఇరువైపుల పొదలు తొలగించడం, స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా అవసరమున్న ప్రాంతా ల్లో బ్లిక్కర్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. మోతాదుకు మించి సామాగ్రిని తీసుకువెళ్లే వాహనాలపై దృష్టి పెట్టాలని, నిబంధనలుఅతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆటోలలో కూడా డ్రైవర్ ఇరు ప్రక్కల కుర్చుని ప్రయాణం చేస్తున్నారని అటువంటి వారికి అవగాహన కల్పించి ఇలాంటి ప్రయాణాలు జరుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా అక్రమ రవాణా జరిపితే వాహనాలను సీజ్ చేయాలని తెలిపారు. పెట్రోల్ బంకుల్లో కనీస మౌలిక వసతులైన టాయిలెట్లు, త్రాగునీరు , గాలి మిషన్లు తప్పనిసరిగా ఉండేలా యాజమన్యాలకు నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారు లకు సూచించారు. జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి మాట్లాడు తూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.డ్రంక్‌అండ్ డ్రైవ్,హైల్మెట్ ధరించని వారికి అవగాహన కల్పిస్తునే ట్రాపిక్ నిబంధనలను ఉల్లఘించే వారిపై చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ట్రైనింగ్ కలెక్టర్ హర్స్ చౌదరి, అదనపు ఎస్‌పి రాములునాయక్, జిల్లా రవాణాశాఖ అధికారి వెంకట్‌రెడ్డి, ఉమేష్, శ్రీధార్ రెడ్డి జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## చెన్నై, మధురైలో హాకీ ప్రపంచకప్..

### భారత కెప్టెన్‌గా రోహిత్!



భారత గడ్డపై హాకీ వరల్డ్ కప్ సందడికి వేళవుతోంది. ఎఫ్ఐహెచ్ జూనియర్ పురుషుల వరల్డ్ కప్ తేదీ దగ్గర పడుతుండడంతో హాకీ ఇండియా 18 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. స్వదేశంలో విజేతగా నిలవాలనే లక్ష్యంతో అనుభవజ్ఞులు, ప్రతిభావంతులకు ప్రాధాన్యమిచ్చారు. డిఫెండర్, డ్రాగ్‌ఫ్లికర్ అయిన రోహిత్‌ను కెప్టెన్‌గా ఎంపికచేశారు. భారత బృందానికి ఒలింపిక్ విజేత పీఆర్ శ్రీజేశ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. జూనియర్ హాకీ వరల్డ్ కప్ కోసం ఇద్దరు గోల్ కీపర్లు, ఆరుగురు డిఫెండర్లు, ఆరుగురు మిడ్‌ఫీల్డర్లు, నలుగురు ఫార్వర్డ్ ఆటగాళ్లు, బ్యాకప్‌గా.. ఇద్దరిని ఎంపిక చేశారు. తమిళనాడు వేదికగా జూనియర్ హాకీ వరల్డ్ కప్ జరుగనుంది. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకూ చెన్నై, మధురై కేంద్రంగా మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. పూల్ బీలో ఉన్న భారత్ లీగ్ దశలో చిలీ, స్విట్జర్లాండ్ ఒమన్ జట్లతో తలపడనుంది. మామూలుగా అయితే పూల్ బీలోనే పాకిస్థాన్ కూడా ఉండాలి. కానీ, భారత్, పాక్ మధ్య ఇటీవల కాలంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని.. ఒమన్‌ను ఎంపిక చేశారు.

**భారత గోల్ కీపర్లు :** విక్రమ్‌జిత్ సింగ్, ప్రిన్స్‌దీప్ సింగ్.

**డిఫెండర్లు :** రోహిత్, తలేం ప్రియబత్రా, అన్మోల్ ఎక్కా, అమిర్ అలీ, సునీల్ పలక్షప్ప బెన్నూర్, శారదానంద్ తివారీ.

**మిడ్ ఫీల్డర్లు :** అంకిత్ పటేల్, తౌనవోజామ్ లువాంగ్, అద్రోహిత్ ఎక్కా, రోషన్ కుజుర్, మన్మీత్ సింగ్, గుర్జోత్ సింగ్.

**ఫార్వర్డ్స్ :** అర్ష్‌దీప్ సింగ్, సౌరభ్ ఆనంద్ శుష్వహ, అజీత్ యాదవ్, దిల్‌రాజ్ సింగ్.

**బ్యాకప్ :** రవ్నీత్ సింగ్, రోహిత్ కులు.

## రెండో గేమ్‌పై ఉత్కంఠ..



ఫిడే చెస్ వరల్డ్ కప్‌లో అదరగొడుతున్న భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఎరిగేసి, పెంద్యాల హరికృష్ణ డ్రాతో సరిపెట్టుకున్నారు. గోవా వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో ప్రీక్వార్టర్స్ చేరిన ఈ ఇద్దరూ ఐదో రౌండ్ తొలి గేమ్‌ను డ్రాతో ముగించారు. ప్రత్యర్థులు సమర్థంగా నిలువరించిన అర్జున్, హరికృష్ణ మ్యాచ్‌ను నేటికి తీసుకెళ్లారు. దాంతో.. నేడు జరుగబోయే రెండో రౌండ్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనున్నారు ఇద్దరు. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న అర్జున్ ఎరిగేసి చెస్ వరల్డ్ కప్‌లో గొప్పగా ఆడుతున్నాడు. అద్భుత విజయాలతో ప్రీక్వార్టర్స్ చేరిన తెలంగాణ కుర్రాడు ఐదో రౌండ్‌లో రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్ లెవొన్ అరోనియన్‌తో తలపడ్డాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ తెలివైన వ్యూహాలతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. అతడి ఎత్తులకు బదులిచ్చేందుకు 21వ మూవ్‌లో పావును కదిల్చేందుకు లెవోన్ ఏకంగా అరగంట ఆలోచించాడంటే మనోడి సత్తా అర్థమవుతుంది. మరో మ్యాచ్‌లో హరికృష్ణ పెద్దగా కష్టపడకుండానే డ్రా చేసుకున్నాడు. ప్రత్యర్థి అయిన జోస్ మార్టినేజ్ ఎత్తులను ముందే పసిగట్టిన అతడు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. దాంతో.. ఇరువురు 41వ ఎత్తులో డ్రాకు అంగీకరించారు. చెస్ ప్రపంచకప్‌లో తదుపరి అడుగు వేసేందుకు అర్జున్, హరికృష్ణకు రెండో గేమ్ కీలకం కానుంది.

## ఐపిఎల్ స్టార్లకు రి'టెన్షన్'..

### పది ఫ్రాంచైజీల జాబితా రెడీ



ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్ రిటెన్షన్‌కు ఒక్క రోజే ఉంది. నేడు మధ్యాహ్నం 3 గంటల్లోపు అన్ని ఫ్రాంచైజీలు తాము వదులుకుంటున్న ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే అన్ని జట్ల యజమానులు దాదాపుగా లిస్ట్‌ను సిద్ధం చేశారు. ఊహించినట్టుగానే పేలవ ప్రదర్శన చేసిన పలువురు స్టార్ ఆటగాళ్లపై వేటు పడే అవకాశముంది. ఇంకేముంది కొందరిలో రి'టెన్షన్' మొదలైంది. క్రిక్‌బజ్ రాబట్టిన సమాచారం ప్రకారం వీరిలో మ్యాక్స్‌వెల్, వెంకటేశ్ అయ్యర్, రవి బిష్ణోయ్, పేసర్ ఆకాశ్ దీప్‌లు ఉండడం ఖాయమని తెలుస్తోంది. మెగా వేలంలో కోట్లు కొల్లగొట్టిన మరికొందరు కూడా వీళ్లతో పాటు వేలంలోకి రాబోతున్నారు. టీ20 ఫార్మాట్‌ను కొత్తపుంతలు తొక్కించిన ఐపిఎల్.. వందలాది క్రికెటర్లను కోటీశ్వరులను చేసింది. అనుభవమే ఆస్తిగా సీనియర్లను, దమ్మున్న కుర్రాళ్లను, మ్యాచ్ విన్నర్లను భారీ ధర పలికేలా చేసింది. ఆట అదిరితే అందలం.. లేదంటే పాతాళం అన్న సూత్రాన్ని పాటించే ఫ్రాంచైజీలు.. ఈసారి అదే పనిలో ఉన్నాయి. పద్దెనిమిదో సీజన్‌లో చెత్తగా ఆడిన వాళ్లను.. వికెట్లు తీయలేని వాళ్లకు షాక్‌లు ఇచ్చేందుకు పది జట్లు సిద్ధమయ్యాయి. వీరిలో మొదటి పేరు వెంకటేశ్ అయ్యర్. ఈ లెఫ్ట్ హ్యాండర్‌ను రూ.23.75 కోట్లకు అట్టిపెట్టుకున్న కోల్‌కతా తీవ్రంగా భంగపడింది. విధ్వంసక ఆటకు కేరాఫ్ అయిన అయ్యర్ 11 మ్యాచుల్లో 142 పరుగులతో ఉసూరుమనిపించాడు. అలానే ఓపెనర్ క్వింటన్ డికాక్ (రూ.3.6కోట్లు) పేసర్ అన్రిచ్ నోర్జ్(రూ.6.5కోట్లు)లను కూడా వదిలేయనుంది కోల్‌కతా. అయితే.. కెప్టెన్ అజింక్యా రహానే(రూ.1.5కోట్లు)ను అట్టిపెట్టుకోనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం కూడా రిటెన్షన్‌పై గట్టిగానే కసరత్తు చేస్తోంది. వికెట్ కీపర్, బ్యాటర్ అయిన హెన్రిచ్ క్లాసెన్‌ను రూ.23 కోట్లకు రీటైన్ చేసుకోనుంది ఆరెంజ్ ఆర్మీ. కానీ, ఎవరిపై వేటు పడనుందనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఇప్పటికే పేసర్ షమీని లక్నో సూపర్ జెయింట్స్‌కు ఇచ్చేసేందుకు అంగీకరించింది హైదరాబాద్. పద్దెనిమిదో సీజన్లో 6 వికెట్లకే పరిమితమైన షమీని రూ.10 కోట్లకు లక్నో కొనడంపై చర్చలు జరుగుతున్నాయి.

**వేలానికి ముందే..**

ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ వేలానికి ముందే ఇద్దరు స్టార్లను పట్టేసింది. ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌ను లక్నో నుంచి రూ.2 కోట్లకు కొన్న ముంబై.. గుజరాత్ నుంచి రూ.2.6కోట్లకు షెర్ఫానే రూథర్‌ఫోర్డ్‌ను దక్కించుకుంది. ముంబై రిటెన్షన్ ఆటగాళ్ల లిస్ట్ అయితే తెలియడం లేదు. కానీ, విల్ జాక్స్‌ను రిలీజ్ చేయనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ అత్యధికంగా ఆరుగురిని వేలానికి పంపించనుంది. వీరిలో.. న్యూజిలాండ్ ద్వయం రచిన్ రవీంద్ర, డెవాన్ కాన్వేలతో పాటు విజయ్ శంకర్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠిలు ఉండడం ఖాయమనిపిస్తోంది. ఇంతకూ పది ఫ్రాంచైజీలు వదిలేసేందుకు రెఢీ అయిన ఆటగాళ్లు ఎవరంటే..?

**కోల్‌కతా నైట్ రైడర్స్** – వెంకటేశ్ అయ్యర్, క్వింటన్ డికాక్, అన్రిజ్ నోర్జే.

**లక్నో సూపర్ జెయింట్స్** – రవి బిష్ణోయ్, డేవిడ్ మిల్లర్, ఆకాశ్ దీప్, షమర్ జోసెఫ్.

**ఢిల్లీ క్యాపిటల్స్** – నటరాజన్, జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు** – మయాంక్ అగర్వాల్, లివింగ్‌స్టోన్, బ్లెస్సింగ్ ముజరబని, రసిక్ దార్.

**పంజాబ్ కింగ్స్** – గ్లెన్ మ్యాక్స్‌వెల్, అరోన్ హార్డీ.


**ముంబై ఇండియన్స్** – విల్ జాక్స్.

**రాజస్థాన్ రాయల్స్** – లానే డ్రి ప్రిటోరియస్, థీక్షణ, ఫజల్‌హక్ ఫారూఖీ, క్వెనా మఫాకా.

**చెన్నై సూపర్ కింగ్స్** – డెవాన్ కాన్వే, రాహుల్ త్రిపాఠి, రచిన్ రవీంద్ర, దీపక్ హుడా, విజయ్ శంకర్, జేమీ ఓవర్టన్,

# ఫోకస్ సైన్స్

## ల్యాబ్‌లో న్యూరాన్ సృష్టి!



అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మాసెచూసెట్స్ శాస్త్రవేత్తలు ప్రయోగశాలలో ఓ అద్భుతాన్ని ఆవిష్కరించారు. క్రియాశీల న్యూరాన్‌ను సృష్టించారు. ఇది మానవ మెదడు కణం లాగా ప్రవర్తిస్తుంది. జీవన న్యూరాన్‌లతో కూడా కమ్యూనికేట్ చేస్తుంది. 'జియోబాక్టర్ సల్ఫరెడ్యూసెన్స్' అనే సూక్ష్మ జీవి నుంచి తీసిన ప్రొటీన్ నానోవైర్లను ఈ న్యూరాన్ నిర్మాణానికి శాస్త్రవేత్తలు ఉపయోగించారు. ఈ నానోవైర్లు విద్యుత్ ప్రసారం చేయడంలో సహాయపడతాయి. ఇవి మానవ న్యూరాన్‌ల మాదిరిగానే 0.1 వోల్ట్ సామర్థ్యంతో పనిచేస్తాయి. నిజానికి ఇదే మెదడు లోని అసలైన సిగ్నల్ ఉద్దీపన శక్తి. ఇవి జీవన న్యూరాన్‌లతో సురక్షితంగా కమ్యూనికేట్ చేస్తాయి కాబట్టి, వాటితో కృత్రిమ భాగాలను మరింత సమగ్రంగా, సమర్థవంతంగా కలవచ్చు. ఈ కృత్రిమ న్యూరాన్లను ఉపయోగించి నరాల పని తీరును మెరుగుపరచవచ్చు. స్పర్శను పునరుద్ధరించవచ్చు. తక్కువ శక్తితో, న్యూరాన్ తరహా అభ్యాసం, సమాచార లక్షణాలను పెంపొందించే అవకాశం ఉంటుంది. నివర్స్, హార్ట్ సెల్స్ లాంటి జీవకణాల సహజ స్పందన శైలికి ఈ న్యూరాన్‌లు చాలా దగ్గరగా ఉంటాయి. ప్రకృతిలో సుస్థిర నానోవైర్ల ఆవిర్భావం, మనిషి దేహానికి సరైన చేయూత ఈ ల్యాబ్‌లో తయారైన న్యూరాన్లు ఇవ్వగలుగుతాయి. క్లినికల్ ట్రయల్స్ జరిగి, ఈ కృత్రిమ న్యూరాన్లు అందుబాటులోకి వస్తే, ఎన్నో రకాల రుగ్మతలకు చికిత్స సాధ్యమవుతుంది.

## మార్స్.. ఒకప్పటి వాయుగోళం!



మార్స్ (కుజుడు లేదా అంగారకుడు) గ్రహం ఒకప్పుడు భూమి కంటే దట్టమైన వాతావరణంతో, పెద్ద వాయుగోళంగా ఉండేదని శాస్త్రవేత్తలు నిర్ధారిస్తున్నారు. ఈ తాజా పరిశోధనా వ్యాసం, ప్రస్తుతం కుజ గ్రహంపై అందుబాటులో ఉన్న లేదా శాస్త్రవేత్తలు ఊహించుకున్న వివరాలకు పూర్తి భిన్నంగా ఉంది. మార్స్‌పై నాలుగు వందల కోట్ల సంవత్సరాల నాటి, ఖగోళ శిలలు, ఉపగ్రహాల స్కాన్లు, భూగర్భ ఖనిజ వివరాలు విశ్లేషించారు. అప్పట్లో ఈ గ్రహం ఒక దట్టమైన వాతావరణంతో కూడిన వాయుమండలంగా ఉండేదని, ఆక్సిజన్ అధిక పీడనంతో ఉండేదని గుర్తించారు. దీనిని బట్టి, మార్స్‌పై మేఘాలు, నదులు, సరస్సులతో కూడిన చక్కటి వాతావరణం ఉండేదని అనుకోవచ్చు. అప్పట్లో మార్స్‌పై ఉన్న వాతావరణ ఒత్తిడి, తీక్షణతలు ప్రస్తుతం భూమి కంటే ఎక్కువగా ఉండవచ్చు. ప్రాథమిక ఆధారాలను అనుసరించి, అప్పట్లో, మార్స్‌పై నదులు, సరస్సులు, చిన్న సముద్రాలు ఉండే అవకాశం ఉందని ఇప్పటికీ కనిపిస్తున్న శిలలు, ఎండిపోయిన నదులను పోలిన ఆధారాలను బట్టి శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అయితే, మార్స్‌పై వాతావరణం ఎలా అంతమైందనే ప్రశ్న తలెత్తుతుంది. శాస్త్రవేత్తల అంచనాలను అనుసరించి, ఈ గ్రహం గురుత్వాకర్షక కేంద్రాన్ని కోల్పోయిన తర్వాత, సూర్యుడి నుంచి అత్యంత ప్రమాదకర రేడియేషన్ కారణంగా తీవ్రంగా ప్రభావితమైంది. వాతావరణం లుప్తమైంది. ప్రస్తుతం ఈ గ్రహంపై అత్యంత పలుచటి వాతావరణ పొర ఉంది. ఇందులో అధిక శాతం కార్బన్ డైయాక్సైడ్ ఉన్నట్టు శాస్త్రవేత్తల అంచనా. ఏదిఏమైనా అప్పట్లో మార్స్‌పై జీవం ఏర్పడేందుకు భూమికంటే మెరుగైన పరిస్థితులు ఉండేవని ఊహిస్తున్నారు. కాగా, కొత్త పరిశోధన ఇచ్చిన ఊతంతో, మార్స్‌పై జరిగే తుదపరి ప్రయోగాలు అక్కడ జీవం ఉండేదని నిరూపించే కొత్త ఆధారాల సేకరణపై దృష్టి సారించే అవకాశాలు పెరిగాయి.


## వ్యవసాయ రంగంలో విస్తారంగా ఎఐ టూల్స్



భారత దేశంలో గూగుల్ ప్రయోగాత్మకంగా తయారు చేసిన కృత్రిమ మేధస్సు (ఎఐ) వ్యవసాయ పరికరాలు ఇప్పుడు విస్తారంగా విదేశాలకు చేరుతున్నాయి. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం, అగ్రికల్చరల్ ల్యాండ్‌స్కేప్ అండర్‌స్టాండింగ్ (ఎఎల్‌యు), అగ్రికల్చరల్ మానిటరింగ్ అండ్ ఈవెంట్ డిటెక్షన్ (ఎఎంఇడి) అనే రెండు ఎఐ టూల్స్‌ను ఇప్పుడు మలేషియా, వియత్నాం, ఇండోనేషియా, జపాన్ దేశాల్లో కూడా పరీక్షిస్తున్నారు. ఈ టూల్స్ మొదట భారత్‌లోనే అభివృద్ధి చేశారు. ఇప్పుడు అవి ఇతర దేశాలకు విస్తరించడం గూగుల్ వ్యవసాయ రంగాన్ని మరింత టెక్నాలజీ ఆధారంగా, స్థిరంగా మార్చాలనే ప్రయత్నంలో భాగం. భారత్‌లో ఈ మోడళ్లను ఉపయోగించిన తర్వాత కంపెనీ గమనించింది టెక్నాలజీ ద్వారా రైతులు వేగంగా, ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోగలుగుతున్నారు. భారత్‌లో సవాళ్లకు పరిష్కారం కనుక్కోగలిగితే, ప్రపంచంలోని అనేక దేశాలకు కూడా అది ఉపయోగపడుతుదని గూగుల్ భావిస్తున్నది. ఆసియాపసిఫిక్ ప్రాంతంలోని దేశాలకు భారత వాతావరణం, వ్యవసాయ పరిస్థితులు దాదాపు సమానంగా ఉండటంతో, ఈ టూల్స్ అక్కడ కూడా బాగా పని చేస్తాయని గూగుల్ నమ్ముతోంది. ఈ రెండు సాంకేతికతలు పంటల పెరుగుదల దశలను, వర్షం లేదా వరద సూచనలను, వాతావరణ వివరాలను అందిస్తుంది. పంట వేయడం నుంచి కాపు కోతల వరకూ ప్రతి దశలోనూ రైతులకు అవసరమైన సూచనలు అందిస్తుంది. ఈ డేటా ప్రతి 15 రోజులకు ఒకసారి అప్డేట్ అవుతుంది. అంటే, రైతులు, అధికారులు వ్యవసాయ పరిస్థితులపై సత్వర సమాచారాన్ని పొందగలరు. ఈ విధంగా వారు పంటల ఆరోగ్యం, నీటి వినియోగం, వాతావరణ పరిస్థితులను బట్టి సరైన నిర్ణయాలు తీసుకోవచ్చు. అందుకే ఈ వ్యవస్థ భారత్‌లో విజయంతమైంది. గూగుల్ దీనిని విదేశాలకు విస్తరిస్తున్నది.

## బిఎస్‌సి నర్సింగ్‌లో విద్యార్థులకు సెకండ్ ఫేస్ అవకాశం కల్పించాలి

### కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విసికి ఎఐఎస్‌ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/వరంగల్ :** బిఎస్‌సి నర్సింగ్‌లో విద్యార్థులకు సెకండ్ ఫేస్ అవకాశం కల్పించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, అధ్యక్షుడు పార్థు కోరారు. శుక్రవారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విసి డాక్టర్ నందకుమార్‌రెడ్డిని కలిసి బిఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు సెకండ్ ఫేస్ ఆప్షన్ కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులు పెద్ద ఎత్తున దరఖాస్తు కౌన్సెలింగ్ అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, అందుకు వారికోసం తక్షణమే రెండో ఫేస్ ఆప్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు, కార్యకర్తలు శ్రేయాస్, భరత్, ప్రశాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కుర్తికి సైనిక్ పాఠశాల తరలించాలి

### కబ్జాకు గురైన భూమిని రికవరీ చేయాలి

### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ డిమాండ్



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** ఎల్కుర్తికి సైనిక పాఠశాల తరలించాలని, కబ్జాకు గురైన జూనియర్ కళాశాల భూమిని రికవరీ చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శుక్రవారం ఎఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి సిపతి వినయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంతోష్ మాట్లాడారు. ఎల్కుర్తి గ్రామంలో సైనిక్ పాఠశాల నిర్మాణం కోసం భూమిని కేటాయించడమే కాక అనుమతి కూడా వచ్చినా, గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆ పాఠశాలను హైదరాబాద్ కంటోన్మెంట్ ప్రాంతానికి తరలించిందని ఆయన మండి పడ్డారు. ఈ అన్యాయాన్ని సరిదిద్దేందుకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చర్యలు తీసుకుని పాఠశాలను తిరిగి ఎల్కుర్తికి తీసుకురావాలని కోరారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు పెద్ద పట్టణాలకు వెళ్లి చదువుకోవడం కష్టమైపోతున్న నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అత్యవసరమన్నారు. ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మొత్తం ఐదున్నర ఎకరాల భూమి ఉండగా, అందులో ఎకరన్నార భూమి కబ్జాకు గురైందని, వెంటనే ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రహరి నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బొడ్డు హేమంత్, ఉపాధ్యక్షులు సాహిల్, రితీష్, సహాయక కార్యదర్శి సాయి ఈశ్వర్ సాత్విక్, నాయకులు విశాల్, తరుణ్, రిత్విక్, విగ్నేష్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచేలా ప్రదర్శన, సభ



### 10 లక్షల మందికి శతాబ్ది ఉత్సవ సందేశం

### జనసేవాదళ్ శిక్షణ కార్యక్రమంలో బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా డిసెంబర్ 26న సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. వందేళ్ల పోరాట చరిత్రను, సాధించిన విజయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరానికి అనుగుణంగా భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ ఆధ్వర్యంలో లకారం ట్యాంక్‌బండ్‌పై జరుగుతున్న శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ డిసెంబర్ 26న జరిగే ప్రదర్శనలో యువ కమ్యూనిస్టులు, జన సేవాదళ్ కార్యకర్తలు కదం తొక్కనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా 10వేల మందికి శిక్షణ ఇస్తున్నామని హేమంతరావు తెలిపారు. ఇప్పటికే శతాబ్ది ఉత్సవ ముగింపు సభ ప్రచారం సాగుతుందని ఈనెల 21న రాష్ట్ర స్థాయి జాతా, ఖమ్మంజిల్లాలో పర్యటించనుందని హేమంతరావు తెలిపారు. సూర్యాపేట జిల్లా నుంచి 21న నేలకొండపల్లిలోకి ప్రవేశిస్తుందని నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం, కొణిజర్ల, వైరా, తల్లాడ, ఏన్కూరు మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. జనజాగృతిలో భాగంగా ఖమ్మంజిల్లాలోనూ కమ్యూనిస్టు పార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మూడు జాతాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వందేళ్లలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన విజయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరాలకు అనుగుణంగా యువతరాన్ని కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షించేందుకు 10 లక్షల మందికి మహాసభ సందేశాన్ని అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ డిసెంబర్ మొదటి వారం నుంచి ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక కళారూపాలను రూపొందిస్తున్నామని, సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించడంతో పాటు వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రపై కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంలో అమరులైన వారితో పాటు సాయుధ తెలంగాణ పోరాట కాలంలో అశువులు బాసిన అమరుల చరిత్ర ప్రతిబింభించేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బాగం తెలిపారు. శిక్షణ శిబిరానికి శిక్షకులుగా రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్ వ్యవహరించగా ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, నాయకులు మామిళ్ల శ్రీనాథ్, మద్దోజు శ్రవణ్, చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

### పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ప్రచార జాతను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవని శంకర్ అన్నారు. శుక్రవారం సిపిఐ శతాబ్ది ఉత్సవాల కరపత్రాలను స్థానిక పెద్దపెల్లి సిపిఐ కార్యాలయంలో పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందంతో కలిసి ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాదిమంది ప్రజలతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్న క్రమంలో రాష్ట్ర నలుమూలల నుండి సిపిఐ శతాబ్ది ఉత్సవాల ప్రచార జాతాలను ప్రారంభించుకోవడం జరుగుతుందనీ, అందులో భాగంగా ఆదిలాబాద్ జోడేఘాట్ నుండి శనివారం నవంబర్ 15న ప్రచార జాత ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి సిపిఐ మాజీ ఎమ్మెల్యే, జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేనా శంకర్, డిహెచ్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. 15న జోడేఘాట్ నుండి ప్రారంభమయ్యే ప్రచార జాతా 16న గోదావరిఖనిలో భారీ బైక్ ర్యాలీతో ప్రారంభమై ఖని చౌరస్తాలో బహిరంగ సభ ఏర్పాటు జరుగుతుందని, అనంతరం ప్రచార జాతా పెద్దపల్లి చేరుకొని పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాబోయే తరానికి కమ్యూనిస్టు పార్టీ చరిత్రను స్ఫూర్తిగా మార్చే బాధ్యత మనపై ఉందని వారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి సునీల్, మండల కార్యదర్శి పూసాల రమేష్, పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్ కుమార్, ఆరేపల్లి మానస్ కుమార్, మాచర్ల అంజి, ఎల్లయ్య, వంశీ, కల్లేపల్లి రవి, తగరం నరేష్, సది, అల్వాల రాజేందర్, దొమ్మటి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

### ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్‌ఖన్నా డిమాండ్ చేశారు. ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు ఆధ్వర్యంలో వరంగల్ డిఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా శుక్రవారం నిర్వహించారు . అనంతరం వరంగల్ డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్.బిసాంబశివరావుకు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, పెండింగులో ఉన్న 2నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో ఈనెల 17 హైదరాబాద్ మహాధర్నా చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 7 నెలల ఏరియర్స్ బకాయిలు వెంటనే ఇవ్వాలని, ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు 1న వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి వరంగల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యాకూబ్ పాషా, వివిధ శాఖల ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు సునీత, జన్ను కొర్నోల్, ఆచంట అభిషేక్, స్వప్న, భాగ్యలక్ష్మి, రజియా, లావణ్య, ప్రవీణ్, ఎఎన్ఎంలు శారద, విజయలక్ష్మి, ఫెనీన, జయమణి, భాగ్యలక్ష్మి, ఉప్పలమ్మ, ఫార్మసిస్టు జ్యోష్ణ, సతీష్, ప్రేమలత శ్రీనివాస్, స్వర్ణలత, ఎంఎన్‌ఓ విజయ నాయక్, సపోర్టింగ్ స్టాఫ్ జాన్సన్, గౌస్ పాషా, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.





**ఆసిఫాబాద్ టౌన్ :** నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సెప్టెంబర్, అక్టోబర్ నెలల వేతనాలు, ఏడాది ఏరియర్స్‌ను తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసిఫాబాద్ కలెక్టరేట్ నందు ఎఒ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతినెల 1న వేతనాలు చెల్లించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ, వేతనాల్లో జాప్యంతో నిరాశలో ఉన్నారన్నారు. కార్మికుల వేతనాల సమస్యను పరిష్కరించకపోతే ఈనెల 17 హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షులు చిరంజీవి, కోశాధికారి నగేష్, సహాయ కార్యదర్శి రాందాస్, సిబ్బంది దేవి, ప్రకాష్, శ్రీకాంత్, విజయసాగర్, భవాని, సమత తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## మధుమేహంపై అవగాహన అవసరం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మధుమేహంపై ప్రజలకు అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని డాక్టర్ ఆశ్రిత అన్నారు. శుక్రవారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గిరినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులు రాకుండా 30 సంవత్సరాల వయస్సు నాటి నుండి ప్రతి రోజు వ్యాయామం, నడక, సమతుల ఆహారం, ఆరోగ్య నియమాలను పాటించడం అత్యంత కీలకమన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత్, డిప్యూటి డిఇఎంఓ వి సంజీవరెడ్డి, శ్రీనివాసరాజు, వినోద్, సాంబశివరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రీజనల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం



**ప్రజాపక్షం/యాదాద్రి :** రీజనల్ రింగ్ రోడ్ కింద నష్ట పోయిన అర్హులకు నష్ట పరిహారం కింద ప్రభుత్వం నిధులు విడుదల చేయడం జరిగిందని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ కింద భూమి నష్ట పోయిన వారికి నష్ట పరిహారం క్రింద తెలిపిన విధంగా డబ్బులు విడుదల చేయడం జరిగిందన్నారు. యాదగిరిగుట్ట మండలం దత్తరపల్లి గ్రామానికి చెందిన 12 మందికి రూ.69,55,534.60, తుర్కపల్లి మండలం దత్తయ్యపల్లి గ్రామానికి చెందిన 15 మందికి రూ.30,86,170.28, తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన 5 మందికి రూ.13,66,092.00, తుర్కపల్లి మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన 6 మందికి రూ.32,20,179.31, తుర్కపల్లి మండలం వేల్పుపల్లి గ్రామానికి చెందిన 11 మందికి రూ.57,69,780.60, జిల్లాలో మొత్తం 49 మందికి రూ.2,03,97,756 నష్టపోయిన వారికి ప్రభుత్వం నిధులు విడుదల చేశారన్నారు.

## షేక్ సైదా మృతి బాధాకరం



ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కోదాడ:** ఎఐటియుసి కార్మికుడు షేక్ సైదా మృతి చాల బాధకరమని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాత్రి మునగాల మండల పరిధిలోని ఆకుపాముల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ సైదా మృతి ఎఐటియుసికి తీరనిలోటు అని అన్నారు. శుక్రవారం షేక్ సైదా మృత దేహనికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహనికి పూలమాలలువేసి నివాళులర్పించారు. షేక్ సైదా కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతూ యూనియన్ అభివృద్ధిలో పాటుపడిన షేక్ సైదా మృతి ఎఐటియుసికి, డ్రైవర్ల యూనియన్ సంఘానికి తీరని లోటు అని అన్నారు. షేక్ సైదా కుటుంబానికి ఎఐటియుసి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మిల్లు డ్రైవర్ల యూనియన్ నాయకులు ఎస్‌కె సైదా, యూనియన్ నాయకులు నాగరాజు, నాగేశ్వరరావు, ఎస్‌కె మీరా, బాలు మియా, శ్రీను, నాగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యాదగిరి సేవలు వెలకట్టలేనివి



గోద శ్రీరాములు

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామంలో శుక్రవారం అనంతులు యాదగిరి సంస్మరణ సభ కార్యక్రమంలో యాదగిరి స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ గ్రామ కార్యదర్శి యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన యానాల దామోదర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు మాట్లాడుతూ అనంతుల యాదగిరి సేవలు వెలకట్టలేనివని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం, పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేశారని అన్నారు. గ్రామాలలో పార్టీ అభివృద్ధి కోసం ప్రజలను చైతన్య పరుస్తూ పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర, మండల కార్యదర్శి రామచంద్రయ్య, మోత్కుర్ మండల కార్యదర్శి వెంకట్, మండల కార్యవర్గ సభ్యులు కొమురయ్య, సత్యనారాయణ, వెంకన్న, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

రూ.63,160 నగదు స్వాదీనం

ఎసిబి డిఎస్‌పి జగదీశ్‌చంద్ర వెల్లడి

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా దాడులు చేశారు. ఏకకాలంలో హైద్రాబాద్‌లోని రిజిస్ట్రార్ బలరాంయాదవ్ ఇంట్లో కూడా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చంద్ర మాట్లాడుతూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అనేక ఫిర్యాదులు అందాయని ఆ మేరకు అకస్మాత్తుగా దాడులు నిర్వహించామని తెలిపారు. దాడుల సమయంలో రికార్డులు, దస్తావేజులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తనిఖీల సమయంలో కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఆరుగురు సిబ్బంది ఉన్నారని, వీరితోపాటు ఆరుగురు డాక్యుమెంట్ రైటర్లు మరో ఆరుగురు వారి అసిస్టెంట్లు ఉన్నారని చెప్పారు. కార్యాలయంలో ఓ మహిళ అనధికారికంగా విధులు నిర్వహిస్తుందని ఆమెకు ప్రతిరోజు రూ.500 చొప్పున అనధికారికంగా చెల్లిస్తున్నట్లు విచారణలో తేలినట్లు తెలిపారు. కార్యాలయంలో అనధికారికంగా ఆధారాలు లేని రూ.60,160 నగదును సీజ్ చేశామని తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన 19 దస్తావేజులు ఉన్నాయని, కార్యాలయంలో నాలుగు సీసీ కెమెరాలు ఉంటే కేవలం ఒకటే సీసీ కెమెరా పనిచేస్తుందని, మిగిలిన మూడు సీసీ కెమెరాలు కావాలనే డిస్‌కనెక్ట్ చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోదాలు చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐలు వెంకటేశ్వర్‌రావు, కిషన్‌లు ఉన్నారు.



# జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా కేంద్ర గ్రంథాలయం భువనగిరిలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎండి అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తి జాతీయ పతాకావిష్కరణ చేసి జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి వారోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏ.భాస్కరరావు హాజరయ్యారు. సమావేశ ప్రారంభానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి దేవి చిత్రపటానికి, గ్రంథాలయ పితామహులు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థలు అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు గ్రూప్స్‌కి సంబంధించిన పుస్తకాలు కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రంథాలయానికి రావాల్సిన సెస్ బకాయిలు చెల్లించుటకు జిల్లాలోని మున్సిపాలిటీలకు గ్రామపంచాయతీలకు తగిన ఆదేశాలు ఇస్తానని తెలిపారు. రూ.100 చెల్లించి గ్రంథాలయంలో సభ్యులుగా చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి ఎం.సుధీర్, పోలిశెట్టి అనిల్ కుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మాటూరి బాలేశ్వర రావు, జంపాల అంజయ్య, కరిపే నరసింహారావు, అక్కినేనిపల్లి నరసింహ రావు, పి.శంకర్ రెడ్డి, బట్టు రామచంద్రయ్య, సల్లావుద్దీన్, కైరం కొండ వెంకటేష్, వడిచెర్ల కృష్ణ యాదవ్, ఎండి.మజార్, చల్లగురుగుల రఘుబాబు, గుర్రాల శ్రీనివాసరావు, మంగ ప్రవీణ్, పిట్టల బాలరాజు, కొల్లూరు రాజు, నాగారం శంకర్, బర్రె నరేష్, ఎండి.ఉజయర్, సాయి పాల్గొన్నారు.

# సన్మార్గంలో విద్యార్థులు, యువత



ఎస్‌పి కె.నరసింహ

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** బాలల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా ఎస్‌పి కె.నరసింహ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నందు విద్యార్థులతో గడిపారు. భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులతో కలిసి ఆయనను స్మరించుకున్నారు. భారత దేశం కోసం ఎందరో మహానుభావులు కృషి చేశారని, భారతదేశ మొదటి ప్రధానమంత్రి నెహ్రూ బాలల విద్య, వికాసం, హక్కుల కోసం ఎంతగానో కృషి చేసి ఆయన ప్రసిద్ధి చెందారన్నారు. మహానుభావుల కలలను, ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత నేటి భావి భారత పౌరులపై ఉందన్నారు. విద్యార్థులు, యువత ఎవరు కూడా చెడు మార్గంలో వెళ్లకుండా సన్మార్గంలో నడిచి క్రమశిక్షణతో, నిరంతరం సాధన చేసి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పెద్దలను గౌరవించాలి, తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తేవాలని అన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కృషి చేస్తే మంచి విజయాలు సాధిస్తారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమందరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, గరిడేపల్లి ఎస్ఐ నరేష్, మండల విద్యాధికారి శత్రునాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేసిన బిఆర్ఎస్

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** మిర్యాలగూడ అభివృద్ధిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాగితాలకే పరిమితం చేసిందని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని శాసనసభ్యులు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రూ.70 కోట్ల వ్యయంతో పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు శుక్రవారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల పాటు అధికారంలో ఉండి పదవులు అనుభవించిన నాయకులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాన్ని అస్తవ్యస్తంగా చేపట్టి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందన్నారు. వారు చేసిన తప్పులను సరి చేసేందుకు రెండు సంవత్సరకాలం పట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. మిర్యాలగూడను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ముందున్న కర్తవ్యం అన్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, శ్మశానవాటికల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, బండి యాదగిరిరెడ్డి, లావూరి రవి నాయక్, ముదిరెడ్డి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సిపిఐ

18న దేవరకొండకు

ప్రచార జాత :పల్లా నర్సింహారెడ్డి




**ప్రజాపక్షం/దేవరకొండ:** సిపిఐ శాతాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కామ్రేడ్ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ దేవరకొండ మండల సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ భారత దేశంలో 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. ఈ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలను సమీకరించి పోరాటంలో అగ్రభాగాన నిలిచి అనేక త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ మాత్రమే అని అన్నారు. ఎంతో మహత్తర చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఐ నిర్వహించిన పోరాటాలను త్యాగాలను నేటి యువతరానికి గుర్తుచేస్తూ నవంబర్ 15 నుండి 21 వరకు రాష్ట్రంలో మూడు ప్రచార జాతలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈనెల నవంబర్ 17న గద్వాలనుంచి చేపట్టిన సిపిఐ జాతను18న దేవరకొండకు వస్తుందన్నారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, ఆంజనేయులు, వెంకట్‌రాములు, రాంరెడ్డి, యాదయ్య, వెంకటయ్య, మండల కౌన్సిల్ సభ్యులు కృష్ణయ్య, పుల్లయ్య, మాధవ రెడ్డి, మైనోద్దీన్, భూపాల్‌రెడ్డి, జ్యోతిబస్, నగేష్, మోహన్‌రెడ్డి, గోవర్ధన్, పర్వతాలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## శత జయంతి ఉత్సవాలకు పిలుపు

**ప్రజాపక్షం/ఆలేరు :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో శాఖ కార్యదర్శి పొన్నబోయిన రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. అలాగే అనేకసార్లు భూ పోరాటాలు చేసినా కూడా కొలనుపాకలో సర్వేనెంబర్ 8 ప్రభుత్వ భూమిని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం పేదలపై నిర్లక్ష్యం చూపుతుందని, ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు సిపిఐ పక్షాన పేదల కోసం పోరాటాలు చేస్తామని ప్రభుత్వం ను హెచ్చరించారు. ఈ సందర్భంగా హాజరైన సభ్యులు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చౌడబోయిన పరశురాములు, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు పోతు ప్రవీణ్, ఏఐటిసి మండల నాయకులు గిరబోయిన స్వామి, అఖిలభారత యువజన సమాఖ్య మండల నాయకులు, బర్ల ప్రశాంత్, కాటబోయిన కళ్యాణ్, గ్యార భిక్షపతి, చిరంజీవి, మహేందర్ యాదవ్, మోతే భవాని, సంపత్ యాదమ్మ, సుశీల, లక్ష్మి , ఉప్పలమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.



## దేశ రాజకీయ చరిత్రలో సిపిఐకి ప్రత్యేక స్థానం

జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగె గ్రామంలో శుక్రవారం సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గూడెం వెంకటయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్రం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100ఏళ్లు పూర్తి చేసుకొని 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి భారత గడ్డపై 100ఏళ్లు పూర్తి చేసుకొని భారతదేశం స్వాతంత్ర్యం సంపూర్ణ మద్దతు ప్రకటించింది తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని సిపిఐ శత వసంతాల ఉత్సవాలను గల్లి నుండి ఢిల్లీ వరకు జెండాలు ఎగరవేస్తూ మండల కేంద్రంలో 100 జెండాలను కట్టాలని అన్నారు. ఖమ్మంలో జరిగే సిపిఐ 100ఏళ్లు పురస్కరించుకొని నిర్వహించే ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈనెల 21న సిపిఐ బస్సు యాత్రకు స్వాగతం పలకాలని, నూతన సభ్యత్వాలను పునరుద్దరించాలని, శాఖ సమావేశాలను ఏర్పాటు చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర, మండల కార్యదర్శి రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, శ్రీను, స్వామి, కొమురయ్య, బిక్షం, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కుడకుడ జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాలల దినోత్సవం 2025 వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటి సెక్రటరీ, జడ్జి పర్వీన్ కౌసర్ హాజరై పిల్లల హక్కులు, విద్య ప్రాముఖ్యత, బాలల భవిష్యత్తు నిర్మాణంలో సమాజం బాధ్యతలపై విలువైన సూచనలు ఇచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహరావు మాట్లాడుతూ సమాజంలో పిల్లల సంరక్షణ ఇది చాలా సున్నితమైన విషయమన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తీసుకొని పిల్లల సంరక్షణకు అందరూ తమ వంతు కృషి చేయాలని చెప్పారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడాపోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్లుసి చైర్మన్ బిఆర్ రమణ, సిడిపిఓలు సుబ్బలక్ష్మి, శ్రీవాణి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్షిత, అసిస్టెంట్ కమీషనర్ లేబర్ అరుణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్న కుమార్ తెలిపారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని తిరుమల గ్రాండ్ రెస్టారెంట్ బాంకెట్ హాల్‌లో డిఎస్‌పి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా కమిటీలతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 18 రోడ్డు ప్రమాద బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రణాళిక మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ రోడ్డు సేఫ్టీ కమిటిల నందు పోలీస్, రిటైర్డ్ టీచర్స్, గ్రామస్థాయి పెద్దలు, వ్యాపార ప్రతినిధులు, మహిళా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు ఉంటారన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూర్యాపేట వైద్యులు పాల్గొని ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణా లు కాపాడడానికి సిపిఆర్ చాలా విలువైందని, సిపిఆర్ పద్ధతిపై అందరికి అవగాహన కలిగి ఉండాలని, సిపిఆర్ చేసే విధానాన్ని రోడ్డు భద్రతా కమిటిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సూర్యాపేట రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, రూరల్ ఎస్ఐ బాలు నాయక్, మద్దిరాల ఎస్ఐ వీరన్న, అర్వపల్లి ఎస్ఐ సైదులు, ఐఎంఏ సూర్యాపేట వైద్యులు, రోడ్డు భద్రత కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# విద్య విలువైన సంపద






**ప్రజాపక్షం/మిర్యాల-గూడ:** విద్య విలువైన సంపద అని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి దేశం గర్వించేలా ఎదగాలని సెయింట్ జాన్స్ స్కూల్ ఛైర్మన్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ శిరీషలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని చైతన్యనగర్‌లో గల సెయింట్ జాన్స్, శిష్య దిస్కూల్ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విద్యార్థినిలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అదే విధంగా చిన్నారులు పలు ఫ్యాన్సీ డ్రెస్‌లు వేసుకొని పలువురిని అలరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాల్గొన్న విధానం గురించి విద్యార్థులకు వివరించారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులు అని అన్నారు. మంచి సమాజం తయారుకావాలంటే పిల్లలు క్రమ శిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని వారు అన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, చక్కగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత... చార్లెస్ మాథ్యూ**

బాల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని నవజ్యోతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చార్లెస్ మాథ్యూ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్మషం లేని మనస్తత్వం, ప్రేమ కలిగిన విద్యార్థులకు ప్రేమ, ఆప్యాయతలను పంచి చేరతీసినప్పుడే ఉన్నతమైన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుందన్నారు. నైతిక విలువలు, ఉత్తమ క్రమశిక్షణ, తల్లిదండ్రులను పెద్దలను గౌరవించే తత్వాన్ని పెంపొందించి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి పునాదులు వేసే బాధ్యత గురువులదేనన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్మి, సుజాత, మసూద్ పాల్గొన్నారు.





**అభ్యాస్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం...**

అభ్యాస్ ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ వంగాల నిరంజన్‌రెడ్డి, డైరెక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో చిన్నారులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంగాల నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయ నాయకుల వేషాలతో ఆకట్టుకున్నారు. క్విజ్, వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రోత్సాహ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## పిల్లలే రేపటి పౌరులు

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిమళపురంలో బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారత ప్రథమ ప్రధాన మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ " నేటి పిల్లలే రేపటి పౌరులు" అని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటలలో కూడా ముందుండాలని సూచించారు. చదువు ద్వారా ఏదైనా సాధించడం సాధ్యమని, చదువు చాలా ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాలలో యంగ్ ఒరేటర్స్ క్లబ్ (యోసి) మిడ్ ఇయర్ షోకేస్ ను కూడా నిర్వహించారు.
ఈ ప్రదర్శనలను సందర్శించి విద్యార్థులను అభినందించారు. జిల్లా విద్యా శాఖ అధికారి గోవిందరాజులు, అలోకిట్ ఫౌండేషన్ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల పేరు.. అక్రమ ఇసుక రవాణా జోరు

**ప్రజాపక్షం/కృష్ణ :** రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అధికారులు ఇసుకకోసం అనుమతి ఇవ్వడంతో కొందరు అక్రమార్కులు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మాగనూర్ పెద్ద వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా తెచ్చిన ఇసుకను కృష్ణ మండల పరిధిలోని హిందూపూర్ రోడ్డు కి గల ఎస్ఎల్ఎన్ రైస్ మిల్ వద్ద అక్రమ ఇసుక డంపు చేయడం జరిగింది. ఆ డంపు చేసిన ఇసుకను రాత్రి వేళ్ళలో టిప్పర్ ల ద్వారా హైదరాబాద్, కర్ణాటక తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇసుక పక్కదారి పట్టడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు అక్రమార్కులకు సహకరించకుండా, అర్హులైన లబ్ధిదారుల ఇండ్లకు మాత్రమే ఇసుకను తరలించే విధంగా చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.




## చిల్డ్రన్స్ డే విద్యార్థుల అద్భుత ప్రదర్శన

**ప్రజాపక్షం/ధన్వాడ :** పాఠశాలల్లో బాలల దినోత్సవం సంబరాలు అంబరాన్నంటాయి. ధన్వాడ మండల కేంద్రంలోని భారతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ బాలల దినోత్సవం రోజును ఎప్పటికీ గుర్తుండేలా నిర్వహించిన ఆట పాటలతో ఎంతగానో ఆకట్టుకుంది. జవహర్ లాల్ నెహ్రూ కి పిల్లలు అంటే చాలా ఇష్టం, ఆయన పుట్టిన రోజుని మన దేశంలో చిల్డ్రన్స్ జరుపుకుంటామని భారతి విద్యానికేతన్ కరస్పండెంట్ విజయలక్ష్మి అన్నారు. బాలల దినోత్సవానీ ఘనంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది అని విజయలక్ష్మి చెప్పుకొచ్చారు. విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన, క్విజ్ కాంపిటీషన్, పాటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఆటపాటు నిర్వహించి బహుమతులు అందించారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో కూడా బాలల దినోత్సవనీ ఘనంగా జరుపుకున్నారు.



## సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులు

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా ఇంచార్జి ఎద్ల కుర్మయ్య ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కి జిల్లాలోని ప్రభుత్వ అధికారులు సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తూ, అడిగిన సమాచారాని కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం చేస్తున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి దాకా ఆర్టీఐ బోర్డు లు సెక్షన్ 5(2), 5(3) ప్రకారం సమాచార హక్కు చట్టం 2025 బోర్డులు నిర్వహించాలి కానీ నిర్వహించడం లేదు. అని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణపేట నియోజవకవర్గం ఇంచార్జ్ గణేష్, మద్దూరు మండల అధ్యక్షులు పి. వెంకటయ్య, మురళి, రాములు తదితరులు పాల్గొన్నారు.



## బ్రైట్ స్టార్స్ గ్రామర్ పాఠశాల ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాపక్షం/ మక్తల్ :** బాలల దినోత్సవం సందర్భంగా మక్తల్ పట్టణం లోని బ్రైట్ స్టార్స్ గ్రామర్ పాఠశాల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నం పంపిణీ చేశారు. అనంతరం పట్టణం లోని ఆంజనేయస్వామి ఆలయం దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ పట్టణం ప్రముఖులు రాములమ్మ సిస్టర్, ఆసుపత్రి సూపరిండెంట్, పాఠశాల కరెస్పాండంట్ బిలార్ ఉర్ రహ్మాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోళ్ల వెంకటేష్, షంషుద్దీన్, సాలంబిన్ ఉమర్ రహీం పటేల్, రవుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో భాగంగా చిల్డ్రన్స్ డే ఉత్సవాలు



**ప్రజాపక్షం/ఉట్కూర్ :** ఉట్కూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠవాల లో శుక్రవారం చిల్డ్రన్స్ డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులు బేలున్ చేతబట్టి హ్యాపీ చిల్డ్రన్స్ డే అంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

## వి-హబ్ ప్రోత్సాహాన్ని మహిళా పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని మహిళా పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న విహబ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని మహిళలు మరింత లాభదాయకంగా వ్యాపారాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశమందిరంలో జిల్లాగ్రామీణ అభివృద్ధిసంస్థ, తెలంగాణ విహబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా పారిశ్రామికవేత్తలకు మార్కెటింగ్ వ్యాపారాభివృద్ధి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళలు నిర్వహిస్తున్న చిరువ్యాపారాలను విజయవంతమైన స్టార్టప్‌లుగా అభివృద్ధిచేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలో మహిళలు వివిధ వస్తువులు , ఆహారపదార్థాలకు సంబంధించి తయారవుతున్న ప్రొడక్టులను దేశవ్యాప్తంగా గుర్తింపుపొందేలా మహిళలు తమ ప్రొడక్లతో ముందుకురావాలని కోరారు.
రాష్ట్రప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక పథకాలు అమలుచేస్తుందని వాటన్నింటిని అందిపుచ్చుకొని మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా తమ వ్యాపార సంస్థలను ముందుకు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, విహబ్ మహిళ నైపుణ్య అభివృద్ధిసంస్థ డైరెక్టర్ ఊహ, డిఆర్‌డిఎ పడి చిన్న ఓబులేసు, డిప్యూటి కలెక్టర్లు హర్షవర్ధన్, అశోక్, వివిధశాఖల అధికారులు, జిల్లాలోని మహిళా వ్యాపారస్తులు పాల్గొన్నారు.



**జంతువుల సంరక్షణ అందరి బాధ్యత :**
జంతుసంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేసి, వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్‌హాలులో ఎస్‌పిసిఎ సభ్యులు, పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారులు, మున్సిపల్ , పోలీసుశాఖల ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులు కలిసి జంతు సంక్షేమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.
జంతు సంక్షేమ కార్యక్రమాల అమలు, జంతువుల అక్రమరవాణా నిరోధం, వధశాలలు, పశువుల మార్కెట్లలో సౌకర్యాల మెరుగుదల, తాగునీటి ఏర్పాట్లు, జంతు ఆశ్రయాల నిర్మాణం, అచ్చంపేట, కొల్లాపూర్ , కల్వకుర్తి మున్సిపాలిటిలలో ఏబిసి కేంద్రాల ఏర్పాటువంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులపై హింస జరగకుండా ప్రభుత్వం రూపొందించిన చట్టాలను కఠినంగా అమలుచేయాలని సూచించారు. విద్యార్థుల్లో జంతువులపట్ల దయ, కరుణ పెంపొందించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించాలని విద్యాశాఖను ఆదేశించారు. జంతువులను వాహనాల్లో రవాణాచేసే సమయంలో గాయాలుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనపరిమితికి లోబడి రవాణా చేయరాదని స్పష్టంచేశారు. ఆవులు, దూడలు, గేదెలను వధించడం పూర్తిగా నిషేదమని గుర్తుచేశారు. పశువుల రవాణాపై పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జంతువులు, పక్షులకు ఎవరైనా హానిచేస్తే జంతుహింస నివారణచట్టం ప్రకారం శిక్షలు తప్పవని తెలిపారు.
జంతువులకు ఆహారం, తాగునీరు అందించడం, పెంపుడు జంతువులకు క్రమంతప్పకుండా టీకాలు వేయించడం బాధ్యత అన్నారు. తెలకపల్లి, అచ్చంపేట, బిజినేపల్లి సంతల్లో జంతువులకు ఎటువంటి ఇబ్బందులులేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధితశాఖలకు ఆదేశాలు జారీచేశారు.



## పత్తి రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పత్తి తేమశాతం తగ్గించి దళారుల నుంచి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యశంకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం తెలంగాణరాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లాలోని పత్తికాటన్‌మిల్లులో సిసిఐ అధికారులు రైతులను భ్రష్టుపట్టిస్తున్నారని రైతుసంఘం జిల్లాప్రధాన కార్యదర్శి సూర్యశంకర్‌గౌడ్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సూర్యశంకర్‌గౌడ్ మాట్లాడుతూ పత్తికాటన్‌మిల్లులో సిసిఐ అధికారులు, మిల్లు యజమానులు కుమ్మక్కై పత్తి తీసుకొనిపోయిన రైతులను తేమశాతం తక్కువగా ఉందన్ననెపంచెప్పి ట్రాక్టర్‌లోడ్ పత్తికి రెండుక్వింటాలు బోనస్ ఇవ్వాలని, లారీలోడ్ పత్తికైతే మూడు క్వింటాల్ బోనస్ ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ రైతులను ఉదయం నుండి సాయంత్రం వరకు పత్తి దించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ మామూలు ఇస్తేనే మిల్లులో పత్తి దించుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మిల్లులో సిసిఐ అధికారులు రైతులను రకరకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులకు జరుగుతున్న మోసాన్ని అరికట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఈర్లచంద్రమౌళి, తెలంగాణరాష్ట్ర రైతుసంఘం జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, సాయిలు, పర్వతాలు, బుగ్గస్వామి, రవీందర్, దేశమోని ఆంజనేయులు పాల్గొన్నారు.



## నేటి బాలలే..రేపటి పౌరులు

### ఘనంగా నారాయణ స్కూల్‌లో బాలల దినోత్సవం

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** నేటి బాలలే రేపటి పౌరులు అని నారాయణ పాఠశాల ఏజీఎం వెంకట్‌రెడ్డి అన్నారు. వనపర్తి పట్టణ కేంద్రంలోని శుక్రవారం నారాయణ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నారాయణ పాఠశాల ఏజీఎం వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాల ఏజీఎం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవం కేవలం ఉత్సవం మాత్రమే కాదు, పిల్లల హక్కులు, విద్య, రక్షణ, సమానత్వంపై అవగాహన కల్పించే అవకాశం, ఈ రోజున పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, సదస్సులు నిర్వహించి పిల్లల్లో సృజనాత్మకతను పోత్రహిస్తున్నామన్నారు. అంతేకాక, బాల కార్మికులు, విద్యాహక్కు లేని పిల్లల సమస్యలపై కూడా చర్చలు జరుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమాలు సమాజంలో పిల్లల పట్ల బాధ్యతను గుర్తుచేస్తాయి. నెహ్రూ ఆలోచనలు ఈ రోజున ఇప్పటికి స్ఫూర్తినిస్తాయి. పిల్లలు సమాజంలో సమాన హక్కులతో, స్వేచ్ఛగా ఎదగాలని ఆయన కలలు కన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ బయోదర్ గౌడ్, ఆర్ ఎన్ డి అనిల్, సతీష్, హై స్కూల్ కో ఆర్డినేటర్ నితిన్, మాధురి వైస్ ప్రిన్సిపాల్ రవళి, లక్ష్మి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కృష్ణయ్య కుటుంబానికి బీమా సంస్థ నుంచి 20 లక్షల చెక్కు అందజేత

### గంగాపూర్ గ్రామంలో అక్షరాస్యత అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామ శాఖ వారి ఆధ్వర్యంలో అక్షర సత్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నా బార్డు డిడియం షన్మఖా చారి, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ రిజనల్ మేనేజర్ ఎల్ శీల, హాజరైనారు. అనంతరం జనరల్ ఇన్సూరెన్స్ లో బ్యాంక్ లో సంవత్సరానికి రూ. 1000 చెల్లించడంతో కృష్ణయ్య గౌడ్ అనే ఖాతా దారుడు ప్రమాదవశాత్తు మరణించడంతో ఖాతాదారుడికి భీమా సంస్థ ద్వారా 20 లక్షల రూపాయల చెక్కును కృష్ణయ్య గౌడ్ భార్య ప్రభావతి కి అందజేశారు. ఈ సందర్భంగా నాబార్డు డిడిఎం మాట్లాడుతూ గ్రామీణ వికాస్ బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల సేవలను సౌకర్యాల గుఇంచి ప్రజలకు అవగాహన కల్పించారు. సామాజిక భద్రత పథకలైన ప్రధాన మంత్రి జీవన్ జ్యోే, భీమా యోజన, సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు భాగ్య స్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఏటీఎం రూపే కార్డులను వాడి సమాయాన్ని ఆదా చేసుకోవాలని నాబార్డ డిడియం షణ్ముఖ చారి అన్నారు. యోసా పూరిత ఫోన్ కాల్స్ వస్తే నమ్మకూడదని ఆయన పేర్కొన్నారు. మోసపూరిత ఫోన్ కాల్ ద్వారా డబ్బులు పోగొట్టుకుంటే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఖాతాదారుడు పొదుపు డిపాజిట్లను చేయాలని అలాగే భీమా సౌకర్యాలు వాడుకోవాలని ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా ద్వారా డబ్బులు లభిస్తాయని కుటుంబాలు బాగుపడతాయని ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం షన్మఖాచారి, పేర్కొన్నారు. నాబార్డు వారి సౌజన్యంతో జామ మొక్కల కంపెనీ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐసి మహేశ్వర్ రెడ్డి బ్రాంచ్ మేనేజర్ అశోక్ కుమార్ ఫీల్డ్ ఆఫీసర్ బి నాగప్రతాపరెడ్డి, అకౌంటెంట్ రేవతి , క్యాషియర్ మోహన్, మాజీ వైస్ ఎంపీపీ రాములు, మాజీ గ్రామ సర్పంచులు జనార్దన్ రెడ్డి, అనంత్‌రెడ్డి, మాజీ మూడ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఖాన్, వెంకటస్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర ఖైదీ పరార్

### మూడు బృందాలుగా పోలీసుల గాలింపు


**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌నుండి అంతర్‌రాష్ట్ర ఖైదీ పరార్‌కావడం జరిగిందని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం వీరాపురం గ్రామానికి చెందిన తెలుగు నాగిరెడ్డి అలియాస్ మల్లెపూల నాగిరెడ్డి(33) అనే ఖైదీపై కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఐదు కేసులున్నాయని వాటి విచారణ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాజైలునుండి ఈనెల 11న నాగిరెడ్డిని విచారణకోసం తీసుకొచ్చామని తెలిపారు. ఈనెల 13న గురువారం రాత్రి 10గంటల సమయంలో బాత్‌రూంకు వెళ్లడంతో ముగ్గురు పోలీసు సిబ్బంది కాపలా ఉన్నారని, బాత్‌రూం వెండిలేటర్‌కు అమర్చిన అద్దాలు కొంత పగిలిపోవడంతో ఇదే అదనుగా భావించిన సదరు ఖైది నాగిరెడ్డి బాత్‌రూంలోనే ఉన్నట్లుగా పోలీసులను నమ్మిస్తూ వెండిలేటర్ ద్వారా మెల్లిగా జారుకొని అక్కడినుండి పరారైనట్లు తెలిపారు. కాపలా ఉన్న పోలీసులు నాగిరెడ్డి ఎంతకు బయటికిరాకపోవడంతో బాత్‌రూంలో చూడగా నాగిరెడ్డి కనిపించకపోవడంతో ఒక్కసారిగా పోలీసులు షాక్‌కు గురయ్యారు. ఈవిషయాన్నివెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, స్పందించిన డివిజన్ పరిధిలోని పోలీసుల సహాయంతో ఖైదిని పట్టుకునేందుకు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన ఖైదీ ఆచూకి దొరకలేదని, పోలీస్‌స్టేషన్‌పరిధిలో ఉన్న సిసి కెమెరాలలో ఖైదీ నాగిరెడ్డి ఆచూకి రికార్డుకాలేదని తెలిపారు. ఈఘటనపై కేసు నమోదుచేసి నాగిరెడ్డిని పట్టుకునేందుకు మూడు పోలీసుబృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైది నాగిరెడ్డిపై 50కిపైగా కేసులు ఉన్నాయని ఎస్ఐ మాధవరెడ్డి వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

**ప్రజాపక్షం/మాగనూర్ :** తెలంగాణ రాష్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు ఇవ్వడానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వడ్వట్, అమ్మపల్లి గ్రామాల ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, 48 ప్రొసిడింగ్స్ పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా త్వరత్వరగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. హౌసింగ్ ఏఈ ఆంజనేయులు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇలా నిర్మాణం 400 స్క్వేర్ ఫీట్ నుండి 600 స్క్వేర్ ఫీట్ వైశాల్యంలో నిర్మాణం చేపట్టాలని అనవసర ఖర్చులకు తావు ఇవ్వకుండా నిర్మాణ వ్యయం పెంచవద్దని సూచించారు. ప్రభుత్వం సూచన మేరకు 12 మిల్లీ మిటర్ స్టీల్స్ రాడ్స్‌కి మించి వాడకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 8 ట్రాక్టర్లు ఇసుక అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎంపిడిఓ శ్రీనివాస్, హౌసింగ్ ఎఇ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, శివరాం రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, వడ్వట్ గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు రవీందర్, స్రవంతి రాఘవ్ రెడ్డి పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యం కావాలని గర్జించిన కమ్యూనిస్టు పార్టీ

### సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి
### ఎం.బాల నరసింహ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గల సిపిఐ ఆఫీసులో శుక్రవారం విస్తృత స్థాయి కౌన్సిల్ నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు పరమేష్ గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ భారత కమ్యూనిష్టు పార్టీ (సిపిఐ) భారత గడ్డపై పుట్టి వంద సంవత్సరాలు అవుతుంది. 1925 డిసెంబర్ 26 కాన్పూర్‌లో పురుడు పోసుకున్న భారత కమ్యూనిష్టు పార్టీ భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ కమ్యూనిష్టు పార్టీ అని ఆయన అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోయే శతజయంతి ముగింపు సభ భారీ బహిరంగ సభ వేడుకలకు మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రతి ఇంటి నుండి ఒక ఒక కమ్యూనిష్టు కార్యకర్త వచ్చి ఖమ్మంలో జరిగే శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని అన్నారు.
అదేవిధంగా 100 సంవత్సరాలు ఉత్సవాలలో కమ్యూనిష్టు పార్టీ చేసిన త్యాగాలను పోరాటాలను గుర్తు చేస్తూ పాలకులు చేస్తున్న దోపిడిలను ఖండిస్తూ ఈ నెల 15న బస్సు యాత్ర గద్వాల జిల్లాలో ప్రారంభమై వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా ఖమ్మం వెళుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో కల్తీ కల్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని తద్వారా ప్రజలను తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని ముఖ్యంగా కల్తీకల్లు వల్ల కిడ్నీలు పాడై అనేక మంది చనిపోతున్నారని చాలా మంది ఆ వ్యాధి బారిన పడుతున్నారని దీనిని తక్షణమే ఉన్నత అధికారులు, ఎక్సైజ్ మినిస్టర్ ఈ కల్తీ కల్లు పై చొరవ తీసుకొని దాన్ని నిర్వర్తించాలని అన్నారు. లేకుంటే దీనిపైన ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, కే పద్మావతి ,ఎం.గోవర్దన్ ,కౌన్సిల్ సభ్యులు కోట కదిరి నరసింహ, శీను చాంద్ పాషా పాల్గొన్నారు.

## విజయోత్సవ సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/వెల్దండ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీనుంచి పోటిచేసి భారీమెజార్టీతో నవీన్‌యాదవ్ గెలుపొందడంతో మండల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఫుల్‌జోష్‌గా సంబరాల్లో మునిగితేలారు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే శుక్రవారం ఆపార్టీ కార్యకర్తలు శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై అంబేద్కర్ విగ్రహంముందు టపాసులుపేల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, మాజీసర్పంచ్ భూపతిరెడ్డి, ఎర్రశ్రీనుముదిరాజ్, హరికిషన్, కొయ్యలపుల్లయ్య, పురుషోత్తంచారి, బాణావత్‌శంకర్‌నాయక్, ఎండి. రషీద్, హమీద్, దాసరి మహేష్, భరత్‌గౌడ్ పాల్గొన్నారు.
**ఆత్మకూరు :** ఆత్మకూరు మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్రంలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని గాంధీ చౌక్ నందు బాణసంచకాల్చి మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మొగలి గంగాధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నలగొండ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దామోదర్ , మహేష్, గాలి పంపు శ్రీనివాసులు, సుదర్శని శెట్టి, వెంకట సాయి, రాఘవ, మొబైల్ కాజా, జహంగీర్, వెంకట నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.
**వీపనగండ్ల :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. నవీన్ యాదవ్ గెలుపుపై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య, వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, రావుల నారాయణరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ తో పాటు మాజీ సర్పంచ్ బొల్లారం సుదర్శన్‌రెడ్డి, చిన్నారెడ్డి, చక్ర వెంకటేష్, గోపి, ఎస్.రవీందర్ రెడ్డి, బసవరాజ్ గౌడ్, మహేష్ నాయుడు తదితర నేతలు సంతోష్ వ్యక్తం చేశారు.

# రీల్

## 'జెట్లీ' పోస్టర్ విడుదల



టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. ఈ సినిమాకు సంబధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఇప్పటికే ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది. సత్య ఒక విమానం పైన కూర్చుని వుండగా 'ఐయామ్ డన్ విత్ కామెడీ ' అనే లైన్ అభిమానులను నవ్విస్తుంది. ఇది రితేష్ రానా మార్క్ ఇంటర్టైన్మెంట్ ని సూచిస్తోంది.క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్న జెట్లీని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. భారీ బ్యానర్ల చేతులు కలపడంతో ఇది స్కెలెవెల్ ఎంటర్టైనర్ రాబోతుందనే విషయం స్పష్టమవుతోంది.యాక్షన్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న 'జెట్లీ' లో థ్రిల్స్, ట్విస్టులు, హైవోల్టేజ్ హ్యూమర్ అన్నీ రితేష్ రాణా స్టైల్లో ప్యాక్ అయి రాబోతున్నాయి. మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా ఈ చిత్రంతో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. సత్యతో ఆమె జంటగా కనిపించనుంది. వెన్నెల కిషోర్, అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం కాల భైరవ, సినిమాటోగ్రఫీ సురేష్ సరంగం, ఎడిటింగ్ కార్తిక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైన్ నార్ని శ్రీనివాస్ పని చేస్తున్నారు.

## హృదయాన్ని తాకే ప్రేమ కథ ఇది



అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు. హైదరాబాద్‌లో హీరో అడివి శేష్ అతిథిగా ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాటల రచయిత మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ.. 'రాజు వెడ్స్ రాంబాయి'లో రాంబాయి నీ మీద నాకు పాటను పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. సినిమాలో టైటిల్ సాంగ్‌గా ఈ పాట వస్తుంది. ఒక్క నైట్ లోనే ఈ పాట మొత్తం రాశాను. కథలోని లోతైన భావాలను ఈ పాటలో వ్యక్తీకరించే అవకాశం కలిగింది అన్నారు.



## 'కనకం' సాంగ్ రిలీజ్

మెట్రో శిరీష్, శ్రియ శరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నాన్‌వయోలెన్స్'. ఆనంద కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏకే పిక్చర్స్ నిర్మిస్తుంది.ఈ సినిమా నుంచి యువన్ శంకర్ రాజా కంపోజ్ చేసిన కనకం సాంగ్‌ని రిలీజ్ చేశారు. అదిరిపోయే ఫుట్ ట్యాపింగ్ నెంబర్‌గా ట్యూన్ చేసిన ఈ సాంగ్‌లో యువన్ శంకర్ రాజా, తేజస్విని నందిభట్ల వోకల్స్ కట్టిపడేశాయి. భాష్య శ్రీ అర్థవంతమైన సాహిత్యంతో అలరించారు. మెట్రో శిరీష్ , శ్రియ శరణ్ ఎనర్జిటిక్ మూవ్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో బాబీ సింహా, యోగి బాబు, అదితి బాలన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ ఎన్ఎస్ ఉదయ కుమార్, ఎడిటర్ కాంత్‌గా పని చేస్తున్నారు.

## 'అనంత' టీజర్ లాంచ్



జగపతి బాబు, సుహాసిని ప్రధాన పాత్రల్లో తమిళ దర్శకుడు సురేష్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన అనంత. ఈ సినిమా ఆడియో, టీజర్ లాంచ్ ఈవెంట్ చాలా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ సురేష్ కృష్ణ గారు గొప్ప దర్శకులు. సినిమా అంటే ఎంతో ప్రేమ. ఆయన ఎప్పుడూ కూడా వర్క్ చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు అనంత సినిమాతో వస్తున్నారు. సాయిబాబా తనని నమ్మిన వారందరిని ప్రేమించాడు. నమ్మినా నమ్మకపోయినా ఆయన సేవలు అందించారు. విద్య వైద్యం నీరు ఆయన పరిధిలో చేయగలిగినంత చేశారు సురేష్ కృష్ణ ఎప్పుడు కూడా మంచి సినిమా తీస్తాడు. ఈ సినిమా కూడా అందరూ చూడాలని చూస్తారని కోరుకుంటున్నాను. దర్శకుడు సురేష్ కృష్ణ మాట్లాడుతూ ఇది సత్యసాయి బాబా గారి గురించి ఒక బయోపిక్ చేయాలనుకున్నప్పుడు అప్పుడు ఆయన ఆశ్రమంకి వెళ్ళాను. ఆయన నన్ను చూసి 'ఇంతకాలం ఎందుకు రాలేదు' అని అడిగారు. నేను ఆయన కాళ్ళకి నమస్కరించాను. అది నా మనసుని ఎంతో కదిలించింది. 2011లో ఆయన చనిపోయారు. తర్వాత నేను నా రొటీన్‌లో పడిపోయా. గత ఏడాది జూన్లో ఒక కల వచ్చింది. ఆయన కలలోకి వచ్చి విభూదిని ఇచ్చా. బాబా దగ్గరికి నన్ను మొదటిసారి తీసుకెళ్లిన వ్యక్తికి ఫోన్ చేసి చెప్పాను. అప్పుడు ఆయన మేము పుట్టపర్తిలో ఉన్నాం మీ గురించి మాట్లాడుకున్నామని చెప్పారు. గిరీష్ కృష్ణమూర్తి ఫోన్ చేసి బాబా గారి జీవితంపై సినిమా చేయాలని చెప్పారు. నేనే ఎందుకు ఈ సినిమా డైరెక్టర్ చేయాలని అడిగినప్పుడు.. బాబా కలలోకి వచ్చి మిమ్మల్ని డైరెక్ట్ చేయమని చెప్పారు అన్నారు. బాబా శత జయంతి సందర్భంగా ఈ సినిమా చేయాలని కోరారు. కానీ ఆ సినిమాలో బాబా లాగా ఎవరూ నటించకూడదన్నారు. అప్పుడు నా దగ్గర స్క్రిప్ట్ కూడా లేదు. అనుకోకుండా ఒక మంచి స్క్రిప్ట్ వచ్చింది. ఏదో భక్తి సినిమాలా కాదు. బాషా సినిమా లాంటి కమర్షియల్ స్క్రిప్ట్ వచ్చింది. జగపతిబాబుకి సినిమా గురించి చెప్పినప్పుడు ఆయనకు చాలా నచ్చింది. అద్భుతమైన పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఆయన డైలాగ్ డెలివరీ చూసినప్పుడు సూపర్ గా అనిపించింది. సుహాసిని చాలా ఇంపార్టెంట్ రోల్ చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత సాయి మాధవ్ బుర్ర, డైరెక్టర్ వీర శంకర్, రాకేందు మౌళి, గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి, శ్రీ రజిని, చోటా కె నాయుడు పాల్గొన్నారు.

## ఇట్లు మీ ఎదవ 21న రిలీజ్

త్రినాధ్ కఠారి హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో సంజీవని ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాత బళ్లారి శంకర్ నిర్మిస్తున్న యూత్ఫుల్ ఎంటర్టైనర్ ఇట్లు మీ ఎదవ. సాహితీ అవాంచ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వెయ్యేళ్ళు ధర్మంగా వర్ధిల్లు అనేది ట్యాగ్ లైన్. నవంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది. నైజాంలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి విడుదల చేయనుండగా, ఆంధ్ర, సీడెడ్ లో ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ రిలీజ్ చేయనుంది. ఈ రెండు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో సినిమా విడుదల కానుంది. ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, గోపరాజు రమణ, దేవీ ప్రసాద్ కీలక పాత్రలు పోషించారు.





## చిన్న పిల్లలకు సందేశాన్నిచ్చే 'మాస్టర్ సంకల్ప్'

పలు ప్రతిష్టాత్మక అవార్డులు పొందిన చిల్డ్రన్ ఫిలింస్ రూపొందించి దర్శక నిర్మాతగా తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు డా.భీమగాని సుధాకర్ గౌడ్. ఆయన శ్రీ లక్ష్మి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్, సంతోష్ ఫిలింస్ బ్యానర్స్‌పై ఆదిత్య, క్రియేటివ్ జీనియస్, విక్కీస్ డ్రీమ్, డాక్టర్ గౌతమ్, అభినవ్ వంటి బాలల చిత్రాలను ప్రేక్షకులకు అందించారు. తమ ప్రొడక్షన్‌లో ఆరవ చిత్రంగా మాస్టర్ సంకల్ప్‌ను మన ముందుకు తీసుకొస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ నటులు శివాజీ రాజా మాస్టర్ సంకల్ప్ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత డా.భీమగాని సుధాకర్ గౌడ్, శ్రీ మిత్ర చౌదరి, పెంచల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ పిల్లలు బాగుంటేనే సమాజం బాగుంటుంది. బాలల కోసం నిస్వార్థంగా సినిమాలు రూపొందిస్తున్న డా.భీమగాని సుధాకర్ గౌడ్ అభినందనీయులు. వ్యాపారమయమైన ఇండస్ట్రీలో పిల్లల కోసం సినిమాలు చేస్తున్న ఆయన గొప్ప మనసును మనమంతా ప్రశంసించాలి.

## 'ప్రెట్టి బేబీ' పాట విడుదల

చార్మింగ్ స్టార్ శర్వా తన అప్ కమింగ్ మూవీ 'బైకర్'లో మోటార్‌సైకిల్ రేసర్‌గా ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువి క్రియేషన్స్ ఈ సినిమాని నిర్మించింది. ఫస్ట్ లుక్, ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. 'ప్రెట్టీ బేబీ' వీడియో సాంగ్‌ని రిలీజ్ చేసిన మేకర్స్ బైకర్ మ్యూజిక్ ప్రమోషన్స్‌ని కిక్ స్టార్ట్ చేశారు. జిబ్రాన్ ఈ పాటని అదిరిపోయే బీట్స్‌తో డ్యాన్సింగ్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. జిబ్రాన్, యాజిన్ నిజార్, సుబ్లాషిని ఎనర్జిటిక్ వోకల్స్ తో ఆకట్టుకున్నారు. కృష్ణ కాంత్ లిరిక్స్ చాలా క్యాచిగా వున్నాయి. ఈ సాంగ్‌లో శర్వా, మాళవిక నాయర్ కెమిస్ట్రీ అదిరిపోయింది. శర్వా డ్యాన్స్ మూమెంట్స్ మెస్మరైజింగ్‌గా వున్నాయి. ఈ సాంగ్ ఇన్స్టంట్ చార్ట్ బస్టర్‌గా నిలిచింది. బైకర్ డిసెంబర్ 6న థియేటర్లలో రిలీజ్ కానుంది.





## అఖండ తాండవం టైటిల్ పాట ఆవిష్కరణ

నందమూరి బాలకృష్ణ హీరోగా సంయుక్త హీరోయిన్‌గా బోయపాటి దర్శకత్వంలో తెరకెక్కిన అఖండ 2 తాండవం సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ సినిమాకు సంబధించిన టైటిల్ పాటను ఆవిష్కరించారు. 'ఖండ ఖండ ఖండిత దండ యోగ మండిత అఖండ తాండవం' అనే టైటిల్ పాటను విడుదల చేశారు. ఈ పాటను త్రిపురనేని కళ్యాణ్ చక్రవర్తి రాయగా, శంకర్ మహదేవన్, కైలాష్ ఖేర్ ఆలపించారు. ఈ పాటకు శంకర్ కొరియోగ్రఫీ చేశారు. గతంలో వచ్చిన సక్సెస్ ఫుల్ సినిమా అఖండ సినిమాకు సీక్వెల్ గా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శివ భక్తుల నేపథ్యలో సాగే ఈ సినిమాలో నందమూరి బాలకృష్ణ శివుడి భక్తుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. సినిమాకు సంబధించిన అన్ని పనులు పూర్తి చేసి డిసెంబర్ 5 తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతల్లో ఒకరైన రామ్ ఆచంట తెలిపారు. గ్రాఫిక్స్ వర్క్ ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు.

## కొత్త ఊపునిచ్చాయ్

(మొదటి పేజీ తరువాయి)

పోషిస్తోందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ స్థానిక నాయకత్వం అద్భుతంగా కష్టపడిందన్నారు. వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రాజకీయాలకు కొత్త అయినప్పటికీ అద్భుతంగా పనిచేశారన్నారు. ఆమెకు అభినందనలు చెప్పారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బిఆర్ఎస్ గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా తన పాత్రను అద్భుతంగా పోషించిందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టడంలో బలంగా బిఆర్ఎస్ పనిచేస్తుందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడమన్నారు. ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసన్నారు. ప్రతి సర్వేలో బిఆర్ఎస్ గెలుస్తుందని ఎలా చెప్పిందని, ఆఖరి మూడు రోజుల్లో ఏం జరిగిందో ప్రజలు చూశారన్నారు. అయినప్పటికీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బిఆర్ఎస్‌నే అని ప్రజలు స్పష్టం చేశారని తెలిపారు. 2014 నుంచి 2023 వరకు దాదాపు ఏడు ఉప ఎన్నికలు జరిగాయని, ఈ ఉప ఎన్నికల్లో అప్పటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికల్లో కూడా గెలవలేదన్నారు. దాదాపు ఐదింటిలో తాము గెలిచామని అన్నారు. జిహెచ్ఎంసి ఎన్నికలో కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకటి రెండు సీట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజల తరఫున వాదనను బలంగా వినిపించామన్నారు. ప్రజా సమస్యలను, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లామని చెప్పారు. హామీల ఎగవేతను బాకీ కార్డుల రూపంలో ప్రధాన చర్చనీయాంశంగా చేయగలిగామన్నారు. ఇది బిఆర్ఎస్ సాధించిన విజయమని చెప్పారు.

## శిరసావహిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కిషన్ రెడ్డి చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ఓటమిని విశ్లేషించుకుంటామన్నారు. పాతబస్తీలో కూడా ఏ పార్టీ గెలవదన్నారు. ఎంఐఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ పార్టీ గెలిచిందని తెలిపారు. రేవంత్ రెడ్డి ఏం చేశాడని అనుకూలంగా ఆయనకు ఓటేయాలని ప్రశ్నించారు. రెండు పార్టీలు కూడా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదని ఆరోపించారు. దీనిపై తాము ఫిర్యాదు చేస్తామన్నారు. జిహెచ్ఎంసి ఎన్నికలపై దృష్టిపెట్టామని, జిహెచ్ఎంసి మేయర్ పదవి గెలుచుకోవడమే తమ లక్ష్యమని కిషన్ రెడ్డి తెలిపారు.

**జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ కాదు.. ఎంఐఎం అభ్యర్థిగా గెలిచినట్లు భావిస్తాం : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు**

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కాకుండా, ఎంఐఎం అభ్యర్థి గెలిచినట్లుగా భావిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. నాంపల్లి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో బిజెపి ఎప్పుడూ గెలవలేదన్నారు. ఈసారి తమకు ఓట్లు భారీగా పెరిగాయని తెలిపారు. ఎచ్చే ఎన్నికల్లో తప్పకుండా సత్తా చాటుతామన్నారు. జూబ్లీహిల్స్‌లో బిజెపికి ఓటు వేసిన ప్రజలకు, పార్టీ కోసం కృషి చేసిన కార్యకర్తలకు రాంచందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు వరకు అధికార కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. బిహార్‌లో ఎన్‌డిఏ కూటమి ఘన విజయం సాధించిందన్నారు. బిహార్ ఫలితాలు భవిష్యత్‌లో దేశమంతా వచ్చే ఫలితాలకు నిదర్శనమని చెప్పారు. బిహార్‌లో కాంగ్రెస్ కంటే ఎంఐఎం పార్టీకే ఎక్కువ సీట్లు వచ్చాయన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే బాగుంటుదని దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తామని దీమా వ్యక్తం చేశారు.

## అబద్ధాల బిఆర్ఎస్, మతోన్మాద బిజెపి ఓటమి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటర్లు అబద్దాల బిఆర్ఎస్‌ను మతోన్మాద బిజెపిని ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం శుక్రవారం హిమాయత్ నగర్‌లో మహమ్మద్ సలీం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇటి నరసింహ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో హోరాహోరీగా రాజకీయ పార్టీలు ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కెటిఆర్ అహంకార పూరితంగా వ్యక్తిగత దూషణలు దిగాడమే కాకుండా పచ్చి అబద్దాలను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ప్రయత్నం చేశారు.
బిజెపి అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడకుండా మతోన్మాద రాజకీయాలను ప్రేరేపించి ఓట్లు రాబట్టుకోవాలని అనేక కుట్రలకు దిగారు. వీటన్నిటిని పక్కన పెట్టి వారికి గుణపాఠం చెప్పే విధంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ప్రజలు తమ ఓటు ద్వారా పట్టం కట్టడాన్ని స్వాగతిస్తున్నామని, జూబ్లీహిల్స్ ప్రజల పోరాటాన్ని అభినందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన టువంటి హామీలను నెరవేరుస్తూ పచ్చి అవకాశవాద రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే వారికి అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉన్నదని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రజలు ఎటువంటి భ్రమలకు లోను కాకుండా తమ కోసం పనిచేసే నాయకుడుగా ఉన్న నవీన్ యాదవ్‌కి ఓటు వేసి అత్యధిక మెజార్టీలో గెలిపించడం తెలంగాణ రాజకీయాల్లో శుభ సూచికమని తెలిపారు. ఈ ఉప ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించడం కోసం సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ చేసిన కృషిని అభినందించారు.
ఈ సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, ఎం.నరసింహ చంద్ర మోహన్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, సలీం ఖాన్, శంషుద్దీన్, ఉమర్ ఖాన్, కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్ మహమూద్, వెంకటయ్య, గ్యార నరేష్, చైతన్యలు హాజరయ్యారు.

## అవమానిస్తున్నారు!

(మొదటి పేజీ తరువాయి)

దార్శనికత మన మనస్సాక్షికి స్ఫూర్తినిస్తూనే ఉందని, మన సమష్టి చర్యలను రూపొందిస్తోందన్నారు. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ నెహ్రూ తన దార్శనిక, నిర్భయ నాయకత్వం ద్వారా స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలకు పునాది వేశారని, దేశానికి కొత్త దిశానిర్దేశం చేశారని అన్నారు. ఆయన ఆదర్శాలు, విలువలు నేటికీ మనకు స్ఫూర్తిదాయకంగా కొనసాగుతున్నాయని చెప్పారు. నెహ్రూ జీ జయంతి సందర్భంగా 'హింద్ కే జవహర్'కు గౌరవపూర్వక వందనాలు' అని గాంధీ ఎక్స్‌లో హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. రమేష్ నెహ్రూ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తీవ్రంగా మండిపడ్డారు. నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించే వ్యక్తి 136వ జయంతి అని, అయితే ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఆయన అపారమైన సహకారాన్ని ప్రస్తుత ప్రధానమంత్రి, ఆయన బృందం తిరస్కరించాలని, అవమానించాలని, వక్రీకరించాలని, రాక్షసంగా చూపించాలని చూస్తున్నారని మండిపడ్డారు. నెహ్రూ తన వారసత్వం, విజయాలపై ఈ దాడి నుండి బయటపడాలని ఎక్స్‌లో వెల్లడించారు. 20వ శతాబ్దపు చరిత్ర నుండి ఆయనను తొలగించాలని నిశ్చయించుకున్న వారు తమ స్వంత లోతైన అభద్రతాభావాలను, సంక్లిష్టతలను ప్రతిబింబిస్తున్నారన్నారు. 'నవంబర్ 14, 1949న ఆయన 60 ఏళ్లు నిండినప్పుడు, రాజాజీ, సర్దార్ పటేల్ పరిచయాలతో కూడిన భారీ, అత్యంత పాండిత్యవంతమైన అభినందన గ్రంథాన్ని ఆయనకు అందించారు. ఇది ఇప్పటికీ స్ఫూర్తిదాయకమైన పఠనానికి ఉపయోగపడుతుంది. జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్ http://nehruarchive.in ప్రతిష్టాత్మక డిజిటల్ ఆర్కైవ్ మొదటి దశ రానున్న కొద్ది రోజుల్లో అతి త్వరలో ప్రత్యక్ష ప్రసారం కానుందని, ఇది ఒక గొప్ప ప్రారంభం అవుతుందన్నారు.

కాగా, 'పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయనకు హృదయపూర్వక నివాళులు! ఆధునిక భారతదేశ దార్శనిక శిల్పి, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం యొక్క ఆదర్శాలు దేశాన్ని అభివృద్ధి, సాంకేతిక పురోగతి వైపు నడిపిస్తూనే ఉన్నాయి. ఆయన వారసత్వం మనకు మార్గదర్శక కాంతిగా మిగిలిపోయింది' అని కాంగ్రెస్ తన అధికారిక హ్యాండిల్ ద్వారా పేర్కొంది.

## జయకేతనం

(మొదటి పేజీ తరువాయి)



అత్యంత కట్టుదిట్టమైన భద్రతాచర్యల మధ్య చేపట్టింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం లభించింది. మొత్తం 101 పోస్టల్ ఓట్లు. 96 ఓట్లు చెల్లుబాటు కాగా, కాంగ్రెస్ 43, బిఆర్ఎస్ 25, బిజెపి 20 ఓట్లు పోలయ్యాయి. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపులో నవీన్ యాదవ్ 8,911 ఓట్లు సాధిస్తే, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 8,864 ఓట్లు వచ్చాయి. బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి 2,167 ఓట్లు వచ్చాయి. మొత్తంగా తొలి రౌండ్ ముగిసేసరికి కాంగ్రెస్ అభ్యర్థికి 47 ఓట్ల ఆధిక్యం లభించింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తొమ్మిది రౌండ్‌లలో అత్యధిక ఆధిక్యంతో దూసుకుపోయారు. కౌంటింగ్ మొత్తం కాంగ్రెస్‌కు అనుకూలంగా సాగింది. ఒక్క రౌండ్‌లో కూడా బిఆర్ఎస్‌కు ఆధిక్యం రాలేదు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 7 డివిజన్‌లలో కాంగ్రెస్ పార్టీనే పైచేయి సాధించింది. ఒక్క షేక్‌పేట్ డివిజన్‌లో మాత్రమే కాస్త పోటీ కనిపించింది. మిగిలిన అన్ని డివిజన్లలో ఏకపక్షంగా సాగిపోయింది. అన్ని డివిజన్ల ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు. మొత్తం 7 డివిజన్‌ల ఓట్లను 10 రౌండ్‌లలో లెక్కించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఈసారి కాంగ్రెస్ అత్యధిక మెజారిటీని సాధించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు ఉప ఎన్నికల్లోనూ, కంటోన్మెంట్ (2024), ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లలో వరుస విజయాలు సాధించడంతో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

**విజేత నవీన్ యాదవ్‌కు ధ్రువీకరణపత్రం అందచేసిన రిటర్నింగ్ అధికారి సాయిరాం**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించారు. ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఎంపికైనట్లు రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం ప్రకటించారు. విజేతకు రిటర్నింగ్ అధికారి గెలుపునకు సంబంధించిన ధృవీకరణపత్రం అందజేశారు. నగరంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసింది. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో సాగిన లెక్కింపు ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పర్యవేక్షించారు. అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావులు సజావుగా జరిగేలా సమన్వయం చేశారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. 10 రౌండ్‌లలో ముగించారు.

**సరికొత్త రికార్డు సృష్టించిన నవీన్ యాదవ్**

ఈ విజయంతో నవీన్ యాదవ్ నయా రికార్డ్ సృష్టించారు. జూబ్లీహిల్స్ నియోజవర్గంలో ఇప్పటివరకు అత్యధిక మెజార్టీ పిజెఆర్ కుమారుడు విష్ణు పేరిట(2009లో 21,741) ఉంది. మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ 2014లో 9,242, 2018లో 16,004, 2023లో 16,337 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తాజాగా జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,658 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా రికార్డ్ సృష్టించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పలు పార్టీలు, ఇండిపెండెంట్లుగా 55 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో 13 మందికి త్రీ డిజిట్ ఓట్లు రాగా, ఒకరికి సింగిల్ డిజిట్ ఓట్లు పోలయ్యాయి. మిగతా వారికి డబుల్ డిజిట్‌లో ఓట్లు వచ్చాయి. వీరందరికంటే నోటాకే అధిక ఓట్లు రావడం విశేషం. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిల తర్వాత నోటాకే అధిక ఓట్లు రాగా, వాటిలో రెండు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా ఉన్నాయి. ఎన్నికల విధుల్లో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు అవకాశం ఉంటుంది. అంటే విధుల్లో ఉన్న అధికారుల్లో ఇద్దరు నోటాకు ఓటేసినట్లు వెల్లడైంది. 924 మంది ఓటర్లకు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అభ్యర్థులెవరూ నచ్చకపోవడంతో నోటాకు జై కొట్టారు.

**భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు పాదాభివందనం : వల్లాల నవీన్ యాదవ్**

భారీ మెజారిటీతో గెలిపించిన జూబ్లీహిల్స్ ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. తనని నమ్మి ఓటు వేసిన అందరికీ నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ కార్యకర్తలు ఎంతో కష్టపడి తనను గెలిపించుకున్నారన్నారు. తనపై, తన కుటుంబంపై వ్యక్తిత్వంపై దెబ్బతీస్తూ ఓట్లు అడిగారని, జూబ్లీహిల్స్ ప్రజలు గట్టి సమాధానం ఇచ్చారని అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేకనే ప్రచారంలో చెప్పుకోలేదని అన్నారు. కేవలం తన గురించి దుష్ప్రచారం చేసి గెలవాలని బిఆర్ఎస్ చూసిందని ఆరోపించారు. రిగ్గింగ్, దౌర్జన్యం అనేవి తప్పుడు మాటలన్నారు. బెదిరిస్తే ప్రజలు ఓటు వేసే రోజులు ఎప్పుడో పోయాయని, ఎన్నికల్లో రిగ్గింగ్ రోజులు ఎప్పుడో పోయాయన్నారు. బిఆర్ఎస్ గెలిచిన సమయంలో కక్ష పూరిత రాజకీయాలు చేశారని, తాను అలాంటి రాజకీయాలు చేయనని అన్నారు. ఈ ప్రాంత సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తా అన్నారు. అభివృద్దే తన ఎజెండా అని అన్నారు. అందరిని కలుపుకొని పని చేసి జూబ్లీహిల్స్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని నవీన్ యాదవ్ అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com